ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రి



4 అణాలు

12-9-1956


ANDHRA PATRIKA

ILLUSTRATED WEEKL



"ద్రోణాచార్య" ప్రతిమ (జయపూర్)

—ఫొటో : వేక్కల మునుస్వామి



హళేబీడ్, విఘ్నేశ్వర విగ్రహం

వినాయకచవితి (8-9-1956) పర్వానికి సంబంధించిన చిత్రాలు, వ్యాసాలు
25 నుండి 32 వరకు పుటలలో చూడండి.

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 51
సంచిక 2
12.9-56

దుర్ముఖ భాద్రపద శుద్ధ అష్టమి బుధవారం

విషయానుక్రమణిక

★

ముఖచిత్రం : మీనాకుమారి

ఉన్నత విద్యాభ్యాసానికి విదేశాలకు వెళ్లే

భారతీయ విద్యార్థులు అర్భకులు కారు

★

లండన్‌లో వారికోసమేర్పడిన సంస్థను రద్దు చేయాలి

సుశిక్షితులైన సాంకేతిక శాస్త్రజ్ఞులు లేక దేశంలో అనేక పరిశ్రమలు అభివృద్ధి చెందలేక పోతున్నవి. వేల సంఖ్యలో భారతీయ యువకులు విదేశాలకు వెళ్లి శిక్షణ పొందివస్తున్నారు. అయినా వాళ్లను ప్రభుత్వం వినియోగించుకోలేక పోతున్నది: ఏమిటీ వైపరీత్యమని యూరప్ యాత్రానుభవాలపై వ్రాసిన ఈ మూడవవ్యాసంలో ఆంధ్రపత్రిక ఢిల్లీ విలేఖరి శ్రీ కృష్ణ ప్రశ్నిస్తున్నారు లండన్‌లో భారతీయ విద్యార్థుల యోగక్షేమాలపట్ల శ్రద్ధవహించడానికి హైకమీషనర్ కార్యాలయ యాజమాన్యాన పని చేస్తున్న సంస్థ అసమర్థతను నిరూపిస్తూ దాన్ని వెంటనే రద్దుచేయడం మంచిదని సూచిస్తున్నారు.

ప్రతి ఆంగ్లేయుడూ తానెక్కడికిపోతే అక్కడే ఒక "చిన్న ఇంగ్లండు"ను సృష్టించుకోగలడని ప్రతీతి. మనదేశంలో వేసవికబ్బులన్నీ బ్రిటిష్‌పాలన పెట్టినభిక్షే. కొరుసైజు బొమ్మల్లో కనిపించే ఉద్యానవనంలాగా ప్రతి కిటికీని బ్రిటిష్‌వారు అతి అందమైన పూలకుండీ పెట్టి బహుశ్రద్ధగా అలంకరించుకుంటారు. కిటికీల గాజు తలుపులను మచ్చుకైనా ఒకమచ్చ లేకుండా ఎంతో పరిశుభ్రంగా తళతళ మెరిసిపోయేలా తోమి వుంచుకుంటారు. ఎంత నిరుపేద ఆంగ్లకుటుంబంలోనైనా ఇంటిపరిశుభ్రత విషయంలో ఈ విశిష్టలక్షణాలన్నీ కొట్ట వచ్చినట్టు కనిపిస్తుంటాయి.

ఆమాటకువస్తే, ఎక్కడుబడితే అక్కడే ఒక "చిన్న ఇంగ్లండు"ను సృష్టించుకోగలిగిన శక్తి సామర్థ్యాలు ఒక్క బ్రిటిష్‌వారి సొమ్మేకాదు; ఎక్కడికిపోతే అక్కడే ఒక "చిన్న ఇండియా"ను సృష్టించుకోగలిగిన శక్తిసామర్థ్యాలు భారతీయులకూ వున్నవి.

జెనీవాలో నేనొక భారతీయుణ్ణి కలుసుకోవడం తటస్థించింది. అతడున్నచోటుకు వెళ్ళేసరికి, అతగాడు ఆ ఇంటి కాపలా మనిషితో హోరాహోరీగా ఘర్షణపడుతున్నాడు. ఆ ఘర్షణఅంతా ఒక దువ్వెన కోసం! తన గదిలో వున్న దువ్వెనను ఎవరో దొంగిలించారని మనవాడి వాదన. ఆ కాపలా మనిషిని దువ్వెన తెచ్చి ఇవ్వమంటాడు.

కుళ్లు; ఛండాలం!

శ్రీ దేవదాస్ గాంధి ధర్మమా అని నాకు లండన్‌లోని ఒక ఇండియన్ రెస్టారెంటులో మామూలుగా భారతదేశపు పద్ధతిలో తయారు చేసిన భోజనం లభ్యమైంది. ఈ రెస్టారెంటు భారత హైకమిషనర్ కార్యాలయానికి చాలా సమీపంలోనే ఒక పక్క సందులో వుంది. ఆ హోటల్లో ప్రవేశించగానే, "అమ్మయ్యా—మళ్ళీ భారత దేశంలో ప్రవేశించానురా బాబూ!" అనిపించింది. పాశ్చాత్యుల నవనాగరికతా వాసనలతో "వర్థిల్లిన" భారతదేశం కాదు అది! బొంబాయి మహానగరంలో ఎగ్జిక్కోలానికీ ఆలవాలమైన భిండీ బజార్‌ను, పాత ఢిల్లీలోని గుర్రంపఘాయిష్ఠమయిన కొరియాపాల్‌ను జ్ఞప్తికి తెచ్చే 'భారతదేశం'. ఒకటే దుర్వాసన! కుళ్లు, ఛండాలం అంతా పొరలమీద పొరలుగా పేరుకొని పోయివుంది ఆ భవనరాజంలో! అక్కడి బల్లలందరూ అమిత అసహ్యం కలిగించే గుడ్డలు వేసుకుని వున్నారు. ఆహారం తినడానికి ఉపయోగించే ఫోర్కులను, కత్తులనూ జన్మలో శుభ్రపరచిన పాపాన పోయినట్లు కనబడలేదు; జిడ్డు ఓడుతూ దుమ్ముకొట్టుకుని వున్నవి.

★ భారతీయ విద్యార్థులు అర్భకులు కారు ★


అదంతా చూస్తే, వహ్వా! ఎంత రమ్యంగా వుందీ, మనవాళ్ళ రెస్టరెంటు అనిపించింది

ఈ హోటలు విషయం చూస్తే, నాకు 1924 నాటి మనరాజకీయ పరిణామం జ్ఞాపకానికి వచ్చింది స్వరాజ్యపక్షం లోపలినుంచే భారతరాజ్యాంగాన్ని భగ్నంచేయాలనే సంకల్పంతో శాసనసభల్లో ప్రవేశించిన సమయమది! బ్రిటిష్ కామన్స్వెల్తు రాజధాని నగరంలో నే తిష్ఠ వేసి బ్రిటిష్‌వారి జీవితవిధానాన్ని ధ్వంసంచేయడానికి భారతీయులు చేస్తున్నప్రయత్నమేమనిపించింది ఈ రెస్టరెంటు నిర్వహణవిధానాన్ని చూస్తే! అలాగాకపోతే, దీన్ని నిర్వహిస్తున్న పెద్దలందరినీ "అనధికార భారతీయ రాయబారులని భావించినా భావించవచ్చు! వీరందరూ "నిరాడంబరజీవనం; ఉదాత్త భావవిహారం" అనే మహాదాదర్శ సందేశాన్ని వ్యాపింపజేయడానికి కంకణం కట్టుకున్న ప్రబుద్ధులేమోననికూడా అనిపించింది. భారతీయ దివ్యసంస్కృతిని నిస్వార్థ బుద్ధితో ఈ విధంగా వీరు ప్రపంచ పరివ్యాపం చేస్తున్నందుకు "సంబర"పడ్డానని వేరే చెప్పడమెందుకు? భారతీయ విజ్ఞాన వీచికను, సాంస్కృతిక ప్రాభవాన్ని నలిదిశలా ప్రసరింపజేయడానికి మౌలానా ఆజాద్ నాయకత్వన కోట్లకొద్దీ ధనం వ్యయపరిచి దేశదేశాలకు సుహృద్భావ రాయబారవర్గాలను, సాంస్కృతిక ప్రతినిధివర్గాలను, సొంతడబ్బారాయుళ్లు ముఠాలను పంపడం జరుగుతున్నది ఈ దౌత్యవర్గాలయాత్రామహిమ, ప్రతిఫలమే కాబోలు ఈలండన్ రెస్టరెంటుఅనిపించింది; ఇదంతా చూస్తూంటే, "సబ్బు వాడకూడదు; గడ్డం చేసుకోవడం అనవసరం" అని మహార్ష టాండన్ నీతి సూత్రప్రాయంగా నిర్వచించిన మహత్తర సందేశం కూడా మెరుపు మెరిసినట్లు స్ఫురణకు వచ్చింది

పులిసిచూసి నక్కవాత

ఇండియా హౌస్‌కు సమీపంలో వున్న ఈ రెస్టారెంటు భారతీయ సంస్కృతికి ఒకవిధంగా 'ఉత్తమ' ప్రతిబింబమనే చెప్పవచ్చునేమో! ఎందుచేతనంటే మిగతా ఇండియన్ రెస్టారెంట్ల పరిస్థితి మరీ అధ్వాన్నంగా వున్నది. ఇవన్నీ పాశ్చాత్యుల యజమాన్యాన నడిచే హోటళ్ల ఆడంబరాలను చౌకబారుగా అనుకరిస్తూ, వాటిపారిశుద్ధ్యప్రమాణాలను పాటిస్తున్నట్లు నటిస్తూ, వసతి సౌకర్యాలకు వసూలుచేసే రేట్లను బాగా పెంచివేసినవి మొత్తంమీద వీటి ధోరణి అంతా పులినిచూసి నక్క వాతపెట్టుకున్నట్టే వున్నదని చెబితే అతిశయోక్తికాదు. పైకి అతిడాంబికంగా కనిపించడమేగాని, శ్రద్ధగాచూస్తే ఈ రెస్టరెంట్లన్నిటిలో నూ పెద్ద వ్యత్యాసమేమీ కనిపించదు

భారతదేశం శ్రేయోరాజ్యం. సోషలిస్టు వ్యవస్థ ప్రాతిపదికగా సామాజిక పునర్నిర్మాణాన్ని సాధించాలనే లక్ష్యంతో పని చేస్తున్నది. కేవలం కాగితంమీద కాకుండా



భారత ఆర్థిక మంత్రిగా నియమితులైన శ్రీ టి. టి. కృష్ణమాచారి

వాస్తవానుభవంలో సర్వసమానత్వాన్ని స్థాపించదలుచుకున్నదిసోషలిజముకు ప్రాతిపదిక ఇటీవల ఒక సందర్భంలో లండన్‌లో భారతదేశపు హైకమిషనర్ నివాస భవనాన్ని గురించి తెలియజేశాను దాని ఉనికి భాగ్యవంతులు, ఘరానా కుటుంబాలవారు నివసించే ప్రాంతంలో. హైకమిషనర్ కార్యాలయం యాజమాన్యాన ఒక విద్యార్థి వసతి గృహాన్ని కూడా నిర్వహిస్తున్నారు అక్కడ పక్కలమీద గుట్టలు గుట్టలుగా బొద్దింకలు పడిఉన్నవంటే, ఈ హాస్టలు నిర్వహణం ఎంత "సౌలభ్యంగా" వుందో ఊహించవచ్చు.

పిల్లలుపోయినా, పురిటికంపు!


లండన్‌లో విద్యాభ్యాసం చేస్తున్న ఈ విద్యార్థుల యోగక్షేమాల విషయమై శ్రద్ధ వహించడానికి ఇండియా కార్యాలయం డబ్బును నీళ్ళలాగ ఖర్చుచేస్తూ ఒక వ్యవస్థను పోషిస్తున్నది. ఇది ఒకప్పుడు బ్రిటిషు వారు తమ దేశంలో చదువుకోడానికి వచ్చే భారతీయ విద్యార్థుల రహస్య కార్యకలాపాలనుకనిపెట్టి, గూఢచారి అవసరమైన చర్యలు తీయడానికి స్థాపించిన వ్యవస్థ. పిల్లపోయినా, పురిటికంపువదలనట్లు ఈవ్యవస్థను ఇప్పటికూడా మనవాళ్లు బహు శ్రద్ధగా పోషించుకువస్తున్నారు దీనిప్రయోజనమేమిటి? ఇప్పటికీ దీన్ని పోషించవలసిన అగత్యమేమిటని ప్రశ్నించే నాథుడు మౌలానా ఆజాద్ విద్యాశాఖ మంత్రిగా వున్నంతకాలం ఈ విషయమై ప్రశ్నించడం ఎవరికీసాధ్యపడదు. ఆయన సృష్టించుకుంటున్న "విస్తృత సామ్రాజ్యం"లో ఇదొక ప్రముఖభాగం.

ఇక్కడ సందర్భం వచ్చిందికాబట్టి ఒక విషయం తెలియజేస్తాను సొంతడబ్బా అని దురభిప్రాయ పడవద్దని ప్రార్థన. భారతీయ విద్యార్థుల యోగక్షేమాలను గురించి శ్రద్ధ వహించడానికి ఉద్దేశించిన ఈ సంస్థ ఏ విధంగా పనిచేస్తున్నదీ దీన్నిబట్టి తెలుస్తుంది.

నా కుమారులిద్దరు ఇంగ్లండులో శిక్షణ పొందుతున్నారు భారతీయ విద్యార్థుల విషయమై శ్రద్ధవహిస్తున్న ఈ సంస్థద్వారానే వారిద్దరినీ అక్కడ శిక్షణలో ప్రవేశపెట్టడం జరిగింది. వీరి విద్యాభ్యాసానికి కావలసిన ఏర్పాట్లన్నీ నేనే స్వయంగా చేసుకున్నాను. కుమారులను బ్రిటన్‌లోని ఏ శిక్షణాలయంలోనైనా చేర్చాలంటే, లండనులోని హైకమిషనర్ కార్యాలయానికి చెందిన విద్యాశాఖద్వారా ఆయా శిక్షణాలయాలను తిరిగి అభ్యర్థించడం అవసరమని నాకు వర్తమానం వచ్చింది.

ఒక్క ఉత్తరం ముక్క లేదు!

అంటే, కథ అంతా ఇక్కడే మన ఎంప్లాయ్‌మెంటు ఎక్స్ఛేంజీల తంతుకు



జీవితభీమా కార్పొరేషన అధ్యక్షుడు శ్రీ హెచ్. ఎమ్. పటేల్



జీవిత భీమా కార్పొరేషన్ బందరు ప్రాంతీయ కార్యాలయానికి మేనేజరుగా నియమితులైన శ్రీ వేమవరపు వెంకటాచలం.

తుల్యంగా తయారైందన్న మాట! అక్కడ నా పిల్లలిద్దరూ బాగా చదువుకుంటున్నారని గాని, చదువుకోవడం లేదని గాని, వారి శిక్షణ కాలం ఫలానా అప్పటికి పూర్తికావస్తున్నదని గాని, శిక్షణ పూర్తికాగానే వారి సేవను మాతృదేశాభ్యుదయానికి జరుగుతున్న కృషిలో ఉపయోగించుకోడానికి ఫలానా ఏర్పాటు జరుగుతున్నదని గాని ఈ లండన్ సంస్థనుంచి ఎన్నడూ నాకు ఒక్క ఉత్తరం ముక్క అయినా వచ్చిన పాపాన పోలేదంటే నమ్మండి! భారతీయ హైకమిషనరు కార్యాలయంలోని విద్యాశాఖ అధికారులకు అసలు ఈ కుర్రవాళ్లు అక్కడ శిక్షణ పొందుతున్నారనే విషయమైనా తెలుసునా అని నా సందేహం. ఇదొకటే కాదు, ఇలాంటి ఉదాహరణలు వేలెన్ని ఉన్నవి.

నా ఇద్దరు కొడుకులకీ ప్రభుత్వం వారే ఉద్యోగం ఇచ్చి తన్నివిలకోతోలనే ఉద్దేశంతో నే నిదంతా వ్రాయడం లేదని మరొకమారు సవినయంగా మనవి చేసున్నాను. సుశిక్షితులైన సిబ్బంది ఎంత కావలసివుంటుందో నిర్ధారణచేయడానికి ఎప్పటికప్పుడు కమిషనను, కమిటీలను నియమిస్తూనే వున్నారు. దేశం స్వతంత్రం కాగానే, శాస్త్రవేత్తలెంతమందివున్నదీ, ఎందరు కావలసింది విచారణచేసి లెక్కలు కట్టడానికి ఒక కమిటీని వేశారు. 1956లో ఇంజనీరింగు సిబ్బంది విచారణ సంఘం ఏర్పడింది. ఈ కమిటీల నివేదికలను చక్కటి అట్టలతో మాడి ముచ్చటగా, ఎంతో అందంగా ముద్రించారు. ఇది ఇలావుండగా, భారత ప్రభుత్వపు ఖర్చుమీద వేలాది యువకులను శిక్షణనిమిత్తం విదేశాలకు పంపించటం జరుగుతున్నది. ఇంత ప్రయత్నం జరుగుతున్నప్పటికీ, సుశిక్షితులైన సాంకేతిక శాస్త్రజ్ఞులు లేక, అనేక పరిశ్రమలు అభివృద్ధి చెందలేకపోతున్నవి. వందల, వేల సంఖ్యలో సుశిక్షితులైన యువకులు కాలిజోళ్ళు అరిగిపోయేట్లు ఉద్యోగాలకోసం అన్వేషణం సాగిస్తూనే వున్నారు. ఏమిటీ వైపరీత్యం?

విద్యార్థులు అర్భకులు కారు

ఇదంతా ఎందుకు చెబుతున్నట్లు అని ఆశ్చర్యపడతారేమో? భారత హైకమిషనర్ కార్యాలయ విద్యాశాఖ ఎంతవరకు ఉపయోగపడుతున్నదో అందరూ గ్రహించేటట్లు చేయడమే నా ఉద్దేశం. ఒక్క భారతదేశం నుంచి మాత్రమే విద్యార్థులు విద్యాభ్యాసంకోసం ఇంగ్లండు వెళ్లుతున్నారా? లేదు; అనేక దేశాలనుంచి వెళుతున్నారు. అక్కడ చదువుకోడానికి వెళ్లే భారతీయ విద్యార్థులు తమ విషయం తాము చూసుకోలేనంతటి పరమ అర్భకులేమీ కారు. మరి ఉద్దేశం? అర్భకులనీ, తగిన రక్షణ వుండడం అవసరమనీ మాటవరసకు అన్నా, వాళ్లు అపరిమితంగా అసహ్యించుకుంటారు; అధిక్షేపిస్తారు. ఇంతేగాక, నిజంగా రక్షణ అవసరమైన సమయాలలో వాళ్లకు ఏపాటి రక్షణ ఇవ్వగలుగుతున్నారన్నది కూడా ప్రశ్నే.

లండన్‌లో చదువుకుంటున్న భారత విద్యార్థులలో ఎక్కువమంది ముండల మరాకోరుగా తిరుగుతూ తమ అమూల్యమైన కాలాన్నీ, డబ్బునూ వృధాచేస్తున్నారని భారత హైకమిషనర్ కార్యాలయ వ్యవహారాలన్నీ క్షుణ్ణంగా తెలిసిన ఒక పెద్దమనిషి నాతో చెప్పాడు. నేను విస్తుపోయాను. ఒకరోజు లండన్ విమానాశ్రయానికి వెళ్ళి చూతునుకదా, ఒకయువతి భుజంమీద తలవాల్చి ఒక "సర్దార్ జీ" వెక్కి వెక్కి ఏడుస్తున్నాడు!

పేపరికంలో పరిశుభ్రత


ఖండాలం, నానా కళ్ళలం భారతీయ సంస్కృతిలో భాగాలా? కాగ; ముమ్మాటికీ కాదు. భారత ప్రజాబాహుళ్య జీవిత విధాన ప్రతిబింబమే భారతీయ సంస్కృతి. చాలా అసహ్యకరమైన పరిసరాలలో కూడా అతి పరిశుభ్రంగా వుంచుకున్న నిరుపేదకుటుంబాల ఇళ్లను అనేకం నేను చూశాను. "బోల్ ఫూర్ సంస్కృతి"కి ప్రతినిధి అయిన శ్రీ అనిల్ చంద్ గుహ ఆధ్వర్యాన ఇక్కడ దేశంలో సంచార సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయడంకంటే విదేశాలలో నివసిస్తున్న భారతీయుల జీవన ప్రమాణాలను అభివృద్ది చేయడం అత్యవసరమైన సమస్య కాదా అనిపిస్తున్నది. మన దేశంలో జరుగుతున్న సంచార ప్రదర్శనల వల్ల ఉపకారం కంటే అపకారమే ఎక్కువగా జరుగుతున్నది. ప్రధాని నెహ్రూగాని, మౌలానా అజాద్ గాని ఈ విషయాన్ని సరిగా కనిపెట్టలేక పోతున్నారు.

నేను పైన పర్యటించిన లండనులోని భారతీయ రెస్టారెంటు కేవలం ప్రైవేట్ సంస్థ అయినప్పటికీ, దాని ప్రమాణాల స్థాయిని మన హైకమిషనర్ కార్యాలయం బాగా అభివృద్ధి చేయవచ్చు. అవసరమైతే 'సబ్సిడీ' ఇచ్చి ఆర్థికంగా సహాయపడవచ్చు. ఏ దేశ పౌరులైనా మరొక దేశానికి వెళ్ళి అక్కడ మాతృదేశకీర్తి ప్రతిష్ఠలకు భంగకరంగా ప్రవర్తించే పక్షంలో, అట్టి వ్యక్తులను స్వదేశానికి పిలిపించివేసే హక్కు ప్రజాస్వామ్య ప్రభుత్వాలకైనప్పటికీ తప్పకుండా వుంటుందనే విషయాన్ని మరచిపోకూడదు.

ఈ పరిస్థితులలో మరొక విషయాన్ని కూడా చెప్పవలసివస్తున్నది. హైకమిషనర్ కార్యాలయానికి అనుబంధంగావుండి భారతీయ విద్యార్థుల యోగక్షేమాల కోసం పనిచేస్తున్నట్టుగా నటిస్తున్న ఈ సంస్థను తక్షణమే రద్దు చేసివేయాలి. బ్రిటిష్ పరిపాలన తాలూకు ఈ అంతిమ చిహ్నం కూడా ఎంత శీఘ్రంగా తొలగిపోతే, అంత శ్రేయస్కరం. ఇంతే కాదు. భారతీయ విద్యార్థుల వసతి గృహాల పరిస్థితులను వెంటనే పరిశీలించాలి. సాంస్కృతిక ప్రతినిధులమని చెప్పుకుంటూ తిరిగే "చీడపురుగు ఉద్యోగులను" వారి తొత్తులను శీఘ్రంగా తొలగించి వేయాలి. భారత హైకమిషనర్ కార్యాలయానికి ఎదురుగా వున్న రెస్టారెంటు భారతీయ సంస్కృతికి చిహ్నమని ఎవరైనా భావిస్తే, మన సంస్కృతి గతి దుర్గతే!

ఈ విద్యార్థి సంసను, ఈ చీడపురుగు ఉద్యోగులను, వారి తాబేదార్లను తొలగించి వేస్తారా? ఎందుకు తొలగిస్తారు? తొలగించరు. క్షుద్రులైనవాళ్లు ఎంత గొడవచేసినా "భద్ర గజానికి" లెక్క ఏమిటి? నా గోడ గతి అంతే!

★



★ లవణరాజు కల ★

౧

ఐంద్రజాలికుడు తన రంగురంగుల నెమలి పింఛం గిరగిరా తిప్పి ఏవేవో చిత్రవిచిత్రమైన మంత్రాక్షరాలు ఉచ్చరించాడు. తిరిగీ ఆ రంగురంగుల నెమలి పింఛం చేత అలాగే నెమ్మది నెమ్మదిగా వలయాకార నృత్యం చేయించాడు. అతని చేతిలో నృత్యం చేస్తున్న ఆ మయూరబర్హం తిలకించగానే లవణమహారాజాస్థానంలో సమాసీనులైన సభాస్తారులందరికీ తమ కళ్లెదుట వేయి బంగారు నెమళ్లొక్కమారుగా నృత్యం చేస్తున్నట్టు స్ఫురించింది! వేయి మెరుపు తీగలదృశ్యమైపోకుండా అలాగే నిలిచి వలయాకార నృత్యం చేస్తున్నట్టు భాసించింది! వేలాది అప్సరలు చిత్రవిచిత్రమైన సువర్ణాలంకారాలతో, జపగంటలతో, మొలనూలి మువ్వలతో, అందెల రవళులతో అతిలోక నాట్యమేదో మెరపిస్తున్నట్లనిపించింది!

లవణ మహారాజాస్థానంలోని వారందరికీ అమనోహర దృశ్యం ప్రత్యక్షమైన కొంత సేపటికొక విస్మయమైన తీయని మైకం కమ్మింది. పరిగంచు హొంబట్టు తెరల పూర్వరంగంలో హంసతూలికాతల్పాలపై ఒయ్యారంగా ఒరిగి ఆ మహేంద్రజాలం తిలకిస్తున్న రాణులందరూ ఒక నిమిషంలోనే గాఢ మూర్ఛాభారంతో మలిగి అలసి సొలసి నెమ్మదిగా తూలిపోయారు.

సభాసదులంతా అంతకు పూర్వం ఎన్నెన్నో ఇంద్రజాల విద్యావిచిత్రాలు సందర్శించారు కాని అంతటి విచిత్రమైన మహేంద్రజాలం వారెన్నడూ చూడలేదు. మహారాజు ఇంద్రజాల విద్యా ప్రదర్శన ప్రారంభంలో ఆ ఐంద్రజాలికుని అతిలోక చాకచక్యాన్ని కొంతైనా అభినందించాడు. అతని కనేకమణికనక భూషణాలు బహుకృతిగా సమర్పించవలెనని సంకల్పించాడు. అయితే ఆ ఇంద్రజాలం మరికొంతసేపలాగే సాగేసరికతనికా ఆనంద తన్మయతలో శరీరంమీది స్పృహే సడలిపోయింది. ప్రగాఢ సుషుప్తిలో ఏదో ఒక విచిత్ర స్వప్నలోకంలో ప్రవేశించినట్లు స్ఫురించింది. మరికొంతసేపటికా స్ఫురణ కూడా నశించిపోయింది. అతని హృదయం పూర్తిగా ఆ ప్రగాఢానంద లీలా తన్మయతలో విలీనమైపోయింది. సభాస్తారులు, మహారాణులు, మహారాజు, అంతా ఆ మహేంద్రజాలాఖండ తన్మయతలో మునిగి కేవలం శిలాప్రతిమలైపోయారు. కాని మహారాజ పార్శ్వంలో అనతిదూరంలో దర్భాసనాసీనుడైన వసిష్ఠమహర్షి మాత్రం ఆ ఇంద్రజాల సమ్మోహనిద్రలో మునిగిపోలేదు. అలాగే నిశ్చలంగా దర్భాసనంమీద కూర్చుని చిరునవ్వుల చిలకరింపులతో ఇంద్రజాల లీల అంతా ఏకాగ్రదృష్టితో పరిశీలిస్తున్నాడు.

అంతలో ఉచ్చైశ్శ్రవంవంటి ఉత్తమాశ్వం ఒకటి సభాస్థలికనతిదూరంలో నిలబడింది. ఒక గుర్రపురౌతు దానిని అక్కడ నిలబెట్టి సభాసలికెదురుగా చేతులు జోడించి నిలబడ్డాడు. అది మనోజవంతో సాగిపోయే ఉత్తమాశ్వమని విన్నవించాడు. ఎన్ని వేల యోజనాలైనా ఇట్టే చుట్టిరాగలదని చెప్పి దాని గమనవేగం అనేక విధాల ప్రశంసించాడు. ఇంతకు పూర్వమది అరగడియలో నూరు యోజనాలు చుట్టివచ్చినదని అన్నాడు. ఒకసారి దాని మనోవేగం పరిశీలించవలసిందని సవినయంగా అభ్యర్థించాడు.

ప్రాచీన గాథాలహరి

అరగడియలో నూరుయోజనాలు చుట్టివచ్చే అశ్వం అంటే సభాసదులెవరికీ నమ్మిక కలగలేదు. వారంతా ఒకరిముఖాలొకరు చూచుకొన్నారు.

మహారాజు వసిష్ఠమహర్షి ముఖంవైపు చూచాడు. ఆ చూపులో ఐంద్రజాలికుని మాట యథార్థమేనా అన్న భావం స్ఫురించింది.

మహర్షి ఒక చిరునవ్వు నవ్వాడు:

“మహారాజా! ఒకమారు పరిశీలించి చూడవలసిందని ఐంద్రజాలికుడే విన్నవించుకొన్నాడు గదా! ఒక అరగడియలో అంతా తమకే విశదం కాగలదే! ఎందుకింత డోలాందోళన!”

అని మహర్షి తిరిగి ఇంకొక చిరునవ్వు నవ్వి ఆ ఉత్తమాశ్వంవైపు అవలోకించాడు. అంతలోనే అది బిగ్గరగా సకిలించింది. ఆ సకిలింపు వినగానే మహారాజు హృదయం ఎగిరి గంతు వేసింది. కాని ఆ అశ్వానికంతటి శక్తిసామర్థ్యాలున్నాయా అని తిరిగీ ఒక చిన్న ఆశంకపట్టుకొని వేధించింది. క్షణంకాలం ఆ అశ్వం వైఖరి పరిశీలించాడు.

సమున్నతమైన ఆ ఉత్తమాశ్వం శిరస్సుపై అమర్చిన వింజామరం మధ్యాహ్న సూర్యకాంతిలో కాశపుష్ప గుచ్ఛంలా తళతళలాడింది. వింట సంధించిన బాణంలా ఆ శ్వేతాశ్వం ముమ్ముందుకు సాగిపోవడానికై ఉరకలు వేస్తూంది. పక్కనే నిలబడిన గుర్రపు రౌతు దాని కళ్లెం గట్టిగా పట్టుకుని అదిమి నొక్కిపెట్టకపోతే అది ఒకక్షణంలోనే రివ్వున ఎగిరిపోయేటట్లు కనబడింది.


లవణరాజిక వేచిఉండలేకపోయాడు. ఒక్కసారిగా వెనక్కి తిరిగిచూచి. వెనక తళతళ మెరుస్తున్న అవరోధాంగనల దగ్గర సెలవు తీసుకొన్నాడు. వసిష్ఠమహర్షికి సవినయంగా పాదాభివందనం చేసి నిలుచున్నాడు. మహర్షి లేచి నిలబడి ఎంతో వాత్సల్యంతో చేయెత్తి ఆశీర్వదించాడు. లవణరాజొక్క దూకులో గుర్రం మీద ఎక్కి కూర్చున్నాడు. అది మళ్లీ బిగ్గరగా సకిలించింది. ఒయ్యారంగా వంచిన మెడవంపులోనే అశ్వికుని చాకచక్యం గుర్తించినట్లుగా అది తిరిగీ ఇంకొకమారు సకిలించింది.

నగర రాజవీధి దాటిపోయేవరకూ, కొంత దూరం వరకు సవిలాస మందగమనం సాగించింది. అంతలో మహారాజు అరచేతితో ఆ గుర్రం వెన్నుమీద తొందర తొందరగా తట్టాడు. దానితో ఆ అశ్వం శరవేగంతో పరుగులు పెట్టింది. ఉత్తరక్షణంలోనే అది ఒక మెరుపులా అదృశ్యమైపోయింది

౨

మహారాజు మొటమొదట ఇంద్రజాలమే అంతా యథార్థమని విశ్వసించలేదు. తరవాత గుర్రపు రౌతుతో ప్రత్యక్షమయిన ఆ అశ్వం వైపు చూచి తన కన్నులే నమ్మలేక

పి. గణపతిశాస్త్రి



శివకంచి ఏకామ్రేశ్వర దేవాలయ అంతర్భాగము.

ఫొటో: పి. వీరయ్య, సికింద్రాబాద్.

పోయూదా. అప్పుడు అది అంగడియులో నూరు యోజనాలు చుట్టి రాగ దంటే—అదంతా అతనికి కేవలం అతిశయోక్తిగా భాసించింది. అయినా, దాని యాథార్థ్యం పరిశీలించవలె నన్న దృఢనిశ్చయంతో దాని జీనుమీద కూర్చుని నెమ్మదిగా గావిపుమీద తట్టాడు. అది మిథ్యాత్వం కాదు! స్పష్టంగా చేతికి తగిలింది. తిరిగి చెవులు గింగురుమను వేగం పరికించింది. అయినా ఒకసారి స్వారీ చేసిచూచి అంగడియులో నూరు యోజనాలు చుట్టి వచ్చే విషయం ప్రత్యక్షంగా పరిశీలించవలె నని అనుకొన్నాడు.

ఇంద్రజాలికుని మాటలలో అణుమాత్రమైనా అసత్యం కనిపించలేదు. ఆ అశ్వం శర వేగంతో పరిగెత్తుకు పోతూంటే మహారాజుకు కనీసం ఎటు పోయేదీ ఏమీ తెలియలేదు. కళ్ళెం మళ్ళీ గట్టిగా లాగి పట్టుకున్నాడు. అశ్వం నిలిచిపోయింది. తిరిగి నెమ్మదిగా వీపుమీద తట్టాడు. ఆ గుర్రం మళ్ళీ మనో వేగంతో దౌడుతీయసాగం మొదలుపెట్టింది. కొన్ని వందల యోజనాల దూరం సాగి పోయింది. అతడొక మహారణ్యంలో ప్రవేశించాడు. ధ్యాసగా చూడగా అదంతా అతనికి వింధ్యారణ్య గుర్తు ప్రాంతంలా కనిపించింది. సందేహం లేదు! అది వింధ్యారణ్య ప్రాంతమే! మహారాజు బాల్యంలో ఒకనాడు జనకునితో కలిసి ఆ ప్రాంతాలలో మృగయోత్సవంలో విహరించాడు! బాల్యంలో చూచిన ఆ మహారణ్యమే — ఆ పర్వతావళులే వేట కతని కళ్ళ కెదురుగా ప్రత్యక్షమైనాయి. క్షణంలో ఆ అశ్వం అంతదూరం తీసుకు వచ్చిన విషయం స్ఫురించగానే అతనికి కలిగిన ఆశ్చర్యానికి అవధి లేదు.

ఎక్కడి మయూరబ్రహ్మపురం! ఎక్కడి వింధ్యాటవి! అని లవణరాజెంతో ఆశ్చర్య పడ్డాడు. మయూరబ్రహ్మపురం భాగీరథీతీరాన లవణరాజు పితామహ ప్రపితామహులు నిర్మించిన మహానగరం. లవణమహారాజు తాత తండ్రులా మహానగరం రాజధానిగా ఆ పరిసర విశాలదేశం అంతా పరిపాలించి, మహా ధర్మాత్ములని ప్రసిద్ధికెక్కారు. లవణ మహారాజు కూడా ఒక్క క్షణమైనా ఏమరకుండా వారిమార్గం అనుసరించి పరమ ధర్మాత్ముడని ప్రఖ్యాతికెక్కాడు.

వసిష్ఠమహర్షి స్వయంగా మహారాజుచేత ఎన్నో యజ్ఞయాగాలు, దానధర్మాలు చేయించాడు. లవణరాజు పరిపాలనలో రాజ్యంలో అతివృష్టి, అనావృష్టి వంటి ఈతిబాధలెన్నడు పొడచూపలేదు. మహారాజు నిత్యము మహేంద్రవైభవంతో తులతూగుతూండేవాడు. మానుషానందాలన్నీ అతని కనాయాసంగా లభించాయి.

అయినా లవణమహారాజు హృదయంలో తీరనిజిజ్ఞాస ఏదో ఆరని చిచ్చులా దహించి వేసేది. భోగ్యభోగ బహుళమైన జీవనలీల అంతా అంతలోనే చిత్రవిచిత్రమైన స్వప్నలీలగా గోచరించేది. మహారాజ నేకమారులు వసిష్ఠమహర్షి సన్నిధిని తన తీవ్ర జిజ్ఞాస తెలుపుకు చేసుకొన్నాడు. ఎన్నెన్ని మహేంద్రభోగా లనుభవించినా నిత్యము అసంతృప్తి జ్వాల తన అంతరాంతరాలు

★ లవణరాజు కల ★

దహించివేస్తున్నదనీ దానికి కారణమేమీ గోచరించటంలేదనీ విన్నవించుకొన్నాడు.

వశిష్ఠమహర్షి దానికి సముచితమైన సమాధానమేమీ చెప్పలేదు. గంభీరంగా మహారాజువైపు చూచి సన్నగా ఒక చిరునవ్వు నవ్వి ఊరకున్నాడు అంతే!

సుఖదుఃఖ ద్వంద్వ సమ్మిశ్రితమై నిరంతర నిస్సార యాత్రగా సాగిపోయే జీవయాత్రలో అంతర్నిహితమైన మహాపరమార్థమేదో ప్రత్యక్షంగా సాక్షాత్కరింపజేసుకోవాలని మహారాజెన్నో మారులు సంకల్పించాడు. మహర్షి ననేక విధాల ప్రార్థించాడు. ఆయన మహాద్రష్ట! ఆ మహర్షి అంతీంద్రియ దృష్టికందని పరమార్థమేమీ లేదు. మహాతపస్సమాధిలో మునిగి సశరీర బ్రహ్మీభావం పొందిన బ్రహ్మజ్ఞుడా బ్రహ్మర్షి!

తీవ్ర తపశ్చర్యాదుల ఆవశ్యకత లేకుండా సంకల్పమాత్రం చేతనే అన్యులకుకూడా ఆ పరమార్థ సాక్షాత్కారం కరతలామలకంగా అందింపజేయగల మహాతపశ్శాలి! ప్రత్యేకంగా లవణమహారాజంటే అపార వాత్సల్యామృతం వర్షించే కారుణ్యఘనుడు!

అయినా లవణమహారాజు సంకల్పం నెరవేరలేదు. నానాటికి జీవనలీల అంతా అతని కొక విచిత్రరూపకంగా, ఛాయామాత్రంగా భాసించేది. లోలోపలి జిజ్ఞాసాగ్ని జీవనాశలన్నీ దహించివేసేది. అతడిక నేసేదేమీ లేక కొన్నాళ్లపాటు భోగలాలసలో మైమరచి నిత్యము ఆతన్మయతలోనే మునిగిపోయేవాడు.

ఆతన్మయతలో కొన్నాళ్లపాటు మహారాజు వసిష్ఠమహర్షి దర్శనమైనా చేయలేదు. అనేకమైన కేళీవినోదాలతో కాలక్షేపం చేశాడు. ఆ వినోదప్రసంగంలోనే ఇంద్రజాలవిద్యాసందర్శనం జరిగింది. అనంతరమే ఆ అశ్వారోహణము, అరణ్యప్రవేశము జరిగాయి

మహారాజా జరణ్యం అంతా పరిశీలించాడు. కాని అక్కడినుంచి తిరిగి మయూరాబద్ధపురం చేరుకొనేమార్గమేదీ



LOT FOR LITTLE
చిన్న మొత్తాలకు
బోలెడు సరకు
తెలివైన కొనుగోలుదారులు ఎల్లప్పుడూ
నాణ్యత, పనితనం, మన్నికల కలయిక
కై చూస్తారు అదివిధంగానే, ఇంపైన
స్టెయిన్ లెస్ స్టీల్ వస్తువుల అవసరం
వచ్చినప్పుడల్లా "దేవిదయాళ్"
సరకునే హెచ్చుగా కోరుతారు
దేవిదయాళ్‌ను కొనటమంటే, శ్రేష్ఠ
మైనవాటిని కొనటమే కాంతిపోగు
జీవితమంతా ఉంటుంది మీ ఇంటికి
ఘనతను, శోభను చేకూరుస్తుంది కలిగి
ఉండటమే గర్వకారణంగా భావించే
బహుకొద్ది వస్తువులలో ఇదొకటి కొద్ది
పాటిసొమ్ముకు, బోలెడు వస్తువులు
'దేవిదయాళ్' కొనటంతో పొందే
వీలున్నది
DEVIDAYAL'S
"దేవిదయాళ్"
స్టెయిన్ లెస్ స్టీల్
మెరుగైనవి, మేలైనవి
-అయినా కూడా సరసమైనవి.
మెసర్సు : దేవిదయాళ్ సేల్సు ప్రైవేటు లి॥
35, మెయిన్ రోడ్, రాయపురం, మద్రాస్ 13.
NATIONAL-56

★ లవణరాజు కల ★

అతనికి గోచరించలేదు. ఆటవికులెందరెందరినో అడిగిచూచాడు. వారా పట్టణం పేరైనా విన లేదని అన్నారు. తిరిగీ స్వనగరం చేరుకోవడమెలాగ?

అప్పుడే సూర్యాస్తమానంఅయిపోయింది ఐంద్రజాలికు డరగడియలోగానే ఆ అశ్వం నూరుయోజనాల భూవలయం చుట్టివచ్చి సురక్షితంగా మయూరబర్హ నగరానికి తిరిగి రాగలదని అన్నాడు.

ఎన్నెన్నో అరగడియలు గడిచిపోయాయి. ఎక్కడా దారి కనబడలేదు. అంతలోనే చీకట్లుకూడా అలముకొన్నాయి. అరణ్యంలో కీచురాళ్ళమోత ప్రపంచలీలా సంగీతాని కంతటికీ ఒక గంభీరశ్రుతిగా వినవస్తున్నది. ఇక కాలయాపనవల్ల ప్రయోజనమేమీ లేదని లవణ మహారాజా అశ్వాన్ని గట్టిగా అదిలించాడు.

అశ్వం బాగా అలిసిపోయిందేమో! ఆశించినంత మహావేగంతో పరిగెత్తలేదు. పరిగెత్తగా పరిగెత్తగా ఎక్కడైనా ఏదైనా మార్గం గోచరించక పోతుందా అని అతని ఆశ!

ఆఅశ్వాన్ని మళ్ళీ గట్టిగా అదిలించాడు. అది గురినూరిణ్యమార్గమైనా లక్ష్యపెట్టకుండా ఒళ్ళెరుగని వేగంతో తొందరతొందరగా పరిగెత్తడం మొదలు పెట్టింది.

ఆ మహావేగంలో ఒక పెద్దచెట్టుకొమ్మ గట్టిగా అతని నుదుటికి తగిలింది. వెంటనే అతనికి ఒంటిమీద స్మారకం తప్పిపోయింది. కళ్ళెం పట్టు తప్పిపోయింది

లవణ మహారాజా తత్క్షణంలో చాపచుట్టగా నేలమీద పడిపోయాడు. అతని శరీరం అంతా రక్తసిక్తం అయిపోయింది. అయినా అశ్వం ఆవిషయం గమనించలేదు. అలాగే శరవేగంతో పరుగెత్తుకు పోయింది. ఆ ఆఘాతంతో లవణ మహారాజా పూర్వ స్మృతులన్నీ క్రమక్రమంగా విస్మృతి కుహరంలో పడిపోయాయి.

ఆ మర్నాడు బళ్ళున తెల్లవారింది. సూర్యకిరణాలింకా వింధ్యారణ్యం మూల మూలల దాకా చొచ్చుకుపోలేదు. గడిచిన రాత్రి అంతా అరణ్యమధ్యంలో శరీర స్పృహైనా లేకుండాపడిఉన్న లవణరాజా తెల్ల తెల్లవారేవేళ మెలిగా కళ్లు తెరిచాడు.

ఒక శబర యువతి అతనిపార్శ్వంలో కూర్చుని శీతలోపచారాలు చేసింది. మహారాజా మెవైపు చూచాడు.

ఆమె తలకట్టు నిండా అడివిపువ్వులు. మెడనిండా గురివెందపూసలదండలు. ఆ యువతి గాయాలకన్నిటికీ కట్లుకట్టి అతని నొక మెత్తని పర్ణశయ్యపై పరుండబెట్టింది. పక్కనే కూర్చుని ఎంతో ఆప్యాయంగా ఉపచారాలు చేసింది:

లవణరాజు కళ్లు తెరవగానే ఆమెకళ్లు వికసించాయి. ఏదో అడిగింది. అతనికామె అరణ్యభాష తెలియలేదు. తిరిగి సంజ్ఞల ద్వారా ఆమె తన అభిప్రాయం వ్యక్తీకరించింది. కాని సంజ్ఞలకు పూర్వం కనుచూపులే ఆమె మనోభావం వ్యక్తీకరించాయి.

మహారాజా అశ్వమేమైపోయినదని అడిగాడు. అతని సంజ్ఞలేవీ ఆమెకు తెలియలేదు అమాయికమైన కలకల నవ్వులతోనే సమాధానం చెప్పింది.

లవణరాజు హృదయంలో ఎన్నో భయాందోళన లుదయించాయి. ఆ అశ్వమేమైపోయిందో! అర గడియలో నూరు యోజనాలమేర పరిభ్రమించి భద్రంగా తిరిగి మయూరబర్హనగరం చేరుకొనగలదని ఐంద్రజాలికు డతనితో అన్నాడు, ఐంద్రజాలికుని మాటలు చాలావరకు యథార్థాలైనాయి కాని ఆ ఒక్క విషయం మాత్రమే యథార్థంకాలేదు. ఇక అతనికి తిరిగీ మయూరబర్హనగరం చేరుకొనే మార్గమేమీ గోచరించలేదు.

పిమ్మట అలాగలాగ రోజులు, వారాలు మాసాలు గడిచిపోయాయి అప్పటికి అతనికి తిరిగీ స్వదేశం చేరుకునే ఆశ పూర్తిగా నశించిపోయింది.

కొంతకాలాని కాశబర యువతి అతన్ని శబరగ్రామానికి తోడుకొనిపోయింది. ఆటవికులందరు అతని ననేకవిధాల గౌరవించి ఆదరించారు.

కాని ఎవరు మయూరబర్హనగరానికి మార్గం చెప్పలేకపోయారు. అటుపిమ్మట అలాగే ఇంకొక సంవత్సరం గడిచిపోయింది. ఆ శబరయువతి రాత్రింబగళ్లు అలాగే అతనికి పరిచర్యచేసి మహారాజు హృదయం ఆకర్షించింది.


లవణరాజామెతో కలిసి అడివిలో మృగయాది వినోదాలతో కాలక్షేపం చేసేవాడు కొండకాలవలలో ఆమెతో కలిసి జలక్రీడలాడేవాడు. చల్లని లేతలేత పచ్చిక బయళ్లలో మబ్బులనీడలు పరుగులుపెట్టే సంజవేళలో ఆమెతో కలిసి గహనసీమలలో విహరించేవాడు.

ఆ ఆటవికుల నిసర్గసరళ జీవనధోరణి అతనికెంతో హృదయంగమమై స్ఫురించింది. కొన్నాళ్లకతనికి వారితో కలిసి మెలిసి సంచరించడము, సంభాషించడము కూడా అలవాటయి పోయాయి

మరి కొంతకాలానికతనికి పూర్వకాల మహారాజ జీవితం అంతా ఒక పూర్వజన్మ వృత్తాంతంగా అస్పష్టలీలగా స్ఫురించింది. దానికంటె సరళ స్వచ్ఛమయిన అరణ్య జీవితమే వేయిమడుగు లెక్కువ ఆనందదాయకమని తోచింది. క్రమంగా శబరయువతి గాఢానురాగం అతని హృదయంలో కొండమల్లె తీగలా అలుముకు పోయింది. ఇంకా కొంతకాలానికి వారిదరికీ వివాహం కూడా జరిగింది. అప్పటినించీ అతనికి శబర యువతిని 'గిరిమల్లిక' అని పిలవడం ఒక పరిపాటి అయింది.

ఆ వివాహంతో ఆటవికులందరు అతని కత్యంతాప్తులైనారు. అరణ్యమైనా ఆటవిక బంధుమిత్రుల మధ్యలో అది మహారాజా మనసులో మయూరబర్హపురంలాగే మెరిసింది.

క్రమంగా గిరి మల్లిక కిద్దరు పుత్రులు, ముగ్గురు పుత్రికలు కలిగారు. ఆ సంసార జంజాటంలోపడి లవణరాజు తన పూర్వ వృత్తాంత వేదన అంతా విస్మరించివేశాడు. అంతఃపురంలో రాణులు, వారి అనురాగాలు, ఆ మహారాజ భోగాలు అన్నీ అతనికి కేవలం పురాతన జన్మానుబంధాలుగా కనిపించాయి. సంవత్సరాలు గడిచిన కొద్దీ ఆ ఆటవికుల మధ్యనున్న మహారాజు జీవితం తలవని తలంపుగా ఎంతో ఆనందదాయకంగా హాయిగా గడిచిపోయింది. కాని అతని ఆనంద జీవితం అలాగ అట్టే కాలం కొనసాగలేదు! —మిగిలినది పైవారం.



న్యూఢిల్లీ లేఖ

ఢిల్లీ నగరాభివృద్ధికి ఒక గొప్ప పథకం తయారుచేశారు. ఈ పథకంపై ప్రజల అభిప్రాయాలు తెలుసుకునే నిమిత్తం దీన్ని 'తాత్కాలిక పథకం' అని అంటున్నారు. అంటే ఈ పథకాన్ని అమలుచేస్తామని ఎవరూ అనడంలేదు. ఆఖరికి పథకం తయారుచేసినవాళ్ళు కూడా అనడం లేదు. అందుకే ఈ పథకంలో అద్భుత సందిగ్ధత, అపూర్వ అవాస్తవికత కనిపిస్తాయి.

పాతఢిల్లీ, చాందినీ చౌక్‌లో ఉన్న క్వీన్స్‌గార్డెన్స్‌ను లాల్‌ఖిల్లాదాకా విస్తృతం చెయ్యాలని ఈ పథకంలో ఒక సూచన ఉంది. ఈ క్వీన్స్‌గార్డెన్స్‌కు ఒక ప్రక్క చాందినీ చౌక్ ఉంది. మరో ప్రక్క క్వీన్స్‌రోడ్డు, మూడో ప్రక్క కారియా పుల్‌రోడ్డు ఉన్నాయి. లాల్‌ఖిల్లాకు సమాంతరంగా పోయే లోథియన్ రోడ్డుకూ, కారియా పుల్ రోడ్డుకూ మధ్య పాత ఢిల్లీలోకల్లా విలువైన స్థలాలున్నాయి. ఈ స్థలాలను స్వాధీనం చేసుకోవడానికి చాలా కాలం పడుతుంది. అది అలా ఉంచి, ఎలాలేదన్నా నూరుకోట్ల రూపాయలు కావాలి. ఆ స్థలంలోనే లజపత్ రాయ్ మార్కెట్ ఉంది. ఆ మార్కెట్ స్థానంలో ఇదివరకు గ్రీన్‌పార్కు ఉండేది. ఇప్పుడీ మార్కెట్‌ను బోలెడు డబ్బు ఖర్చుచేసి పునర్నిర్మిస్తున్నారు. ఢిల్లీ అభివృద్ధి పథకం తయారుచేసిన పెద్దమనుషులకు తమ పథకం మీద ఏమాత్రం లక్ష్యం ఉన్నా, ఆమార్కెట్ పునర్నిర్మాణాన్ని ఆపుచేయాల్సి ఉంది. దీనివల్ల ప్రజాధనం బోలెడు ఆదా కావడమే కాక క్వీన్స్‌గార్డెన్స్ లాల్‌ఖిల్లా దాకా విస్తరింపబడినప్పుడు, కాందిశీకులు ఆందోళన చేసే అవకాశం లేకుండా చేసినట్లవుతుంది.

ఉద్దేశం మంచిదే డబ్బు లేదుగాని.

అసలీ పథకంలో ముఖ్య లోపం ఏమిటంటే, దానికి ఎంత ఖర్చవుతుందో ఎవళ్ళకీ తెలియదు. వెనకటికి మహమ్మదాలీ జిన్నా పాకిస్థాన్ కావాలని గోలచేస్తూ "పాకిస్థాన్‌ను ఏర్పాటు చెయ్యాలనే సూత్రానికి ముందు ఒప్పుకోండి. తక్కిన సమస్యలు వాటంతట అవే విడిపోతాయి" అనేవాడు. ఆ 'తక్కిన' సమస్యలు కొన్ని లక్షల జనాన్ని దిక్కులేని దీనులుగా తయారుచేశాయి.

సాధారణంగా ప్రతిమనిషీ భార్య చనిపోతే ఆమె కొక తాజ్‌మహల్ నిర్మించాలనే అనుకుంటాడు, డబ్బుండాలే గాని. అలాగే ఢిల్లీ అభివృద్ధి పథకం చాలా అద్భుతమైనదే డబ్బులేదుగాని.

శ్రీ కృష్ణ
(ఆంధ్రపత్రిక విలేఖరి)

అన్నిటికంటే హాస్యాస్పద విషయం గుర్రప్పందాలను ఏర్పాటు చేయడం. కాంగ్రెసు సిద్ధాంతాలను అమలు చేయాలనే ఉద్యమం ప్రబలంగా ఉన్న ఈ రోజులలో గుర్రప్పందాలెందుకో? డబ్బు దండగతప్ప దీనివల్ల ప్రయోజనం ఏముంది? ఇంతకంటే యోగాభ్యాసశాల ఒకటీ, అంబర్ చరఖా ప్రదర్శనశాల ఒకటీ కట్టుకోవడం మంచిది.

యమునాతటిపై విహారస్థలం

వజీరాబాద్, ఓకాల మధ్య నదీతీరాన ఒక విలాస విహారస్థలం (బూలివార్డ్) నిర్మించే ఉద్దేశం కూడా పథక నిర్మాతలకు ఉంది. పబ్లిక్ వర్క్సు కార్యదర్శిగా పనిచేసే రోజుల్లో కీ॥ శే॥ సర్ అక్బర్ హైదరీ అప్పటి వైస్రాయి లిన్‌లిత్‌గో ప్రభు ప్రీత్యర్థ్యం అటువంటి విహారస్థలం కట్టించాలని ఆలోచించాడు. ఆ స్థలానికి లిన్‌లిత్‌గో పేరు పెట్టాలని కూడా ఆలోచన జరిగింది. ఇంతలో యుద్ధం రావడం, ఆలోచన మూలపడడం జరిగింది. ఆ తరవాత డా॥ బి. ఆర్. అంబేద్కర్‌కు కూడా అలాటి ఆలోచనే కలిగింది. ఎవరికీ నచ్చని ఈ ఆలోచన చివరికి కొనసాగలేదు.

వివిధ శాఖలుగా విడదీయబడిన భారత ప్రభుత్వం ప్రస్తుతం ఎలాపనిచేస్తోందంటే, ఒక శాఖలో జరిగే పని ఇంకో శాఖకు తెలియదు. విహారస్థల ప్రతిపాదన మొదట్లో పబ్లిక్ వర్క్సు శాఖలో పుట్టింది. డా॥ అంబేద్కర్ కాలం నుంచీ నదిగట్టులు నిర్మించే పని నీటిపారుదల శాఖ చేతిలో ఉంది. కాని ఢిల్లీ అభివృద్ధి పథకం తయారు చేసిన కేంద్ర ఆరోగ్యశాఖకు మాత్రము అసలు యమునా నది ఒడ్డున ఇటువంటి విహారస్థలం కట్టాలని ఇదివరకే ఒక ప్రాజెక్టు తయారైందనే సంగతి తెలియదు. పైగా ఇదివరకటి ప్రాజెక్టు ప్రకారం యమునా నదిని సరస్సుగా మార్చి మంచినీటి సప్లయి సమస్యను పరిష్కరించాలని కూడా ఆలోచన చేశారు

శ్రీ ఎన్. వి. గాడ్గిల్ హయాంలో పబ్లిక్ వర్క్సు శాఖ ఢిల్లీ అభివృద్ధికి మరో "గొప్ప" పథకం తయారుచేసింది. శ్రీ గాడ్గిల్ తరువాత వచ్చిన మంత్రులకు దానిమీద శ్రద్ధలేక అదీ మూల పడింది. ఇప్పుడు ఈ పథకం సంగతి వర్క్సు శాఖకు తెలియనే తెలియదు. కాళిదాస దుష్యంతుడు శకుంతలను మరిచిపోయినట్లు గాడ్గిల్ పథకాన్ని వర్క్సు శాఖ మరిచిపోయింది.

ఇక ఆరోగ్యశాఖ ప్రస్తుతం తయారుచేసిన తాత్కాలిక పథకం ప్రకారం ఢిల్లీ నగరం ఎలా అభివృద్ధి అవుతుందో మామూలు మనిషికి తెలియడం లేదు. నగర పారిశుద్ధ్యం ఎలా అభివృద్ధి అవుతుంది? నగర సౌందర్యం ఎలా అభివృద్ధి అవుతుంది? ఆరోగ్యం ఎలా రక్షించబడుతుంది?

ఈగలూ, దోమలూ

న్యూఢిల్లీని బ్రిటిషు వారు నిర్మించారు. నిర్మాణానికి, పారిశుద్ధ్యానికి కోటాను కోట్లది ప్రజాధనం వెచ్చించబడింది వెచ్చింపబడుతోంది. భారత రాజధానిలో ఈగల్ని, దోమల్ని నిర్మూలించడానికి లక్షలకొలది ధనం ఖర్చయింది. ఆ ధనం మాయమైంది గాని ఈగలు, దోమలు మాయం కాలేదు. అవి ఎప్పటి లాగానే ఉన్నాయి. భారతీయుల అలవాట్లు మారనంతవరకూ ఆ కీటకాలు పోవని చివరికి నిర్ణయించారు. కాని 1947 ఆగస్టు 15 న



అమెరికా సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి
ఎర్ల్ వారెన్‌తో భారత ప్రధాని నెహ్రూ.

★ న్యూఢిల్లీ లేఖ ★

పూర్వం కూడా న్యూఢిల్లీలో భారతీయులే ఎక్కువగా ఉండేవారు. అప్పటి దాకా నగర పారిశుద్ధ్యాన్ని కాపాడింది కూడా భారతీయుడే. ఆయన పేరు జోసెఫ్ రోకూరాస్డ్, మునిసిపల్ కమిటీ కార్యదర్శి.

నగరి పారిశుద్ధ్యం పాడైపోవడానికి కారణం ప్రజాస్వామ్యమని ఒక వాదం. స్వీడన్‌లో, డెన్మార్క్‌లో, స్విట్జర్లెండులో, బ్రిటన్‌లో ప్రజాస్వామ్యం లేదా? అక్కడి పారిశుద్ధ్యం, ప్రజారోగ్యం, నగర సౌందర్యం మనదేశంలో ఉన్నట్టే ఉన్నాయా? ఆ దేశాల్లో రోడ్ల మధ్య చిన్న చిన్న పూలమడులు ఉంటాయి. ఆ పూలను పిల్లలు కూడా పాడు చెయ్యరు.

మొత్తంమీద ఈ దోషం ప్రజాస్వామ్యానిదీ కాదు, ప్రజలదీ కాదు, వారి అలవాట్లదీ కాదు. అసలు అవస్థ అంతా వ్యవస్థలోనే ఉంది. మునిసిపల్ నిబంధనలు కఠినంగా అమలు చెయ్యడం అధికారులకు అలవాటు లేదు. అమలు చేయించడం కేంద్ర ఆరోగ్య శాఖకూ అలవాటు లేదు. చెడిన ఆహారపదార్థాలను, ముక్కలుగా కోసిన పండ్లను బజార్లలో అమ్మరాదని ఢిల్లీ చీఫ్ కమీషనర్లు నిబంధన చేశారు. కాని నిబంధన నుల్లంఘించే వారిని శిక్షించే చర్యలు మాత్రం తీసుకోలేదు.

ఆవులా, గేదెలా

ఇళ్ళ ఆవరణలలో పాడిపశువులు ఉండరాదని న్యూఢిల్లీ మునిసిపాలిటీ నిషేధించింది. కాని ఆవులు, గేదెలు లేని గృహావరణలే ఈ నగరంలో కనిపించవు.

ఢిల్లీ అభివృద్ధిపథకానికి ఖర్చుధనం కేటాయించేముందు ఆరోగ్యశాఖ గత చరిత్రను పూర్తిగా తనిఖీ చేయించాలి.

* * *


ధరల పెరుగుదలపై బోలెడు వ్యాఖ్యానాలు వస్తున్నాయి. ఆహారశాఖ మంత్రి శ్రీ ఎ. పి. జైన్ ఈ పెరుగుదలకు కారణం లోటు బడ్జెట్ విధానమని వాదిస్తున్నారు. కొందరు ఆర్థికవేత్తలు ఆయన వాదాన్ని బలపరిచారు. కేంద్రమంత్రివర్గంలోని అగ్రమంత్రిత్రయం వారి అభిప్రాయం తెలియనిదే ఏమనడానికీ నోరురాక కొందరు కిమ్మన్నాస్తిగా ఊరుకున్నారు. అవసరమైతే వీరు ధరల పెరుగుదలకు లోటుబడ్జెట్ విధానం కారణం కాదనీ, జీవన వ్యయసూచి తయారుచేయడంలో జరిగిన పొరపాట్లే కారణమనీ వాదించడానికి సిద్ధంగా ఉన్నారు. కారణమేదైనా, ఈలోగా ప్రజావసరవస్తువుల ధరలు, ముఖ్యంగా బట్టల ధరలు పెరిగిపోతున్నాయి.

మిన్నంటే ధరలు

మొన్న ఏప్రిల్‌లోనే శ్రీ టి. టి. కృష్ణమాచారి హెచ్చరించారు బట్టల కొరత తప్పదని. కాని శ్రీయుతులు గుల్జారీలాల్ నందా, ఖండూభాయ్ దేశాయ్, వైకుంఠ మెహతా మొదలైన మహామహులంతా తమకేమీ పట్టనట్లు ఊరుకున్నారు. మిల్లుబట్టల ధరలు ఎంత పెరిగినా వారికి చీమకుట్టినట్టుండదు. వారికి కావలసినదల్లా అంబర్ చరఖా ఆర్థిక భవిష్యత్తు మాత్రమే. భారతదేశంలో బట్టలకొరత ఖాదీవల్లనే తొలగిపోతుందని వారి విశ్వాసం. సామాన్య ప్రజలు ఖాదీ బట్టలు వాడడానికి సుముఖులుగా లేకపోతే ప్రభుత్వోద్యోగులమీద రుద్దుతారు. దీనివల్ల బట్టలకరువు ఎలా తొలగిపోతుందో ఎవరికీ తెలియదు.

బట్టల వాడకం బాగా ఎక్కువైనట్టు తెలిపే లెక్కలు తయారుచేశారు. వస్త్రోత్పత్తి ఎక్కువ కావాలని ఈ లెక్కల అంతరార్థం.

మిల్లుబట్టల ఉత్పత్తికి పరిమితులు పెట్టడం వల్ల బట్టలకొరత ఏర్పడిందనే భావం సర్వత్రా వ్యాపించింది. ముందు ముందు ఈ భావం బలపడుతుంది కూడాను. ★



(ఒకటో అంకం తరవాయి)

[లైట్లు ఫేడిన్ అవుతాయి]

[సమయం సుమారొక గంట తర్వాత, గదిలో టేబుల్ లైటు వెలుగుతోంది. సోఫామీద కొంచెం పెద్ద సైజు ఫోటోగ్రాఫులు పడివుంటాయి

ఫణి పడక గదిలోంచి పాత లాంగ్ కోట్ ఒకటి తీసుకు వచ్చి జాగ్రత్తగా గోడ పక్కన పెడతాడు. ఫోటోగ్రాఫులవంక ఓ క్షణం చూసి, వెళ్ళి, అవి తీసి నీటుగా సోఫా చేతిమీద వుంచుతాడు.

ఒకసారి తన ఏర్పాటు చూసుకుని సంతృప్తి చెందుతాడు. తిరిగి పడక గదిలోకి వెళ్ళబోతూండగా హాలు తలుపు తట్టిన శబ్దం. అతను ఆగి, వెనుదిరిగి, తెచ్చిపెట్టుకున్న కుంటినడకతో, వెళ్లి తలుపు తెరుస్తాడు.

గజపతి బైట నిలబడి వుంటాడు]

గజ : పరమేశ్వరంగారేనా...?

ఫణి : అవున్నేనే. మీరు గజపతిరావుగారనుకుంటాను

గజ : యస్ ప్లీజ్ !

ఫణి : లోపలికి రండీ This is very good of you. ఆ కోటు ఇలా ఇవ్వండి, దీనికి తగిలిస్తాను.

[గజపతి లోపలకొస్తాడు. ఫణి అతని కోటు తీసుకుని కోట్ స్టాండుకు తగిలించి, హాలు తలుపు వేసి తాళం నొక్కుతాడు—]

ఇల్లు కనుక్కోవడంలో ఇబ్బందేమైనా పడ్డారా?

గజ : అబ్బే-ఏంలేదు.

ఫణి : కూర్చోండి.

గజ: థాంక్స్!...(కాని కూర్చోడు)... మిమ్మల్నెక్కడో చూసినట్టున్నాను...గుర్తు రావడంలేదుగాని...

ఫణి : (చటుక్కున తలెత్తిచూసి) మీకూ అలా అనిపించడం తమాషాగానే వుంది. నిజానికి గుమ్మంలో మిమ్మల్ని చూసినక్షణం నుంచీ నేను కూడా...(గబుక్కున ఆగి) గజపతా? నీ పేరు గజపతి కాదే...అం-రవీంద్రం! రవీంద్రం కదూ నీ పేరు?

గజ : నా కంటే మంచి జ్ఞాపకమే వుంది నీకు. కాని...పరమేశ్వరమా? ... ఎక్కడ మన పరిచయం?

ఫణి : బందరు నేషనల్ కాలేజీలో చదివావు కదూ?

గజ : చదివాను.

[ఫణి రెండు గ్లాసుల్లో విస్కీ పోసి సీసా బల్లమీద పెట్టేస్తాడు జవాబిచ్చేముందు]

ఫణి : అసలు అమ్ముతున్నావు గదా కారు?

గజ : అఫ్‌కోర్స్-అమ్ముతున్నాలే.

ఫణి : ముందు మూడు పెగ్గులన్నా పడందే బిజినెస్‌లోకి దిగన్నేను.

గజ : (నవ్వుతూ) తాగినా తాగక పోయినా బేరం విషయంలో మాత్రం నేను బెసకను సుమా

ఫణి : సరిగ్గా నా తత్వం కూడా అదే!

[ఇద్దరూ నవ్వుకుంటారు]

మాతృక: ఫ్రెడరిక్ నాట్
అనుసరణ: ప్రఖ్య శ్రీరామమూర్తి

ఫణి : అవును పదిహేను సంవత్సరాల నాటి సంగతి నీకు జ్ఞాపకం వుండివుండదులే. నువ్వు ఫైనల్ ఇయర్‌లో వుండగా కాలేజీలో ప్రవేశించాను నేను.

గజ : ఓ-అలాగా!

ఫణి : అయితే చిన్నపార్టీ జరిగి తీరాల్సిందే ఇప్పుడు. ఏదో కాసిని కాఫీనీళ్లు పోసి పంపించేద్దామనుకున్నా.

[పడక గదిలోకి వెళ్లి ఒక స్కాచ్ విస్కీ సీసా, రెండు గ్లాసులూ పట్టుకొస్తాడు. విస్కీ సీసా యెత్తిచూపుతూ—]

ఎలా వుంటుందిది నీకు?

గజ : అబ్బ—దాన్ని చూపించకయ్యా-అసలు కదలే నిక్కణ్ణుంచి, (సోఫాలో కూర్చుంటూ) అవునూ—నా కారు అమ్మేస్తున్నానని ఎల్లా తెలిసింది నీకు? ఇంకా ఎవళ్లతోనూ చెప్పిన గుర్తుకూడా లేదు నాకు.

గజ : బందరు వొదిలేసిన తర్వాత కూడా నిన్నెక్కడో చూసినట్టు జ్ఞాపకం నాకు.

ఫణి : ఇక్కడ నేషనల్ థియేటర్లో నాటకాలేమైనా చూసేవాడివా?

గజ : దట్సైట్ ! ఫణి—ఫణిభూషణరావు!...మరి...మరి యీ పరమేశ్వరావతారం యేమిటి?

ఫణి : (కొంటెగా చూస్తూ) ఈ గజపతి వేషం యేమిటి? (గజపతి ఇబ్బందిగా కదులుతాడు.) ఫస్టాసయిన చుట్టలున్నాయి. కాలుస్తావా ఒకటి?

గజ : నో, థాంక్స్! పైపు తాగుతాను.

ఫణి : అయితే ఆ అలవాటొకటి మారిందన్నమాట!

[ఫణి గోడదగ్గరకు పోయి గ్రూపు ఫోటో ఒకటి తీసుకువస్తాడు]

కాలేజీలో ఎప్పుడూ స్పెన్సరు చుట్టలు కాలుస్తూండేవాడివని నాకు బాగా జ్ఞాపకం. ఇక్కడెక్కడో నువ్వుకూడా వుండాలి. ఇదుగో-(ఫోటో అతనికి చూపుతూ) ఓల్డు బాయిస్ మీటింగు ఫోటో ఇది. ఫోటోలో కూడా ఆ చుట్ట వదిలిపెట్టలేదు నువ్వు.

గజ: (నవ్వుతూ) అదే నేను హాజరైన మీటింగల్లా! అబ్బ - నరహంతకుడిలా వున్నట్టున్నాను!

ఫణి: (ఇంకా కొంటెగా చూస్తూ) అప్పటికింకా హంతకుడవు కాలేదనుకుంటాను. డ్రెమెటిక్ అసోసియేషనుకి ఏదో ట్రెజరర్‌వి మాత్రమే. కదూ?

గజ: ఆఁ ఆనరరీ; దరిద్రగొట్టు ఉద్యోగం.

ఫణి: అప్పుడోకసారి నాటకం వేసిన తర్వాత డబ్బు అంతా ఎవరో ఎత్తుకుపోయినట్టుకూడా జ్ఞాపకం నాకు.

గజ: అవును. దాదాపు ఆరువందల రూపాయలు! అంతా లెక్కబెట్టి డబ్బాలో పెట్టి ఎసోసియేషన్ గదిలోనే వుంచాను. తెల్లారేసరికి గయామార్!

[గజపతి ఫోటో తిరిగి ఫణికి అందిస్తాడు. ఫణి దాన్ని టేబులుమీద వుంచుతాడు. గజపతి మాట తప్పించాలని ప్రయత్నిస్తాడు—)

గజ: సరేగాని - ఇప్పుడు నువ్వేమైనా నాటకాలు వేస్తున్నావా?

ఫణి: లేదు, మానేశాను. చిన్న ఉద్యోగం చేస్తున్నా. నూటయాభై ఇస్తారు.

గజ: అదేం? బోలెడు టాలెంట్ వుంది. పేరు ప్రతిష్ఠలు సంపాదించావ్. ఆమె మార్పులోనే ప్రొఫెషనల్ యాక్టరువు కూడా అయ్యావ్...

ఫణి: అది వేరేగాథ.

గజ: (గదిచుట్టూ చూసి) ఊఁ...మొత్తానికి తాహతుకు మించిందే అయినా చాలా బాగుంది ఇల్లు

ఫణి: మా ఆవిడకు వాళ్ళ తాతగారు రాసిచ్చిపోయిన ఆస్తి వుంది. లేకపోతే నాలుగు వేలుపోసి నీ కారులా కొంటాననుకున్నావ్?

గజ: ఆఁ వేలు!...ఆస్తి గలవాళ్ళు తామెంత అదృష్టవంతులో గ్రహించలేరు. నామటుకు నాకు ఠక్కడితే గాని డొక్కాడదు.

ఫణి: (పాలోచనగా) ఎవతెనైనా ఆస్తి గలదాన్ని చూసి పెళ్లిచేసుకోవచ్చుగా.

గజ: అవును...ఆ వ్యాపారం చేసేవాళ్లు కూడా వున్నారు.

ఫణి: (నిర్వికారంగా) నామటుకు నేను అదే చేశాను.

గజ: (పరిహాసంగా తీసుకుని నవ్వుతూ) నువ్వు ప్రేమించి పెళ్ళి చేసుకున్న పిల్ల ఆస్తిమంతురాలు కావడం సంభవించిందనా నీవుద్దేశం?

ఫణి: కాదు. డబ్బుకోసమే పెళ్లి చేసుకోవాలని మొదట్నుంచి నా అభిప్రాయం. నువ్వు వెళ్ళిపోయాక కాలేజీలో బాగా నాటకాలేశాను డబ్బున్న ఆడపిల్లలంతా నా చుట్టూ మూగేవాళ్ళు. నాలోనే దిలీప్ కుమార్‌నీ, నాగేశ్వరరావునీ చూసుకునేవారుకాబోలు...తర్వాత బైట...పొరుగూళ్లలో కూడా నాటకాలాడేవాణ్ణి పరిషత్తుల్లో పాల్గొన్నాను - పోటీల్లో గెల్చాను - లెక్కలేనంతమంది శిష్యుల్ని చేరదీశాను - నాదొక యుగం అన్నారు మొత్తానికి నన్నో విశిష్టవ్యక్తిగా చూసేవాళ్ళు... దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకుందామనుకున్నాను. ఆడపిల్లలంటే లెక్క చెయ్యనట్టు నటించి వలలు పన్నేవాణ్ణి... ఓసారి ఓ లక్షాధికారి కూతుర్ని పట్టాను. చాలా దూరం పోయింది వ్యవహారం. మా యిద్దరి బొమ్మలూ ఫ్రేముల్లో గోడలమీద కూడా కెక్కాయి ... అంతలోనే అదృష్టం తిరిగిపోయింది—మరో లక్షాధికారి కొడుకుని గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళి చేసుకుంది డబ్బుకీ డబ్బుకీ లంకె!...మళ్ళీ కాలం కలిసిరావడానికి కొంతకాలంపట్టింది. ఈసారి చాలా తక్కువ గిట్టింది. (శ్రమ కూడా అంతే పడలేదులే నేను. మా ఆవిడ మా ఆవిడ కాకముందు రెండేళ్ళనుంచీ నా వెంటబడి తిరుగుతూండేది—

గజ: (ఇంకా పరిహాసంగానే తీసుకుంటూ) తమాషా మనిషివే నువ్వు.

ఫణి: నిజంగానే. ఆమె నా కారోజుల్లో పెద్ద ఫాన్ అనుకో ఎక్కడైనా నాటకం వుంటే అక్కడల్లా ప్రత్యక్షమయ్యేది—

గజ: ఊఁ. (వాచీ చూసుకుని) మరి... నా కాట్టే టైంలేదు...

ఫణి: వాళ్లి తాతగారు రాసిచ్చిపోయిన ఆస్తివుంది—

గజ: (నవ్వుతూ) అవునూ—నువ్వు పెళ్లి చేసుకున్నది డబ్బుకోసంగదా - మరి ఆవిడ నిన్నెందుకు చేసుకుందంటావ్?

ఫణి: నేను నటరాజునోయ్! నా కళకూ నాఅభినయకౌశలానికీ ముగ్ధులుకానివాళ్ళెవరు?

గజ: ఇప్పుడా కళా, నాటకాలూ వదిలేశావ్, ఆవిడింకా నిన్ను వదిలిపెట్టలేదేం?

ఫణి: అంతపనీ అయింది.

[ఫణి కాలినొప్పి నటిస్తూ బాధతో లేచి నుంచోబోతాడు]

గజ: (తను లేస్తూ) నే తెస్తాలేవోయ్ - ఏం కావాలి?

ఫణి: థాంక్స్! ఆ బాటిల్ ఇలా అందుకుంటే బాగుంటుందనుకుంటాను.

గజ: ఓ యస్. చాలా మంచి ఐడియా.

[గజపతి విస్కీబాటిల్ తీసుకొస్తాడు. తన గ్లాసులోనూ ఫణి గ్లాసులోనూ విస్కీ వొంపుతున్నంతసేపూ ఫణి అతన్ని పరిశీలిస్తూనే వుంటాడు.]

ఫణి: అది నీకు వినాలనివుందా?

గజ: ఏది?

ఫణి: నా భార్య విషయం - ఆమె నన్ను వొదిలిపెట్టి వెళ్లిపోయినంత పనీ ఎలా జరిగిందీనూ!—

గజ: నువ్వు హోస్టువి, నీయిష్టం మరి.

ఫణి: నిజం చెప్పాలంటే, నువ్వు చెయ్య

కలిగిన సహాయంకూడా లేకపోలేదు......
ఏంలేదు—మనిషికి మనిషి ఊత—అంతే!

గజ: తప్పకుండానూ.

[గజపతిబాటిల్ టీపాయ్‌మీద పెట్టాడు.]

ఫణి: నాకు పెళ్లయింది. తర్వాతకూడా ఎడతెరిపిలేకుండా నాటకాలు ప్రాక్టీసు చెయ్యడం—ప్రదర్శించడం. కొన్నాళ్లు ఆమెకూడా నాతో పాటే తిరిగింది. పెంకటి లాగే చాలా మెచ్చుకునేది. ఒక్కోసారి మేకప్ తీయనిచ్చేదికాదు. అలానే ఇంటికి పోయి పడుకుందామనేది. నిద్రలో నన్ను పొదివిపట్టుకుని దిలీప్, దిలీప్ అనీ అశోక్ అనీ కలవరించడంకూడా రెండుమూడుసార్లు విన్నాను.

గజ: అబ్బ, నీది కటికకుండేసుమా!

ఫణి: (వికారంగా వికృహాసంచేసి) హుఁ — ... ఓసారి ఓనాటకంలో హీరోయిన్‌కూ, నాకూ మధ్య ఏదో స్కాండల్ లేచింది. అప్పట్నుంచీ నాటకాలు మానెయ్యమంది. ఇంట్లో మొగుడు పాత్ర సరిగా నిర్వర్తిస్తే చాలునన్నట్లు మాటామాటా వచ్చింది. పోట్లాడుకున్నాం — దెబ్బలాడుకున్నాం. మా యిద్దరిమధ్యా ఓ అగాధం ఏర్పడింది. పద్మ బాగా మారిపోయింది. నన్ను మునుపటిలాగా ప్రేమించడం లేదన్న సంగతొకటి ఖాయం. పోటీలో బహుమతిపొందిన ఒక నాటకం ఊళ్ళోవేయమని పురజనులకోరిక - వద్దని మా ఆవిడ, చాలా ఘర్షణజరిగింది నా కసహ్యంవేసి 'ఆగదిలోకిపోయి తలుపేసుకూర్చున్నాను. ఇంతలో ఇక్కడ ఫోనుమోగింది- కొంతసేపటికి ఆమెవచ్చి నాతో రాజీపడటానికి ప్రయత్నంచేసింది నాటకంలో తప్పకుండా వేషం వెయ్యమంది. తనుకూడా వచ్చిచూస్తానన్నది. రిహార్సల్సుకు వెళ్లొస్తానని నేను బైటికొచ్చి ఎవళ్లకీ కనిపించకుండా ఇంటిముందు కాపలాకాచాను. మరో పదినిమిషాల తర్వాత పద్మ బైటకువచ్చి సైకిల్‌రిక్షాఎక్కి ఎక్కడికోపోతోంది. నేనూ ఇంకో రిక్షా ఎక్కి వెంబడించాను. హుస్సేన్ సాగర్ దాకా వెళ్లి ఒక చిన్న డాబాముందు దిగి లోపలికిపోయింది. ఇంటిచుట్టూ గార్డెన్! చక్కని పూలచెట్లు -చాలా రొమాంటిక్‌గా వుంది వాతావరణం! ఇంట్లో ఇంకెవరూ వున్నట్టు అలికిడిలేదు. కిటికీలోంచి తొంగి చూశాను అక్కడో అబ్బాయి వున్నాడు. బాగా నేవున్నాడు....వాడూ-అదీ - ఇద్దరూ ఒకే కుర్చీలో కూచునివున్నారు. ఆట్టే మాట్లాడుకోడం లేదు కూడానూ. ఎవంగా కూర్చున్నా, ఇద్దరూ అతికినట్లు చాలా సహజంగా కనుపించారు నాకు. ప్రేమికుల్ని గుర్తించడం చాలా తేలిక. నేను

★ ఫణి ★

వెనక్కి తిరిగి నడవడం ప్రారంభించాను. అది నన్ను నిజంగా వొదిలేస్తే ఏమౌతుందా అని ఆలోచించసాగాను. ముందు జీవనోపాధి ఒకటి వెదుక్కోవాలి అనుకొని నేను ఎంతో ఆధారపడి వున్నానే ఆలోచన అకస్మాత్తుగా అశనిపాతంలా తగిలింది. అటు నాటకాల్లో నాకు పలుకుబడి వుంటంలేదు. ఇటు ఈమే ఏ క్షణానైనా నన్ను వదిలేసి లేచిపోవచ్చు. నిజంగా ఆ క్షణంలో నేను పడ్డంతభయం జీవితంలో ఇంకెప్పుడూ ఎరగన్నను. సిటీ బార్‌లోకి వెళ్ళి ఓ మూల కూర్చున్నాను రమ్ చప్పరిస్తూ. వాణ్ణి ఖూనీ చెయ్యడానికి మూడురకాల ప్లాను ఆలోచించాను. దాన్ని చంపేస్తే ఎలావుంటుందా అనికూడా ఆలోచించా. అదే మంచిదని తోచింది. అది ఎలా చెయ్యడమా అని ఆలోచిస్తుండగా తలుక్కున నా దృష్టిపథంలో ఓ మెరుపు మెరిసింది. తర్వాత కొంతసేపటికి ఇంటికొచ్చేశాను. నే వచ్చేసరికి నువ్విప్పుడు కూర్చున్న చోటే పడుకునివుంది. ఇవాళ నాటకాలు మానేను పద్మా అని చెప్పాను......

గజ: ఊ...తర్వాత?

ఫణి: (గబుక్కుని మనిషి మూడ్ మారిపోయి సోల్లాసంగా) నిజానికి ఆనాడు నేనంత ఆదుర్దా పడిపోవాల్సిన అవసరం ఏంలేదు తర్వాత విచారిస్తే తెలిసింది. అతనా రోజే మద్రాసు వెళ్ళిపోయాడని. కాని అక్కణ్ణించి పెద్ద పెద్ద వుత్తరాలు వస్తూండేవి. వారానికొకటి. ప్రతి బుధవారమూనూ. ప్రతిదీ చదివి ఎప్పటికప్పుడు స్టౌలో పెట్టి తగలం వేసుకునేది పద్మ. ఒక్కటి మినహా. అదిమాత్రం ఎప్పుడూ తనతోనే వుంచుకునేది. వీలు దొరికినప్పుడల్లా చాటుకుపోయి హేండ్‌బాగ్‌లోంచి ఆ వుత్తరంతీసి చదవడం కూడా గమనించాను. ఆ వుత్తరం ఒకదయ్యంలా పట్టుకుంది నన్ను. అందులో ఏముందో తెలుసుకు తీరాలనిపించింది. చివరికి తెలుసుకున్నాను. చాలా ఇంటరెసింగ్‌గా వుంది చదవడానికి.

గజ: దొంగిలించావేమిటా వుత్తరం?

ఫణి: కావలిస్తే అమ్ముతానని రెండు ఆకాశరామన్న వుత్తరాలుకూడా రాశాను పద్మకి.

గజ: అవ్వెందుకు?

ఫణి: దాంతోనైనా భయపడిపోయి నాతో అసలు సంగతంతా చెప్పేసి క్షమాపణ కోరుకుంటుందేమోనని!...కాని అదేం లాభంలేకపోయింది. ఉత్తరం నా దగ్గరే వుంచుకున్నాను.

[జేబులోంచి పెద్ద పర్సుతీసి జిప్‌లాగి అందులోంచి వుత్తరం సోఫాలో పడేట్లు వొంపుతాడు. గజపతి అది తీసుకుని కవరు పరిశీలిస్తూంటాడు.]

గజ: ఇంతకూ ... ఇదంతా నాతో ఎందుకు చెప్తున్నావ్?

ఫణి: నేను నమ్మదగిన మనిషివి నువ్వొక్కడివే గనక!

[గజపతి వుత్తరం మళ్ళీ పర్సులో పెడతాడు. ఫణి జిప్‌లాగి అది మూసేస్తాడు.]

నా ఆకాశరామన్న వుత్తరాలు కాస్తపని చేసినట్టే వున్నాయి. ఆ తర్వాత మరి జాబు లేవు ఇద్దరి మధ్యా (స్వరం మార్చి) జ్ఞాపకం చేసుకుంటుంటే తమాషాగా వుంది...సరిగ్గా ఇవ్వాల్టికి ఏడాది కిందట ... ఆ బ్రాంది షాపులో...దాన్ని హతమార్చి ఆ పీడ ఎలా వదిలించుకోవడమా అని ఆలోచిస్తూ కూర్చున్నా. అసలు నిజంగా అప్పుడే చంపేసి వుండేవాణ్ణికూడానూ, నా మనసు మార్చిన మనిషొకడు నా కళ్ళల్లో పడకుండా వుంటే!

గజ: (గుండెలనిండా పీల్చిన పొగ వొదుల్తూ ఇటు తిరిగి పైప్‌లో నుసి విదిలిస్తూ) ఊఁ...ఎవరు పడ్డారు నీకళ్ళల్లో?

ఫణి: (తొందరగా - క్షణిక అవకాశంతో) నువ్వు!...నిన్ను చూశాను.

గజ: (నెమ్మదిగా ఫణివైపు తిరుగుతూ) ఏమి టందులో అంత విచిత్రమైన విషయం?

ఫణి: నువ్వు ఆ టైములో కనబడటమే విచిత్రం. అంతక్రితం వారం రోజుల ముందే మన కాలేజీ ఓల్డు బాయిస్ మీటింగ్‌కి హాజరై వచ్చాను అక్కడ మనవాళ్ళంతా నీ సంగతికూడా చెప్పుకున్నారు. యుద్ధంలోకి వెళ్ళారట...అక్కడ కోర్టుమార్షలు ...ఓ యేడాది జైలు...అసలు కాలేజీలో కూడా అనుకునేవాళ్ళం ఎప్పటికైనా నీకు శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదని! ఆ నాటకం డబ్బు గొడవమూలంగానే ననుకుంటా!

గజ: గొడవేముంది అందులో?

ఫణి: (నవ్వుతూ) హారి పిచ్చి మాలోకం! ఆడబ్బు కాజేసింది నువ్వని తెలీంది యెవరికి? పాపం - అంజిగాణ్ణి తలుచుకున్నప్పుడల్లా బలే జాలేస్తుంది నాకు......

గజ: (లేస్తూ) ఊఁ.. థాంక్స్ ఫర్ ది డ్రింక్! నీ పెళ్ళిగొడవలు కూడా సరదాగానే వున్నాయి వింటానికి. (గుమ్మంకేసి పోబోతూ) ఇంతకీ నా కారు నీ కక్కర్లేదనుకుంటాను.

ఫణి: నిన్నిక్కడికెందుకు రప్పించానో చెప్పద్దూ మరి?

గజ: అవును- చెప్తే బాగానే వుంటుంది.

[దిగువ డైలాగు చెప్తూ ఫణి సోఫాలోంచి లేస్తాడు. తెచ్చిపెట్టుకున్న కుంటినడక

★ ఫణి ★

కదిలేశాడు. జేబురుమాల తీసి ఫోటోమీద వేలిముద్రలన్నీ శుభ్రంగా తుడిచి గోడకు తగిలిస్తాడు. తర్వాత యాష్‌ట్రే, టేబులు, విస్కీ సీసా జాగ్రత్తగా తుడిచేస్తాడు. యాష్‌ట్రే తీసుకుని గదిమూలవున్న చిత్తు కాగితాలబుట్టలో కుమ్మరించి మళ్ళీ తుడిచి టేబులుమీద పెడతాడు.]

ఫణి: అసలు తిరకాసంతా జరిగింది ఆ బార్‌లో కూర్చునివుండగా నువ్వు నా కళ్ళల్లో పడ్డప్పుడు. హఠాత్తుగా నా మనస్సులోని సందేహ సంకుల సమరమంతా ఆగిపోయింది ప్రళయకాల పర్జన్యనిర్ఘోషం ప్రశాంతించినట్లైంది. కాలం స్తంభించినట్లైంది. ఒక్క క్షణం సకలచేతన వస్తుజాలం కదలికలేని నిశ్చలత్వం పొందినట్లైంది. దారుణ నాగపర్వదష్టుడై గిలగిల కొట్టుకుంటున్న మనిషి కన్నుమూసి, మరొక్కసారి కాళ్ళుచేతులు విదిలించి బారజాచి మరి కదలనట్లైంది. నా కల్లోల హృదయం, సంధిజ్వరపీడిత మస్తిష్కం ఒక్కసారి ప్రశాంతి పొందాయి...అంతా స్ఫటికంలా, స్వచ్ఛంగా, నేరుగా కనిపించింది అంతకు ముందు నాలుగైదు నెలల క్రిందటే నేనూ పద్మా వీలునామాలు రాయించుకున్నాం. చాలా చిన్నవి. ఏమైనా అనుకోని ప్రమాదాలు జరిగితే మాకున్న ఆ ఆస్తిపాస్తులన్నీ మిగిలినవాళ్ళ రెండో మనిషికి చెందాలని! దాని ఆస్తంతా లెక్కజూస్తే అరవై డెభ్భై వేలదాకా వుంది. నాదిచూస్తే, నాలు గెకరాల మెట్టదిబ్బ. అలాంటప్పుడు నేనే ఎంత తెలివితేటలు ఉపయోగించి హత్య చేసినా అంతా నన్నే అనుమానిస్తారు. హత్య జరిగే టైంలో నేను మరెక్కడన్నా వుండాలి. అక్కడెక్కడో వున్నట్టు బలమైన సాక్ష్యం కావాలి నా తరఫున. ఎల్లాగా అని ఆలోచిస్తూండగా దేవుడిలా నువ్వు సాక్షాత్కరించావు. అసలు జైల్లో పడి ఇవతలకు వచ్చిన వాళ్లు-అంటే, నీలాంటి వాళ్లు-బైటికొచ్చిన తర్వాత ఏమౌతారా అని చాలాసార్లు ఆలోచించేవాణ్ణి వాళ్ళకు ఉద్యోగాలు దొరుకుతాయా? పాతస్నేహితులలో ఒక్కళ్ళన్నా ఆదుకుంటారా? అసలు వాళ్ళకి స్నేహితులే వుండరేమో...! ఇన్ని ఆలోచనలు ఒక్కసారి పెల్లుబికి వచ్చి ఆగలేక అతి కుతూహలంతో వెంట నేనిన్ను వెంబడించాను ఆ రాత్రి నువ్వు ఇంటికి చేరుకునేదాకా నిన్ను నీడలా అనుసరించి—ఆఁ-ఆ గ్లాసిలా ఇస్తావా దయచేసి.

గజ: (మతి మతిలో లేనట్లు చూస్తూ గ్లాసు ఇస్తాడు.)

ఫణి: థాంక్యూ థాంక్యూ సోమచ్. అప్పట్నుంచీ నిన్ను వెంబడిస్తూనే వున్నాను.

గజ: ఎందుకు?

ఫణి: (గజపతి గ్లాసు శుభ్రంగా తుడిచి బల్లమీద పెట్టి) ఏముందీ - ఎప్పుడో ఓసారి ఏదో చేస్తూ నాకు దొరికిపోకపోవు దాంతో నేను—

గజ: నన్ను బ్లాక్ మెయిల్ చెయ్యవచ్చునని?

ఫణి: అబ్బే - కొత్త వొత్తిడి పెట్టడానికి అవకాశం వుంటుందనీ!...ఒకటి రెండు వారాలయ్యేసరికి నీ దినచర్యఅంతా తెలిసిపోయింది నాకు

గజ: పాపం - చాలా వృథాప్రయాస.

ఫణి: ఏం లేమటుకేం? కష్టానికి తగ్గ ఫలితం లభించింది ఒక్కోసారి నువ్వు పూర్తిగా నావాడివే, నా చేతిలో కీలుబొమ్మవేనని పించేది.

గజ: ఆఁహాఁ!?

ఫణి: ప్రతి సోమవారం, గురువారం రేసుకోర్సులు—వున్నట్టుండి రవీంద్రం పేరుమార్చి బాబూరావుని కావడం—బీబీనగర్ కల్లీకొట్లో గంజాయి వ్యాపారం—మారేడుపల్లిలో ఒకానొక విశ్వస్త ఇంట్లోంచి అదృశ్యంకావడం—చివరికి రాయ్‌ఘర్‌లో నారాయణబాబుగా అవతరించడం — నిజంగా నేనే ఓ రచయితనైతే నీ ఎడ్వెంచర్స్ అన్నీ ఓ పుస్తకంగా రాసిపారెయ్యాలనివుంది.

గజ: (తన భయం కప్పిపుచ్చుకోడానికి శుష్కమందహాసంతో వెకిలిగా చిన్న నవ్వు నవ్వుతూ) ఆఁ? అంతబాగుందా నా బయోగ్రఫీ? (అంటూ విస్కీ బాటిల్ అందుకోబోతాడు.)

—ఇంకా ఉంది.

నిత్య శంకితుడు

ఆర్. వి. జి. కృష్ణమూర్తి

ఏడుసార్లు పొంచివేటాడుతున్న పెద్ద పులిని ఒక తుపాకి గుండుతో పట్టపగలు కొట్టి చంపి, సర్కారు బహుమతులు పొందిన సర్ వీరవెంకట శివరామకృష్ణయ్యగారికి మనవడుగా పుట్టిన 'శ్రీపతి'లో అటు తాతగారి గుణాలు గాని, ఇటు తప్పతాగి, భార్యను చితకబాదే తండ్రిగుణాలు గాని మచ్చుకైనా లేకపోయినా, సర్వలక్షణ పిరికి సంపన్నుడుగా కావలసిన లక్షణాలన్నీ మూర్తీభవించి వున్నాయి.

"జీవితమెంతో భయంకరమైనది" అంటాడు శ్రీపతి. శ్రీపతి జీవితమంతా భయాలతోనే గడిచింది. చిన్న పిల్లాడుగా వుండేప్పుడు చీకటిని చూచి ఎంత భయపడేవాడనీ! "చీకట్లో కంటికి కనపడకుండా ఎన్ని తేళ్ళూ, పాములూ, దెయ్యాలూ, భూతాలూ...ఇంకా ఏమేమున్నాయో!" అని గడగడ వణికిపోయేవాడు శ్రీపతి. ఎప్పుడూ అమ్మను వదిలేవాడు కాదు. వంటింట్లో వున్నప్పుడు, పెరట్లో కెళ్ళినప్పుడు, ప్రక్కింటికి కెళ్ళినప్పుడు, పేరంటానికెళ్ళినప్పుడు "తోకంబడినారాయణా" అని కొంగుబట్టుకొని అమ్మ వెనకాలే తయారయేవాడు. రాత్రి యింటి పనులన్నీ చక్కబెట్టుకుని అమ్మ వచ్చేవరకూ శ్రీపతి అలాగే మేలుకూర్చుని, అమ్మ వచ్చిన తర్వాత ఆమె లేచి వెళ్ళకుండా చెయ్యి కళ్ళతో కాపలా కాచేవాడు.

అన్నిటికంటే శ్రీపతికి భయం వాళ్ళ నాన్నను చూచినప్పుడు. ముఖ్యంగా వాళ్ళ నాన్న రాత్రిపూట క్లబ్బునుంచి బాగా తాగివచ్చి, సిగరెట్లకనీ, దానికనీ, దీనికనీ బయటకి పంపినపుడు, ఆ చీకటిని చూచి మూర్ఛపోయినంత పనయ్యేది శ్రీపతికి.

శ్రీపతి నాన్న తాగి, అమ్మను ఎప్పుడూ కొడుతుంటాడు. ఒక్కోసారి తాగకపోయినా కొడుతూంటాడు. అది ఆయన దినచర్యలో ఒక భాగమైపోయింది. భార్యను కొట్టడంలో అతనుపయోగించే హింసాత్మకమైన పద్ధతులు చూచి, శ్రీపతికి ఆ భయంలో తెరచిన నోరు తెరచినట్టే వుండిపోయేది. ఆ బాధలు పడలేక వాళ్ళమ్మ మొగుణ్ణి శాపనార్థాలు పెట్టి, "నేను ఏనుయ్యో, గొయ్యో చూసుకొని చచ్చిపోతాను. అదే నా ఆఖరి కోరిక" అని తెగేసి చెప్పుంటే శ్రీపతి ముఖం భయంతో పాలిపోయేది. తల్లి అప్పుడప్పుడూ కొడుకును హెచ్చరించేది కూడాను,—"నాన్నా. నీకు నీవు జాగ్రత్తగా వుండటం నేర్చుకో, నేను యిక ఎన్నో రోజులు బ్రతకను, ఆ తర్వాత నిన్ను చూసేవాళ్ళెవ్వరూ వుండరు" అని. ఆరాత్రి తన తల్లి చనిపోతే, అమ్మ శవాన్ని నాన్న తీసుకుపోయి తగలపెట్టి వచ్చినట్టు కలగని, చేతులతో పక్కంతా వెతికేవాడు అమ్మ కోసం. ఇంత పిరికివాడు గాబట్టే స్కూల్లో పిల్లలు "పిరికి శ్రీ (పతి)" అని "పి. శ్రీపతి" అనీ పిలిచేవాళ్ళు.

శ్రీపతిని వాళ్ళనాన్న కొట్టినప్పుడు తల్లి పరుగెత్తుకొచ్చి పిల్లాడ్ని లాక్కుని హృదయానికి గాఢంగా హత్తుకుని, ప్రేమతో ముద్దాడేది ఆమె "భర్త కోపానికి యిదే ప్రతీకారము" అని తృప్తిపడేది ఒకవిధంగా. కోపంతో గట్టిగా అరిచేది "యీ విధంగా కొట్టి పిల్లాడికి జ్వరం వచ్చి చస్తే మీరు సుఖంగా బ్రతకొచ్చు" అని.

"ఇలా కొట్టుకుంటే బిడ్డ చావకేంజేస్తాడు" అనుకుని గాయాలకు కట్టుకట్టి పక్కమీద పడుకోబెట్టి ప్రక్కనే కూర్చుంటే "యిప్పుడు చచ్చినా భయంలేదు" అనుకునేవాడు శ్రీపతి మనస్సులో. మళ్ళీ జ్వరం-చావు యివన్నీ మెదడులోకి రాగానే, గుండె కొట్టుకుంటూందో లేక ఆగిపోయిందో నని ఒక్కసారి చెయ్యిపెట్టుకుచూచి, అదేవిధంగా నాడి ఆడుతూందో లేదో నని చూచుకునేవాడు. అవి రెండూ సరిగానే పని చేస్తున్నాయని నిశ్చయించుకున్నాక "హమ్మయ్య" అనుకునేవాడు.

శ్రీపతి కొంచెం పెద్దయ్యాక భయం తగ్గిపోవడం అలా వుంచనిచ్చి, యింకా ఎక్కువగా వడం మొదలెట్టింది. ఇప్పుడు శ్రీపతికి సూర్యుడు, భూమి, గాలి అన్నా కూడా భయమే. గాలి ఎక్కువగా వీస్తున్నపుడు తనకి పడిసెం పట్టి బాధించబోతోందనీ, సూర్యుడు బాగా వడిసె త్తిన వున్నపుడు తను వడదెబ్బ తగిలి చనిపోతాడనీ, యీ భూమినిండా అంటువ్యాధులే కాబట్టి సాధ్యమైనంతవరకూ దానికి తగులకుండా వుండే ఏర్పాటేదో చేసుకోకుంటే ఆతర్వాత చింతించి ఏమీ లాభంలేదనీ... యిలాంటి ఆలోచనల్తో సతమతమైపోతూండేవాడు శ్రీపతి. శ్వాస బాగా పీల్చే ధైర్యం బొత్తిగా లేదు అతనికి

"అవునుమరి. గాలినిండా మనకంటికి కనపడని సూక్ష్మజీవులెన్నో వున్నాయిగా. అవన్నీ కడుపులోకి పోవూ"

శ్రీపతికి వుండే స్నేహితులు ఒకరో, యిదరో. ఆమాటకొస్తే, లేరనే చెప్పాలి. స్నేహితులతో చేరితే కాఫీ హోటళ్ళకీ, పేకాటక్లబ్బులకీ, బ్రాందీషాపులకీ లాక్కెళ్తారు అందుకనే స్నేహితులకీ, శ్రీపతికీ చాలా దూరము. సంఘంలోని కట్టుబాట్లను ఎట్టి పరిస్థితుల్లోనూ అతిక్రమించడు. "ఆదర్శ పౌరుడు" అని పేరుగాంచాడు. "రోడ్డుమీద ఎడమవైపుకే పొమ్మ" దగ్గర నుంచి "భోజనము చేయునప్పుడు మౌనముగా నుండుము" వరకూ అన్ని విధులనూ, సూత్రాలనూ సక్రమంగా, నియమబద్ధంగా పాటించేవాడు. ఒక్కొక్కప్పుడు శ్రీపతి తనకు

★ నిత్యశంకితుడు ★

తెలియకుండా సంఘంలోని పద్ధతులను అతిక్రమించి దానికి అన్యాయము తలపెట్టిన వాడినౌతానేమోనని ఎంతో భయపడిపోయేవాడు.

* * *

శ్రీపతి తన వివాహ విషయంలో ఎప్పుడూ శ్రద్ధ తీసుకోలేదు. తల్లి కూడా చనిపోయింది గాబట్టి ఈ విషయాన్ని యింకెవరూ పట్టించుకొనేవాళ్లు లేక కాని, నలుగురూ చేసే పనిని, తాను చేయకుండా వుంటే, అందరూ వేలెత్తి చూపుతారేమోనని భయపడి శ్రీపతి తన దూరపు బంధువుల సహాయంతో గృహస్థుడయ్యాడు

తాళిగట్టిన మరుక్షణంనుంచే భార్యను గురించి కూడా భయపడడం ప్రారంభించాడు "లేకుంటే తనని అప్పులపాలు చేస్తుందేమో .. ..లేకుంటే యిష్టంలేక మరొకడితో లేచిపోతుందేమో......" ఈ ఆలోచన రావడంతోనే వంటింట్లోకి పోయి చూశాడు. భార్య లేదు. శ్రీపతి గుండెలు కొట్టుకోవడం మానేశాయి "ఇంకేముందీ గోవిందా!! ఎవడితోనో లేచిపోయింది ఎవడితో పోయుంటుంది చెప్మా" అనుకుంటూ దొడ్డంతా వెతికాడు. కనబడలేదు. యిల్లంతా గాలించి వీధిగదిలోకి వచ్చాడు. కిటికీవద్ద నిలబడి రోడ్డులోకి చూస్తూంది భార్య. శ్రీపతి గుండెలు తిరిగి పనిచేయడం మొదలెట్టాయి దగ్గరకు వెళ్లి మెల్లిగా "కిటికీవద్ద ఎప్పుడూ నిలబడకు ఈ పేటలో వుండేవాళ్ళంతా రౌడీలు ఏ కాలం ఎట్లా ఉంటుందో మనం చెప్పలేము తర్వాత..... కూరగాయలమ్మేవాళ్ళనూ, రిబ్బన్లవాడినీ యింట్లోకి రానివ్వకు వాళ్ళంతా దొంగలముఠాకు చెందినవాళ్లు" అని కూడా హెచ్చరించాడు

శ్రీపతికి యిలాంటి వెర్రి భయాలూ—వీటితో కూడా పాతకాలపు మూఢనమ్మకాలూ-అన్నీ వుండేవి వయస్సు వచ్చేకొద్దీ అవి బాగా వేళ్లు పాతుకుపోయాయి ముప్పయ్యోయ్యేపడిలో పడేప్పటికి శ్రీపతి ఆచారాల్లోనూ, నమ్మకాల్లోనూ, అనుమానాల్లోనూ—సనాతనులైన ముసలి విధవలను కూడా మించిపోయాడు

ఇంట్లోంచి బయలుదేరేప్పుడు తుమ్మిన శబ్దం చెవులపడితే చాలు, ఆనాటికి ప్రయాణం విరమించేసేవాడు 'పాము' అనేమాట వినబడితే తక్షణం సర్పసంహారకుడైన పక్షీంద్రుడ్ని స్మరణచేసుకోవడం, బల్లి పలికినప్పుడు "కృష్ణ కృష్ణ" అనుకోవడం అతనికి పరిపాటైపోయాయి ఈ నమ్మకాలతో శ్రీపతి రోజూ ఎంతో బాధపడుతున్నా వాటిని వదిలేందుకు భయపడిచచ్చేవాడు

* * *

శ్రీపతికి పిల్లలు పుట్టిన తర్వాత పట్టుకున్న కొత్తభయాలతో పాతవాటినిగురించి ఆలోచించేంత తీరిక లేకపోయింది పిల్లల్ని గురించిన భయాల్తో శ్రీపతి నిద్రాహారాలు లేకుండా బాధపడుతుండేవాడు. పిల్లలు ఇల్లూ, వాకిలీ అంతా తిరుగుతుంటూ పరుగెత్తుతుంటారు. మేడమెట్లు పూరికే ఎక్కుతారు. చెట్లెక్కి కోతికొమ్మంచి ఆటలాడతారు. కాని వాళ్ళు పడితే దెబ్బలు తగులు

తా ను చూసే జ్ఞానం లేదు. 'ఈ పిల్లలతో ఎలా వేగాలి' అని శ్రీపతి మధ్య మధ్యలో అమ్మ చిరాకు పడుతుంది, ఐస్ క్రీమ్ లూ కొని ఎంతో ఆప్యాయంగా తింటారు. "నాకెందుకు తెలుసు వాటిల్లో కలరాకు సంబంధించిన సూక్ష్మజీవులుంటాయని". శ్రీపతి మనస్సులో అగ్గి యిపోయేవాడు పిల్లలమీద.

"పిల్లలు ఇన్ని పనులు చేస్తుంటే తన భార్య ఇవన్నీ పట్టించుకోకుండా తన పనులు చేసుకుంటూ ఉంటుందే ఈ మనిషి తనకో ఏమిటి? ఇన్నాళ్ళుగా నాతో కాపురం చేస్తుంటే ఈమాత్రం అర్థం చేసుకోలేకపోయిందా" అని శ్రీపతి లోపల్లోపలే భార్యమీద ఎంతో ఈర్ష్య పడ్డాడు. ఉండబట్టలేక ఒకనాడు "నాకేమొచ్చాయినా నీకేం, ఏదైనా జబ్బు చేసి హాస్పిటలుకు పరుగెత్తాల్సినవాణ్ణి నేను, డబ్బు పోసేల్సినవాణ్ణి నేను. ఇళ్ళో అంతా పిల్లల్ని సరిగా పెంచలేనివాణ్ణని అనుకునేది నన్ను గాని, నిన్ను గాదుగా' అంటూ భార్యపైకి లేచాడు. ఆ తర్వాత తన నోటినీ నిందించుకున్నాడు "ఇలా మాట్లాడినందుకు తన భార్య ఏం అపార్థం చేసుకుంటుందో, ఎప్పటికో, ఎక్కడికి వస్తుందో తర్వాత ఈ పిల్లల్లో తనొక్కడే ఎలా వేగగలడు" తొంగిచూశాడు కిటికీలోంచి భార్య పెట్టె సర్దుకుంటుందేమోనని. అతని అనుమానం కాని ఆమె తనపట్ల ముందేసుకుని వంకాయలు తరుగుతూ కనిపించింది. శ్రీపతి మనసు కుదుటపడింది.

పిల్లల్లో ఎవ్వరికీ శ్రీపతి అంటే భయం లేదు. భక్తి అసలే లేదు. గౌరవం అంతకన్నా లేదు. శ్రీపతి వస్తువులతో నిర్భయంగా ఆడేవారు. శ్రీపతి స్నానానికి సూర్యరశ్మిలో పెట్టే నీటిని వేడిగా కాదు బక్కెట్లో పెడితే నీళ్ళు ఒలకబోసేవాళ్ళు ఎప్పుడూ తెరవని శ్రీపతి పుస్తకాలగదిలోని కిటికీని బార్లా తెరచి పెట్టేవాళ్ళు. శుభ్రంగా వుంచే శ్రీపతి పరుపునూ, బాగా వద్దపెట్టుకున్న పుస్తకాలనూ ధ్వంసం చేసేవాళ్ళు. అంతా గమనించినా, శ్రీపతి వాళ్ళ నేమీ అనకుండా ఓపికతో నోరుమూసుకుని వూరుకునేవాడు.

"ఈ వయసులో అంతా మారుతుంటే యింతి అనిర్దేశ్యమైన పనులు చేస్తుండగా త్వరలో చనిపోతానని పిస్తోంది పిత్రార్జితంలోని ధనం దాన్ని ఒక్కనాడైనా తను అనుభవించలేదు. ఒక్క ముద్దూ, ముచ్చటా తీరలేదు ఈ పిల్లలతో" అని చింతిస్తుంటాడు శ్రీపతి ఇంట్లో జరిగే ప్రతి చిన్న విషయం గానూ కల్పించుకుని అడుగుతు "నా మాట ఎవ్వరూ వినరేం" అని నెత్తిన చేతులు పెట్టుకుని కూర్చుంటాడు.

* * *

ఒకనాడు పెద్దకొడుకు సురేష్ "అమ్మా



కంచి కైలాసనాథాలయ గర్భగృహంలోని శివుడు.

ఫోటో: పి. గురుమూర్తి.

నాన్నను తన పనేదో తను చూసుకో మను. మా విషయాల్లో ఎంగకూ అనవసర జోక్యం" అన్నాడు శ్రీపతి వినేలాగా.

"ఎవ్వరూ లేకుంటే కృష్ణా రామా అనుకుంటూ మా కూర్చోవలిగాని" కూతురు గీత, తాళం వేసింది అన్నయ్యకు.

శ్రీపతి విన్నాడు ఏంచేస్తాడు? అసలు ఏం చేయగలడు? గోడ మీద చిత్రం గిట్టుకున్నాడు పిల్లలతో మాట్లాడే అవకాశం రాదు అనిపిస్తే వచ్చినా, మాట్లాడేందుకు చెప్పేదేముం.

పెద్దబ్బాయి సురేష్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగు చదువుతున్నాడు. వాడు రోజూ కాలేజీనుంచి సాయంకాలం యింటికి తిరిగి వచ్చేంతవరకు ఉండే దాదాపు ఆరుగంటలూ ఉంది శ్రీపతికి 'ఎక్కడ షాక్ కొట్టి తన కొడుకు చనిపోతాడోనని". ఒకనాడు తెగించి చెప్పాడు కొడుకుతో "ఒరే నాన్నా- ఆ ఎలక్ట్రికల్ యింజనీరింగు వద్దురా. సివిల్ యింజనీరింగు చదువు. అది ఎంతో అపాయం నాయనా. ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలీదు కదా" కొడుకు వినిపించుకోకుండానే వెళ్ళాడు.

★ నిత్యశంకితుడు ★

"అమ్మాయ్, గీతా, నీవు రోజూ ఆ కాలేజికి బస్సులో ఎందుకెళ్తావ్ తల్లీ. బస్సునిండా జనం వుంటారు. వాళ్ళ దగ్గర ఏమేం జబ్బులుంటాయో మనకి తెలీదు. నాకింత యిస్తానని ఒకరిక్షా కుదుర్చుకో అమ్మా" అన్నాడు నెమ్మదిగా. "బస్సుల్లో పోయే వాళ్లంతా చస్తున్నారా నాన్నా. నీకెందుకు నాగొడవ" అంటూ ఎత్తుమడిమల జోళ్లు టకటకలాడిస్తూ వెళ్ళింది. "యీ జోళ్ళొకటి నా ప్రాణానికి. వాటిమీద సరిగ్గా బ్యాలెన్సుగా నడవాలి లేకుంటే జారిపడి కాలు బెణుకుతుందేమో." అనుకుంటూ శ్రీపతి కూలబడ్డాడు కుర్చీలో.

వీళ్ళకి చెప్పి లాభంలేదు. అంతకంటే చూస్తూ వూరుకుండడమే మేలు. జరగాల్సింది జరగక మానదు. శివుడాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదు. అంతా ఆ భగవంతుడి దయ. ఆ ఏడుకొండలవాడి కరుణ. "వెంకటేశ్వరస్వామీ - మా పెద్దవాడికి ఎలక్ట్రికల్ యింజనీరింగు కోర్సు ఏలాటి అపాయం రాకుండా పూర్తయితే, మాగీత పెళ్ళయి ఒక యింటిదైతే, మాచిన్నవాడికి ఇంగ్లండ్ చదువుకు గవర్నమెంటు స్కాలర్ షిప్ రాకుండాపోతే, పత్నీ సమేతంగా నీదర్శనం చేసుకుని, నేను మాత్రం తల నీలాలు సమర్పించుకుంటాను స్వామీ—" శ్రీపతి మనసులో ప్రార్థించాడు. "పిల్లలు పెద్దవాళ్లయి వాళ్ల కాళ్లమీద వాళ్లు నిలబడ గలిగి ఎవరిదారిన వాళ్లు పోతే, వార్ధక్యంలోనైనా జీవితం శాంతంగా గడపగలను గదా" అని శ్రీపతి ఆశ, ఆశయం.

చదువు పూర్తయి సురేష్ గవర్నమెంటు ఉద్యోగి అయాడు. గీతకు పెళ్లయి అత్తారింటి కెళ్లింది. చిన్నకొడుకు వేణు పెద్ద చదువులకోసం ఇంగండు వెళ్లాడు. అబ్బా!! యిక నేం!! "ఏమేవ్! యిక మన వానప్రస్థాశ్రమం నిర్విఘ్నంగా కొనసాగుతుంది గదూ" అన్నాడు శ్రీపతి భార్యనుద్దేశించి.

* * *

కాని, కొద్ది రోజుల్లోనే తెలుసుకున్నాడు శ్రీపతి, తాను పొరపాటుపడ్డానని. "నే నెంత తెలివిమాలిన వాడిని. పిలలు దగ్గరైనా వుంటే చూచి తృప్తిపడేవాడిని. వాళ్లు కులాసాగా వుంటే తన కంతకంటే ఏంకావాలి? వాళ్ళకు నేనంటే లెక్కలేకపోతే నేం? వాళు జబ్బుపడితే సేవజేస్తూ, కష్టాలువస్తే సలహాలిస్తూవుంటే ఎంత బావుణ్ణు! అయినా పిలలుగదూ. వాళ్ళకు పెద్దవాళ్లు చెప్పే మాటలూ, చేసే చేష్టలూ, అన్నీ వింతగానే వుంటాయి. తన బిడ్డలు గాబట్టే తిన్నగా వున్నారు. ఇంకెవరైనా అయితే ఎందుకంటారు?"... శ్రీపతి మనసేం బాగుండలేదు.

రోజంతా కంటికి కనుపించని పిల్లల్ని గురించి దిగులుపడడమే శ్రీపతి పని. "వాళ్లకు అంతా సదుపాయంగా అమరిందో లేదో! గీతకు అత్తారింట్లో ఎలా వుందో? భర్త సరిగా చూస్తున్నాడో లేదో? చూస్తాడులే! చూడకుండా ఎందుకుంటాడూ... చదువుకున్నవాడే కావాలని కోరుకుందిగా! ఇక వేణు—దేశంగాని దేశంలో చలి కెలా బాధపడుతున్నాడో ఇక్కడ ఎప్పుడూ - వేసవికాలంలో గూడా దుప్పటి బిగించి పడుకునేవాడు. పాపం! తెలుగు మాట్లాడేవాడే వుండడుగా ఆ పాడు ఇంగ్లండులో. ఏంజేస్తున్నాడో ఏమో! పిచ్చికుంక!!

పెద్దవాడు సురేష్ ఒట్టి అర్భకుడు. అమిత బలహీనుడు. ఆరోగ్యం గురించి శ్రద్ధలేదు వాడికి ఎప్పుడూ చిరుతిండి అలవాటు. గర్భిణీస్త్రీలాగా ఏ వస్తువైనా తినాలని ఆశ. ఊరగాయలంటే భలే యిష్టం. సంవత్సరం పాటు నిలవుండేవి గదా. వాటిలో చెడు సూక్ష్మ జీవులు చేరవని నమ్మకం ఏమిటి? కాని, వాడికా ఊరగాయలంటే ప్రాణం. బీచిలో అమ్మే "వేంగా మాంగా బట్టాణీ" మొదలు రోడ్డుమీద అమ్మే కాల్చిన మొక్కజొన్న కంకులు వరకూ తింటూంటాడు.

శ్రీపతి ఎన్నిసార్లో చెప్పిచూచాడు, ఒరే! అబ్బాయ్ ఈ అడ్డమైన తిండీ తినకు. హాయిగా భోంచేయ్ అన్నంలోకి ఆకుకూరలే ఎక్కువగా వాడు వాటిల్లోనే ఎన్నో విటమిను వున్నాయి ఇనుమూవుంది. బలానికి బలం. చవుకకి చవుక" అని నెత్తిన నోరుపెట్టుకు చెప్పాడు. కాని ఎవరు వింటారు? శ్రీపతి మాటంటే ఆ యింటో ఎవరికి లెఖ్ఖ? జ్యేష్ఠపుత్రుడు సురేష్ ఆ చెవితో విని, యీ చెవితో వదిలేసేవాడు.

"కాని, యిప్పుడో, వాడిని అడిగేవాళ్ళు లేరు. సంపాదిస్తాడు. చెత్త చిరుతిండ్లన్నీ తింటాడు. మూలబడతాడు. నాకు తెలుసు. వీడికి తప్పకుండా జబ్బు చేస్తుంది. చచ్చిపోతాడు. కాని వెధవది, ఎందుకు అలాంటి ఆలోచన—ఏడుకొండలవాడా! వాడ్ని రక్షించే భారం నీదే" శ్రీపతికి కళ్ల నీళ్ల పర్యంతం అయింది. తాను చనిపోయిన తర్వాత కొరివి బెట్టాల్సినవాడు. తన ఆత్మశాంతికి ప్రార్థించవలసినవాడు. తన తర్వాత ఈ యింటికి తనంతటివాడు. వాడు చనిపోతే ఎలా మరి?


తన మాట చెవిని బెట్టడని తెలిసీ, సురేష్ ఆహారంపట్ల, ఆరోగ్యంపట్ల జాగ్రత్తవహించమని ఎన్ని ఉత్తరాలో వ్రాశాడు. ఏ మాసంలో ఎలాంటి కూరగాయలు వాడాల్సింది, ఫలానా ఋతువులో దినానికి రెండుమార్లు స్నానం అవసరమా? లేక ఒక్కసారే చాలా? భోంచేసి చెయ్యికడుక్కున్న తర్వాత ఒకగాసు నీళ్లు త్రాగినందువల్ల ఉపయోగము లేదు? "మధ్యాహ్న భోజనమైన తర్వాత కొంచెంసేపు కూర్చోవాలి, రాత్రి భోజనం తర్వాత ఒక మైలుదూరం నడవాలి" అన్నది ఎంతవరకు నిజం? మధ్యాహ్నం, రాత్రీ కూడా పెరుగు వాడవచ్చా?... ఇలాంటి విషయాలమీద తర్కిస్తూ జాబుల రూపంలో వ్యాసాలు వ్రాసి పంపేవాడు శ్రీపతి కుమారుడికి. "వాడు ఈ జాబులన్నీ చదివాడా? చదివినా ఎంతవరకు ఆచరణలో పెట్టాడు?" అన్న సందేహం ఎప్పుడూ శ్రీపతిని వదలిపెట్టలేదు. "పగలంతా ఆఫీసులో పనిచేసి, రాత్రి ఇంత పెద్ద జాబులు చదువుతూ నిద్ర పోగొట్టుకోవడం లేదు గదా. ఇకమీద చిన్న జాబులే వ్రాయాలి" అనుకున్నాడు. కాని, ఒకటి మాత్రం నిజం. శ్రీపతిని పట్టి పీల్చి, పిప్పిచేసి పారేస్తున్న భయం అదే.

ఏదో ఒకనాడు "మీకొడుకు సురేష్ చని పోయాడు" అనే జాబును అందించివెళ్లాడు పోస్టుమన్. అందుకనే పోస్టు జవాను వచ్చే వేళకు ఆత్రంగా గుమ్మంవద్దకు వెళ్తాడు.

పెద కొడుకును గురించిన విషయాల్లో సతమతమౌతున్న శ్రీపతికి మిగతా పిల్లలవల్లనైనా మనశ్శాంతివుండగా అంటే అదీలేదు కుమార్తె గీతను గురించి ఆలోచిస్తుంటే శ్రీపతికి మనశ్శాంతి మచ్చుకైనా వుండదు. గీత ఎవ్వరిమాటా వినే మనిషికాదు. తన మతి మేదో తనకే. పైగా తలపొగరు జీవితమంటే ఆపిల్ల కర్థమైంది బహు కొద్ది అసలు వచ్చిన చిక్కల్లా అంటే... గీతకు పన్నెండేండ్ల వయస్సప్పుడు 'లైలా మజ్నూ' సినిమా చూచింది. అప్పుడు మొదలయింది ఆమెలో ప్రేమాన్వేషణ ప్రేమకోసం ప్రాణాలివ్వగలవాణ్ణే తను ప్రేమిస్తానంటుంది స్నేహితురాళ్ళతో అలాంటి వాడే దొరికితే, అవసరం వచ్చినప్పుడు తనుగూడా ప్రాణాలిస్తానంటుంది ప్రేమఅంటే లైలా, మజ్నూలకేనని, మిగతా సినిమాల్లోదంతా అంతగొప్ప ప్రేమకాదనీ లెక్కవేసుంది కాని, పెళ్లియ్యేలోపుగా "దేవదాసు' విడుదల కాలేదు అదీ చూచివుంటే ఆమెలోని ప్రేమపిపాస ద్విగుణీకృతమయ్యేదే.

హైస్కూలు చదువు పూర్తిచేసి, కాలేజిలో ప్రవేశించిన తర్వాత కుమారి గీత యొక్క కార్యకలాపాలు చూచాయగా తెలిశాయి శ్రీపతికి ఒళ్ళంతా కంపరం బయల్దేరింది ప్రతిరోజూ, రోమను శిల్పాలు చిత్రించబడిన కార్డులూ, నీలంరంగు కవర్లలో వచ్చే ప్రేమలేఖలూ చూచి "తావుల్లో ఒక్క స్త్రీల కళాశాల వుంటే ఎంత బాగుండును" అనుకొని నిట్టూర్పు వదిలేవాడు. మనస్సు నాపుకోలేక ఆమెతో ఆ ప్రేమలేఖల విషయం కదిపితే "నేనేం యింకా చిన్నపిలను కాను. నా మంచి చెడ్డలు నాకు తెలుసు. ఇలాంటి ప్రేమలేఖలవల్ల నాకు వచ్చే అపాయమేమీ లేదు. పైగా నా కదో సరదా. ఈ వీధిలో యింకే అమ్మాయికీ యిన్ని జాబులురావు అది నాకెంతో గర్వకారణం ఇలాంటి వాటికి నీవు అడ్డుతగిలే నేనీ యింటోంచే వెళ్ళిపోతాను" అని ఏకధాటిగా గడగడ సినిమాలో లాగా చెప్పేసింది. శ్రీపతి, ముఖం ఆముదం తాగిన పర్యంతమయింది.

ఒకనాడు కాలేజిలో చెట్లచాటున నిలబడి రహస్యంగా కుమార్తెను గమనిస్తూన్న శ్రీపతిని కనిపెట్టేసింది గీత ఆరోజు రాత్రి యింట్లో విషయం లేకెత్తింది. తిరగబడింది. 'నువ్వు తండ్రివి కావు నేను బిడ్డను కాను. నీకంటే ఆ 'లైలా' నాన్నే నయం" అన్నది 'నాకూ ఆత్మగౌరవం వుంది. అసలు నేను ఎవరితోనైనా లేచిపోయినప్పుడు గాని నీకు



నిత్య శంకితుడు

బుద్ధిరాదు" అని ఘంకామీద దెబ్బ కొట్టకుండానే కొట్టినంత ఘాటుగా చెప్పింది. శ్రీపతి గడ గడ లాడాడు. భూమి తన చుట్టూ తాను తిరిగి, సూర్యుడి చుట్టూ చంద్రుడిచుట్టూ, శ్రీపతిచుట్టూ గూడా తిరుగు తున్నట్టుగా ఫీలయ్యాడు.

"నిజంగానే గీత ఎవడితోనైనా లేచి పోతే నలుగురూ నన్ను చూచి నవ్వుతారు. అనుగో ఆ శ్రీపతి కూతురే వాడితో లేచి పోయింది అని నన్ను వేలెటి చూపుతారు అప్పుడు సంఘంలో తలెత్తుకుని తిరిగేందుకు నాకు తిలంటూ ఒకటి వుండీ లేనివాణ్ణవుతాను. సురేష్ చనిపోయినా భరిస్తానుగాని, గీత లేచిపోవడం భరింపజాలను, భరియింపజాల, ముమ్మాటికీ భరింపజాలను" అని వాపోయాడు.

ఇప్పుడు గీత పెళ్ళయి, ఎన్నో మైళ్ళ దూరంలో భర్తతో కాపురం చేస్తున్నా గూడా శ్రీపతి యింకా పోతూనే వున్నాడు గీత తన్ను సంఘంలో తలెత్తనీయకుండా చేస్తుందేమోనని తన కళ్ళెదుట వుంటే ఆమె మనస్సును ఎవ్వరి మీదా మళ్ళనీకుండా, ఆమె పోకడలు, ఆమె విహారాలు అన్నీ గమనించి కాపలా కాస్తుండేవాడు, ఆమెను ఎవరితో లేచి పోనీకుండా చుట్టూ వలపన్ని కూర్చునేవాడు.

కాని యిప్పుడు శ్రీపతి అసహాయుడు. ఏంచేయగలడు? ఉత్తరాలు రాయడం తప్పితే ఆదర్శగృహిణి విధులూ - కర్తవ్యాలూ, ఆదర్శగృహిణికి సంఘంలోగల స్థానం, ఆమెకూ సంఘానికిగల సంబంధం, భారత నారియొక్క ముఖ్య లక్షణాలు— సీత, సావిత్రి అనసూయలాంటి పరమ పతివ్రతలను ఉదాహరణలిస్తూ వ్రాశాడు.

భోంచేసేప్పుడూ, భార్యతో మాట్లాడేప్పుడూ శ్రీపతి మనస్సు యింగండులో చదువుతున్న వేణుమీదికిపోయేది "ఏమేవ్ యింగ్లీషు కోడలిచేత కోడరికం చేయించుకునేందుకు సిద్ధంగావున్నావా?"అని శ్రీపతి అంటే భార్యకు అర్థంగాక అయోమయంగా చూచేది. "ఇంగ్లండు వెళ్ళినవాళ్ళు అంతా అంతేనే వచ్చేప్పుడు ఒక పిల్లను వెంటేసుకొస్తారు మనవాడుమాత్రం తీసుకురాకుండా వుంటాడేమిటే?" అని తమాషా కన్నట్టుగా అనేవాడు. కాని కంఠం బొంగురు పోయేది హృదయాన్ని ఎవరో అంపంతో కోస్తున్నట్టుండేది

నిజంగా వాడు దొరలపిల్లని పెండ్లాడితే కుటుంబగౌరవం ఏంకావాలి? చిన్నప్పుడు శ్రీపతి తల్లి చెప్పేది, "మీ నాన్న కుటుంబ గౌరవాన్ని నాశనం చేశాడు. నీవూ ఆయనలా కాకుండా కుటుంబ గౌరవం నిలబెట్టాలి నాన్నా". ఇప్పటి వరకు శ్రీపతి నిలబెట్టాడనే చెప్పాలి. తల్లి బ్రతికుంటే ఎంత సంతోషించేదో!! కాని తన చిన్నకొడుకువల్ల వంశగౌరవము నాశనమౌతుంది. ఇలంతా మూలకూడౌతుంది. వాడూ, ఆ దొరసానీ, ఇంట్లో కులుకుతూ ఉంటే తను చూస్తూ ఉండాలి అసలు వేణును ఇంగ్లండుకు పంపడంలోనే వుంది తన పొరపాటు జీవితాంతం ఈ కళంకంతో బ్రతకాలి. వాణ్ణి అక్కడికిపోకుండా నిలిపేటంత ధైర్యము ఆవిడుకొండలవాడు తనకివ్వలేదు ఆ సీమకోడలికి మామగార్నయేకంటే సన్యాసం పుచ్చుకుని ఇప్పుడేవెళ్ళి తిరుపతి కొండలమీద తపస్సు చేసుకోవచ్చు. వెధవ స్కాలర్‌షిప్ ఒద్దు అని మొర పెటుకున్నా ఆ ఆపదమొక్కుల వాడు కరుణిస్తేగా! కుటుంబగౌరవంతో పోల్చుకుంటే ఈ గవర్నమెంటు స్కాలర్‌షిప్ అనగా నెంత? శ్రీపతి చింతించి, చింతించి, చివరకు ఉత్తరం రాయడం మొదలెటాడు.

"అబ్బాయీ, దేశంగాని దేశంలో వున్నావు. అక్కడ మోసగాళ్లూ, మంత్రగాళ్లూ వుంటారని వినికిడి. దుష్టులకు దూరంగా ఉండు వాళ్లతో వీళ్లతో కలిసి డాన్సులకూ, పార్టీలకూ పోకు. ఒకసారి వంశగౌరవానికి మచ్చవస్తే, దాన్ని చెరిపేయడం మన తరంగాదు" ఇలా జాబులు రాయడం అలవాటయిపోయింది శ్రీపతికి

* * *

"ఎటూ సురేష్ చనిపోతాడు. గీత ఎవడితోనో లేచిపోతుంది. వేణు దొరలపిల నే పెండాడ్తాడు. వీటిల్లో దేన్నీ నేను ఆపలేను. జరిగేది తప్పక జరిగితీరుతుంది గౌరవముపోయేది ఖాయం తర్వాత గతేమిటి? చనిపోయిన మా అమ్మ ఆత్మకు శాంతి లభిస్తుందా?" ఈ ఆలోచనలు శ్రీపతి మెదడులో ఒకదాని వెంబడి ఒకటి పుట్టుకొస్తున్నాయి. మానసికంగా ఎంతో బాధపడుతున్నాడు. 'నవ్వు' అనేది శ్రీపతిలో ఏనాడో మాయమైంది. కలగాపులగంగా నెరుస్తున్న వెంట్రుకలు యిప్పుడు రంగుమారి తలకు తెల్లటి రంగును తెచ్చాయి.

ఆ పైన శ్రీపతి జబ్బుపడ్డాడు. డాక్టర్ని పిలవక తప్పలేదు. ఇంటి డాక్టరు పరీక్షించాక, ప్రత్యేక నిపుణులు కూడా వచ్చి చూచారు జబ్బు ఫలానా అని ఎవరూ తేల్చి చెప్పలేకపోయినా, శారీరకంగా శ్రీపతికుండే బలహీనత, మానసికంగా ఆయన పడుతున్న క్షోభ కలసి మనిషిని యిలా కృంగదీస్తున్నాయని డాక్టరు తేల్చి చెప్పారు. "మీ కేవిషయాన్ని గురించీ ఆలోచించవద్దు. దేన్ని గురించీ విచారించవద్దు" అని డాక్టర్లు చెబితే "సరే" అన్నాడు శ్రీపతి. కాని అలా వుండగలగడం శ్రీపతికి యీ జన్మలో సాధ్యం గాదు. క్రమంగా శ్రీపతి మంచంలోపడి యీ భయాలకీ, అనుమానాలకీ పూర్తిగా దాసుడయిపోయి 'దాసోహం' అన్నాడు.

కష్టాలన్నీ ఒక్కరికే ఒక్కసారిగా నేముంచుకొస్తాయి తగిలిన వేలుకే తగులుతుంది దెబ్బ శ్రీపతి తన బిడ్డల్ని గురించి యిన్నాళ్ళూ కనిన కలలు యీనాటికి నిజమయ్యాయి ముగ్గుర్ని గురించీ వార్తలు చేరాయి శ్రీపతి భయాలూ, అనుమానాలు అంతమయే కాలంవచ్చింది ఆ వార్తలు భర్తకు తెలియనిస్తే తనకు పసుపూ, కుంకుమా కరువవుతా యోమోనని భయపడింది శ్రీపతి భార్య కాని, ఆ వార్తను తెలుసుకొనేందుకు ఆయన ఎంతగా తపించి, కృశించి, నశించిపోతున్నాడో కళ్ళారా చూస్తూ ఆ యిల్లాలు యింకా దాచలేకపోయింది. "ఏమైతే అయిందికానీ"యన్ని నెమ్మదిగా భర్త మంచంవద్దకెళ్ళి ఒకటే గుక్కలో చెప్పేసింది.

"జరగవలసినవన్నీ జరిగిపోయాయి వేణు దొరల పిల్ల పెండ్లాడాడు. గీత కారు డ్రైవరుతో లేచిపోయింది సురేష్ చనిపోయాడు"

శ్రీపతి చీదరించుకున్నటు పెట్టాడు ముఖం. చిన్నప్పుడు వాళ్ళనాన్న త్రాగివచ్చి అమ్మను కొడుతుంటే నాన్ననుచూచి అలా చీదరించుకునేవాడు. ఇప్పుడు తన బిడ్డల్ని తలుచుకుంటుంటే తన నాన్న గూడా జ్ఞాపకమొచ్చాడు వీళ్ళంతా వంశాన్ని నెరిపేందుకే పుట్టారు ఆ పనవుతుండగానే ఎవరిదోవన వాళ్లు వెళ్లారు. మరుక్షణంలో శ్రీపతి నిద్రపోయాడు. ఒకటే నిద్ర. మర్నాడు మధ్యాహ్నం వరకూ లేవలేదు. ఇన్నాళ్లి తర్వాత శ్రీపతి సుఖంగా నిద్రపోవడం యిదే మొదటిసారి

"ఇక బ్రతకడు" అని నిశ్చయించుకున్న వాళ్ళకు ఆశ్చర్యం కలిగేట్టు శ్రీపతి బాగా ఆరోగ్యవంతుడయ్యాడు. వీధి వరండాలో జింక చర్మంమీద కూర్చుని రామాయణం పఠిస్తున్నాడు రోజూ. కాని శ్రీపతికి యీనాటికీ తెలియని విషయమేమంటే "మానవుడు ఏ విపత్తును తలచి బాధపడుతుంటాడో, ఆ విపత్తే అతన్ని బాధనుండి విముక్తి చేయగలదు" అన్న విషయాన్ని గ్రహించనేలేదు.

శ్లోకం చదువుతూ మధ్యలో ఆపి "ఏమేవ్" అని పిలిచాడు. "ఇక మనం జీవితాన్ని హాయిగా గడిపేయగలం ప్రతిబంధకాలంటూ ఏమీ లేవు. రేపే తిరుపతికి బయల్దేరివెళ్ళి, ఆ వెంకటేశ్వరునికి మొక్కుబడి చెల్లించాలి" అంటూ మూశాడు రామాయణం.

(ఆంగ్ల కథ ఆధారంగా)

వినాయక చవితి



స్యమంతకమణి; దానితోపాటు చేజిక్కిన బాలామణి

★ పురాణగాథ ★

నీలాపనిందల నివారణ

విఘ్నేశ్వర వ్రతం

★

వినాయక చవితి అంటే పిల్లలకు, పెద్దలకు కూడా ఎంతో సరదా. పిల్లలీ పండుగ కోసమని ఎంతో కాలం నించీ ఎదురు తెన్నులు చూస్తూంటారు. పచ్చతోరణాల పాలవెలి కట్టడంతో ప్రారంభమైన ఈ పండుగ రాత్రి పలేరుగాయలు చల్లేదాకా అలాగే సాగుతూంటుంది. పిల్లలీ వేళ తామగ పువ్వుల కోసము, కలువపువ్వుల కోసము గణపతి ప్రతిమ కోసము ఎంతైనా ఉబలాట పడతారు. అవన్నీ జాగ్రత్త చేసిన తరవాత ఎంతో భక్తిశ్రద్ధలతో పూజ చేసుకుంటారు. వినాయకుడు విద్యాధిదేవత. కనుకనే పిల్లలకీ పండుగ అంటే అంత సరదా.

పెద్దవాళ్ళు ముఖ్యంగా విఘ్న నివారణకనీ, ఇష్టకార్య సిద్ధికనీ సిద్ధివినాయక పూజ చేసుకుంటారు.

నీలాపనిందల నివారణం

నీలాపనిందలు పోగొట్టుకోడానికి కూడా వినాయకపూజ చేసి అక్షతలు తలమీద చల్లుకుంటారు. ఊరికే ఉత్త పుణ్యానికే ఒక్కొక్కప్పుడు నీలాపనిందలు, వాటివల్ల కోకొల్లలుగా అక్షింతలు మన తలలమీద పడుతూంటాయి. ఈలాంటి నీలాపనిందలు శ్రీకృష్ణునివంటి అవతారపురుషులకే తప్పనప్పుడిక అస్మదాదులమాట లెక్కేమిటి?

పూర్వం శ్రీకృష్ణుడు ద్వారకలో రాజ్యం చేస్తూ ఉండగా ఉగ్రసేనుడనే యాదవప్రముఖుడుండేవాడట! సత్రాజిత్తనీ ప్రసేనుడనీ అతని కిద్దరు కొడుకులు.

సత్రాజిత్తు సూర్యదేవుణ్ణి ఉపాసించి, స్యమంతకమనే అమూల్యమాణిక్యం సంపాదించుకొన్నాడు. అది చాలా విచిత్రమైన మణి. ప్రతిరోజూ గనతూకాని కనిమిది రెట్లెక్కువ తూకంగల బంగారం వర్షిస్తుంది. అదిగాక ఆ మణి ధరించినవారు సాక్షాత్తు ఆదిత్యదేవునిలాగే ప్రకాశిస్తారు.

ఒకనాడు సత్రాజిత్తు మణి ధరించి ద్వారకానగర రాజవీధులలో ఠీవిగా నడుస్తూంటే నగర పౌరులందరు అతడు సాక్షాత్తుగా సూర్యదేవుడేనని భ్రమించారట! ఒకరోజున సత్రాజిత్తుమణి ధరించి శ్రీకృష్ణుణ్ణికూడా సందర్శించాడు. శ్రీకృష్ణుడంతటివాడా మణి చూచి ఎంతో ఆశ్చర్యపోయాడు. శ్రీకృష్ణుని ఆశ్చర్య ధోరణి చూచి ఆ మణి కావాలని అడుగుతాడేమోనని సత్రాజిత్తెంతో భయపడ్డాడు. కాని శ్రీకృష్ణుడది కావాలని అడగలేదు.

అయినా ముందెప్పుడైనా అడగవచ్చునని సత్రాజిత్తు అనుమానించాడు. అందుచేత మణి తాను ధరించడం మానివేసి తమ్ముడు ప్రసేనుని కది ఇచ్చివేశాడు. అయినా శ్రీకృష్ణుడా మణి ఎప్పుడో అపహరించగలడనే భయం



సత్రాజిత్తు మనస్సులో అలాగే ఉండిపోయింది.

క్రమంగా కొంత కాలానికా భయమే నిజమై ఊరుకుంది. ఒకనాడు శ్రీకృష్ణుడు, ప్రసేనుడు కలిసి ద్వారకానగర సమీపారణ్యానికి వేటాడడానికి వెళ్లారు. వేటలో ఇద్దరిదీ చెరి ఒక దారీ అయింది. ఎంత వెదికినా శ్రీకృష్ణునికి ప్రసేనుడు కనిపించలేదు. ఇక చేసేదేమీ లేక అతడు ద్వారకా నగరానికి తిరిగి వచ్చివేశాడు

అటుపిమ్మట కొన్ని రోజులు గడిచిపోయాయి. అయినా ప్రసేనుడు తిరిగి రాలేదు. దానితో ద్వారకా నగరంలో అనేకమైన కింవదంతులు, నీలాపనిందలు బయలుదేరాయి కొందరు ప్రసేనుడడవిలో ఎక్కడో పులినోటపడి ఉంటాడని అన్నారు. మరి కొందరు శ్రీకృష్ణుడే స్యమంతకమణికోసం ప్రసేనుని సంహరించి వేశాడనీ ఏమీ ఎరగనట్టు కపటనాటకం ఆడుతున్నాడనీ అన్నారు. ఆ నీలాపనింద క్రమక్రమంగా ఎన్నో చిలవలు పలవలు వేసి ద్వారకానగరం అంతటా పాకింది. ద్వారకా నగరవాసులంతా శ్రీకృష్ణుడంతటి దారుణాని కొడిగట్టడం కేవలం అధర్మమని అనేక విధాలుగా ఆడిపొయ్యడం మొదలు పెట్టారు క్రమంగా ఆ నీలాపనిందలన్నీ శ్రీకృష్ణుని దాకా పాకాయి.

అవి విని శ్రీకృష్ణుడెంతో మథనపడ్డాడు ఏపాపము ఎరగని తనమీద అనవసరంగా అటువంటి నీలాపనింద విరుచుకు పడిందే అని చాలా చాలా కించపడ్డాడు. ఎల్లాగైనా ఆ నీలాపనింద పోగొట్టుకోవాలని సంకల్పించాడు.

శ్రీ కృష్ణుని ప్రయత్నం

మళ్ళీ అడవిలోకి వెళ్ళి ప్రసేనుడు వెళ్ళిన మార్గంలో అన్వేషణ ప్రారంభించాడు. వెతగ్గా వెతగ్గా అతని కొకచోట ప్రసేనుని శవం కనిపించింది. అక్కడి గుర్తులు పరిశీలించగా ఒక సింహం అతన్ని చంపివేసిందని తేలింది.

శ్రీకృష్ణుడు సింహం అడుగుజాడల్లో అడుగులు వేసుకొంటూ ఇంకా కొంచెం దూరం నడిచి వెళ్లాడు. కొంతదూరంలో అతని కొక చనిపోయిన సింహం కనిపించింది.

అక్కడి గుర్తులు పరిశీలించగా దాన్ని ఏదో పెద్ద ఎలుగుబంటి చంపివేసి ఉండవచ్చునని తోచింది. శ్రీకృష్ణుడు ఎలుగు అడుగుజాడలననుసరించి ఇంకా మరి కొంత దూరం దాకా సాగిపోయాడు.

అక్కడ అతనికొక పెద్ద గుహ ఎదురైంది. అది బహు విశాలమైన గుహ.

(30-వ పేజీ చూడండి)





వినాయక స్తుతి

విరిసెం గల్వలు, తమ్మిపూలు
మరి వేసేలప త్రికల్ బత్తి
పొంపిరిపోవం గొనివచ్చి
లేమోదకంబ్
బెక్కేవులకల్ మోముల్ గ్
జిరునవ్వుల్ దొంగాడ బాలకులు
కై సేయం సిరుల్ జిమ్మ దే
వర, కన్గొనం నెమ్మి జాలువిక
పొవంగాంచి మమ్మేలుతన్.

* * *

భూనాయకం వా ధన
నాయకం వా
భజన్ భువం వా ధన
మేతి లోకే
తద్విఘ్ననాథం న
భజామి కింతు
సహస్రనక్షత్రం ప్రణమామి
నిత్యం.



లేపాక్షి శిల్పం




'కుమార సంభవం'

బలిచక్రవర్తి సేనాధిపతి అయిన నముచి అనే అతనిని స్వజాతి సముద్ధరణ కోసం దేవేంద్రుడు సంహరించాడు. నముచికుమారుడు తారకాసురుడు దేవేంద్రుడిపై పగ సాధించి అమరావతి పట్టణాన్ని వశపరచుకున్నాడు. దేవేంద్రుడు పదవీచ్యుతుడైనాడు. దేవతలపై తారకాసురుడు ఆధిపత్యం చెలాయించడం ప్రారంభించాడు. ఆ రాక్షసుణ్ణి ఓడించే శక్తి సంపన్నులెవరూ దేవతలలో లేకపోయినందువల్ల వారందరూ బ్రహ్మవద్దకువెళ్లి మొరపెట్టుకున్నారు. హిమాలయ పర్వత శిఖరంపై తపస్సు చేసుకుంటున్న శివుడికి జన్మించే కుమారుడు గాని తారకాసురుణ్ణి ఓడించలేడని బ్రహ్మ వారికి సలహా ఇచ్చాడు. అంతట వారు శివుని వద్దకు మన్మథుణ్ణి పంపించారు. శివుని మూడోకంటి అగ్నిజ్వాలలకు మన్మథుడు భస్మమైనా, దేవతల మనోరథం మాత్రం ఈడేరింది. కుమారస్వామి జన్మించి దేవతల అభీష్టాన్ని నెరవేర్చాడు.

కుమారస్వామి జన్మవృత్తాంతానికి సంబంధించిన గాథను మన పురాణాలు ఈవిధంగా వర్ణిస్తున్నవి:

శివుడూ పార్వతీ ఏకాంతంగా వుండగా దేవేంద్రుడు ఆ విషయాన్ని గ్రహించి తనను మించిన ప్రతిభావంతుడైన పుత్రుడు పార్వతీ శివులకు ఎక్కడ ఉద్భవిస్తాడోనని భయపడి వారి క్రీడకు భంగం కలిగించడానికి అగ్నిని పంపించాడు. అగ్నిదేవుడు, పరమేశ్వరునికి ఎదురుగా వెళ్ళి నిలుచున్నాడు. అగ్నిని చూడగానే శివుడు పార్వతిని విడిచిపెట్టి, దూరంగా వెళ్ళిపోయాడు. ఆయన తేజస్సు భూమిమీద పడిపోయింది. కారణం గ్రహించలేక పార్వతి నాలుదిక్కులూ పరికించి చూసింది. అగ్ని కనిపించాడు. ఆమెకు పట్టరాని దుఃఖం, కోపం వచ్చి, భార్యాభర్తలు ఏకాంతంగా వున్నచోటుకు రాకూడదని తెలిసికూడా వచ్చిన అగ్నిని శపించింది. మాహేశ్వరుని తేజస్సు వృథాపోదు - దానిని నీవే భరించు అని అగ్నిని ఆజ్ఞాపించింది. అంతట అగ్ని గర్భం ధరించాడు. అయితే దాన్ని భరించే శక్తి అతడికి లేకపోయింది. చివరకు అగ్ని గంగాదేవిని చూసి, "గంగా! ఈ గర్భాన్ని నేను భరించలేకుండా వున్నాను నీవు ధరించు" అని ప్రాధేయపడ్డాడు.

గంగ సమ్మతించింది. కొంత కాలానికి దాన్ని భరించడం ఆమెకు కూడా కష్టమే అనిపించి, దాన్ని రెల్లుగడ్డిలో జారవిడిచింది. సూర్యరశ్మికి దానిలోనుంచి బాలుడు ఉద్భవించాడు. ఆ బాలుడే కుమారస్వామి. ఘోరయుద్ధంలో తారకాసురుణ్ణి ఆయన చేతిలో హతమార్చాడు.



★ విఘ్నేశ్వర వ్రతం ★

(27 వ-పేజీ తరువాయి)

దానిలో ఒక పెద్ద భవంతి. దానిలో ఒక బంగారు తూగుటుయ్యాల. ఆ ఉయ్యాలలో ఒక పసిపాప. పాపతలపై స్యమంతక మణి తళతళ మెరిసిపోతూంది

ఆ మణి చూడగానే కృష్ణునికి జరిగినదంతా ఒకక్షణంలో తెలిసిపోయింది. అది జాంబవంతునిదు పో అనీ లేకపోతే మరెవ్వరూ ఆసింహాన్ని అంత తేలికగా సంహరించలేరనీ అనుకున్నాడు.

అంతలో ఒక చక్కని చుక్క హఠాత్తుగా అతనిఎదుట నిలబడింది. ఆమె శ్రీకృష్ణుని దివ్యమంగళవిగ్రహం చూచి నోట మాటలేక అలాగే నిలబడిపోయింది.

వాసుదేవుడాలోగా స్యమంతకమణి సంగ్రహించవలెనని సంకల్పించాడు. అంతలో ఆచక్కనిచుక్క అతనికొక చిన్న సహాయిచ్చింది.

తనతండ్రి జాంబవంతుడు తిరిగిరాకుండా ఆమణి సంగ్రహించుకుపొమ్మంది లేకపోతే ఆయనవల్ల ఎంతైనా హాని రాగలదని భయపెట్టింది.

కాని శ్రీకృష్ణుడు దానికి జంకలేదు మణి చేతబుచ్చుకుని గట్టిగా సింహనాదంచేశాడు. ఆసింహనాదంవినీవినగానేజాంబవంతుడక్కడికి పరుగెత్తుకవచ్చాడు. వచ్చీరావడంతో వాసుదేవుని మాణిక్యచౌర్యం కనిపెట్టి వెంటనే అతనిమీద విరుచుకుపడాడు

తరవాత శ్రీకృష్ణ జాంబవంతులిద్దరికీ ఘోరయుద్ధం జరిగింది శ్రీకృష్ణుడు మహాబలశాలి జాంబవంతుడనేకమైన యుద్ధాలలో ఆరితేరినదిట్ట.

ఆయిద్దరియుద్ధం ఒకంతట తెగలేదు. అలాగ ఇరవైయొక్క రోజులపాటూ మహాయుద్ధం కొనసాగింది గుహవెలుపల వేచి ఉన్న శ్రీకృష్ణుని పరివారం వారంతా అతడాగుహలో ఏదో క్రూరమృగానికి బలిఅయిపోయాడని భ్రమించి వెంటనే ఇంటికి వెళ్లిపోయారు.

యుద్ధం ఎంతకాలానికీ ముగియలేదు. ఆలోగా జాంబవంతుడు శ్రీకృష్ణుడు కేవలం అవతారపురుషుడని అతనితో యుద్ధం చెయ్యడంవల్ల ప్రయోజనమేమీ లేదనీ గ్రహించివేశాడు

తన కుమార్తె జాంబవతినీ, స్యమంతకమణినీ కృష్ణునికి సమర్పించి తన తప్పిదకమన్నించవలసిందని వేడుకొన్నాడు.

పిమ్మట శ్రీకృష్ణునికీ జాంబవతికీ వివాహం జరిగింది. గోపాలుడు స్యమంతకమణి ద్వారకానగరవాసులందరికీ చూపించి జరిగిన కథఅంతా వారికి తెలియజేశాడు.

కాని అంతటితోనైనా అతని నీలాపనిందల పీడ విరగడైపోలేదు.

వాసుదేవుడా మాణిక్యం తిరిగీ సత్రాజిత్తుకు ఇచ్చివేశాడు. అయితే శతధన్వుడనే రాజు సత్రాజిత్తును చంపివేసి ఆ మణి చేజిక్కించుకొన్నాడు. కృష్ణుడది విని అతన్ని వెంబడించాడు. శతధన్వుడా మణి అక్రూరుడనే వానికిచ్చి ఎక్కడికో పారిపోయాడు.

దానితో ద్వారకానగరవాసులు తిరిగీ వాసుదేవునిపై నీలాపనిందలు వెయ్యడం మొదలు పెటారు. దానితో గోపాలదేవునికి ప్రాణం విసిగిపోయింది.

ఒకనాడు నారదుడతనిదగ్గరికి వచ్చాడు. అవిధంగా అన్యాయంగా తనపై నీలాపనిందలు పడడానికి కారణమేమని శ్రీకృష్ణుడతనిని ప్రశ్నించాడు

దానికి నారదుడీవిధంగా సమాధానం ఇచ్చాడు:

"శ్రీకృష్ణా! నీవు భాద్రపద శుద్ధ చవితి నాడు చంద్రుణ్ణి చూచావు అందువల్లనే నీమీద ఇలాంటి నీలాపనిందలు మోపుతున్నారు. వినాయక చతుర్థీ వ్రతం చేస్తే ఈ నిందలన్నీ తొలిగిపోగలవు"

అది విని శ్రీకృష్ణుడు చవితి చంద్రుని దర్శనంవల్ల అంతటి దోషం కలగడానికి కారణమేమని ప్రశ్నించాడు.

ఒకనాడు కడుపునిండా కుడుములు తిని వినాయకుడొక బక్క ఎలకమీద ఎక్కి వెళ్ళుతూండగా చవితి చంద్రుడతిణ్ణి చూచి పకపకా నవ్వాడనీ దానిపై వినాయకునికి కోపం వచ్చి అతని నావిధంగా శపించాడనీ నారదుడన్నాడు.

పిమ్మట కృష్ణుడు వినాయక వ్రతం చేశాడు ఆ వ్రతఫలితంవల్ల అతనికి వచ్చిన నీలాపనిందలన్నీ తొలగిపోయాయి

ఆనాటినించీ నీలాపనిందలుమీద అనవసరంగా పడతాయేమోననే భయంతో కూడా కొందరు వినాయక వ్రతం చేస్తూంటారు.

స్యమంతకమణి కథ విని అక్షతలు నెత్తిమీద వేసుకుంటారు

సమస్త శుభకార్యప్రారంభాలలోను ముమ్మందుగా వినాయకపూజ చెయ్యడంమనకొక సంప్రదాయంగా ఏర్పడింది అదీగాక భాద్రపద శుద్ధ చవితినాడు ప్రత్యేకంగా విఘ్నేశ్వరపూజ జరగగలదన్న విషయం అందరికీ తెలిసిందే. ★

దేవర్షుల సదస్సు: శనిదృష్టి

పార్వతి పరితాపం; వాంఛాసిద్ధి

★ పౌరాణిక కథ ★

గజాననగాథ

గరిక మేసిన గాడిద చచ్చిందిగాని, గరిక మాత్రం చావలేదని సామెత. గడ్డ నంటి పెట్టుకొని గరిక అలాగే నిలిచిపోతుంది. అది సహజం. మనదేశంలో హిందూమతం స్థితి కూడా అలాంటిదే.

రాజ్యాలు తారుమారైనా, రాజరికాలు తలక్రిందులైనా, యుద్ధసంక్షోభాలు చెలరేగినా, తిరుగా అన్యమత దండయాత్రలు సంభవించినా పుణ్యభూమి అయిన భారతదేశంలో రకరకాల పెనుతుపానులకూ తట్టుకొని హిందూమతం చిరస్థాయిగా నిలువ గలిగింది; నిలుస్తుంది, మతరక్షణలో హిందువులు ప్రతి ఏడాదీ పాటించే పండుగలు, పర్వాలు ప్రముఖ పాత్ర వహిస్తున్న వనడంలో సందేహం లేదు. పిల్లలు పెద్దలు కూడా సమధికోత్సాహంతో ప్రతి భాద్రపద శుద్ధ చతుర్థినాడూ జరుపుకునే వినాయక చవితి కూడా మన పండుగులలో అత్యంత ప్రధానమైన స్థానాన్ని ఆక్రమిస్తున్నది. దుర్ముఖ భాద్రపద శుద్ధ చవితినాడు (సెప్టెంబరు 8) వినాయక వ్రతాన్ని ఆచరిస్తూ విఘ్నేశ్వరుడి కథ చెప్పుకోవడం పరిపాటి. ఏమిటా కథ?

పార్వతీదేవివాంఛ

పార్వతీదేవికి మాతృత్వవాంఛ కలిగింది. కుమారస్వామి, పరమేశ్వరుడి కుమారుడే అయినాడు కాని తన గర్భవాసమందు జన్మించిన తనయుడు కాలేకపోయినాడు. స్త్రీ జీవితాదర్శం మాతృత్వాన్ని సాధించుకోవడమే కాబట్టి పార్వతీదేవి అమితంగా వాంఛించడంలో ఆశ్చర్యం లేదు ఆమె హృదయం తీరని ఆవేదనతో నిండిపోయింది. తనకు కావలసిన బిడ్డనుగూర్చి ఎన్నెన్నో ఆశలు పెట్టుకుంటున్నది; కలలు కంటున్నది. నిరంతరం విచారంతో వుంటున్న పార్వతీదేవిని పరమశివుడు చూడలేకపోయినాడు. విచారిస్తూ కూర్చుంటే, లాభమేమిటి? ఏమి కావాలో చెప్పమన్నాడు. పార్వతి తన కోరికను చెప్పివేసింది. ఆమె కోరిక అంతర్యం పరమశివుణ్ణి కర్తవ్యోన్ముఖుణ్ణి చేసింది. యోగ్యుడైన పుత్రుడు కావాలంటే నియమబద్ధమైన జీవితాన్ని గడుపుతూ, "పుణ్యక వ్రతం" ఆచరించాలని సలహా ఇచ్చాడు. ఈ వ్రతం చేసే స్వాయంభువమనువు భార్య "శతరూప" ఉత్తమ ఉత్తానపాదులను కన్నదనీ, కశ్యప ప్రజాపతి భార్య అదితికి వామనుడు కలిగాడనీ, దేవహూతి కపిలుణ్ణి కన్నదనీ శివుడు బోధించాడు.

పుణ్యకవ్రతం

బ్రహ్మమానస పుత్రులలో ఒకడైన సనత్కుమారుని పౌరోహిత్యాన పార్వతీ పరమేశ్వరులు వ్రతాచరణను ఉపక్రమించారు. దేవర్షులు, మహర్షులు, బ్రహ్మ, విష్ణువు, ప్రజాపతులు, దేవతలు, లోకపాలకులు అందరూ వేంచేశారు. పురోహితుడికి పార్వతి పెనిమిటిని దానమిచ్చి, తిరిగి పుచ్చుకున్నది. అనంతరం సదస్యులందరూ రాధారమణుని స్తుతించారు. అతిలోక సుందరుడు, నవమోహనాకారుడు అయిన శ్రీకృష్ణుడు ప్రత్యక్షమైనాడు. సదస్యులు చేతులు జోడించి నమస్కరించారు. పార్వతీపరమేశ్వరులు పరమానందంతో స్తుతించారు. వరం కోరుకొమ్మని కృష్ణుడు పార్వతిని ఆదేశించాడు. చతుర్దశభువన మోహనాంగుడైన నీవంటి కుమారుణ్ణి ప్రసాదించమని పార్వతి అర్థించి సిగ్గుతో తల



వంచుకున్నది. "ఉమా! నీవు శక్త్యంశ సంభూతురాలవు. నేను యోగమాయావృతుడను నీ కోరిక ప్రకారం నేను నీ పుత్రుడుగా జన్మిస్తాను," అని కృష్ణుడు బదులు చెప్పి అంతర్ధానమైనాడు. పార్వతి మృదుల హృదయంలో శరత్ చంద్రికలు వెల్లి విరిసినవి. పర్వత పుత్రి ఆనందంలో పరమశివుడు తన భాగం పంచుకున్నాడు.

ఒక శుభసమయాన గిరిజాగౌరీశుల ఆనంద ఫలితంగా పుత్రోదయమైంది. సర్వ శుభ లక్షణ లక్షితుడు, త్రిలోక మోహనుడూ, ఆనంద సంధాయకుడూ అయిన కుమారుణ్ణి చూసుకుని పార్వతి మురిసిపోయింది. పరమశివుడు కూడా పరమానంద భరితుడైనాడు. పార్వతికి పుత్రుడు కలిగిన వర్తమానం విని అందరూ ఆనందించారు. పసిపాపను చూసి, ముద్దాడి వద్దామనే ఉద్దేశంతో చిన్న పెద్ద ముత్తయిదువులు, పార్వతీ

★ గజానన గాథ ★

పరమేశ్వరులను అభినందించి పసిపాపణ్ని ఆశీర్వదిద్దామనే ఉద్దేశంతో దేవతలు అందరూ వారివద్దకు వచ్చారు.

శనికి శాపం!

పన్నీటిజలకంతో తానూ, బిడ్డడూ అభ్యంగనం పూర్తిచేసుకుని వచ్చి పార్వతి పతి చెంతనే సగర్వంగా కూచున్నది. అందరి దృష్టీ పార్వతి ఒడిలో చిరునవ్వులు చిందిస్తున్న పసిబిడ్డమీదే పడినది ఒక్కరొక్కరే పార్వతీ పరమేశ్వరులను అభినందించి బిడ్డణ్ణి ఆశీర్వదించుతున్నారు. పార్వతి హృదయం ఆనందడోలికలలో ఊగింది. పార్వతి సాభిప్రాయంగా భర్తవంక ఒకసారి క్రీగంట చూసి తలవంచుకున్నది. తన పసిపాపణ్ణి అందరూ ఆశీర్వదించారుగాని, అక్కడే కొద్దిదూరంలో కూచునివున్న శనిమాత్రం ఆశీర్వదించలేదు! శని ఒక్కడూ ఆవిధంగా తన పాపాయిని చూడకుండా వెళ్ళడం పార్వతికి అసంతృప్తికరంగా తోచింది. "సూర్యనందనా! ఇంతమంది నా బిడ్డను చూసి ఆనందిస్తూవుంటే, నీవు ఒక్కడివే ఎందుకు ఏకాంతంగా కూచున్నావే? ఏమిటి ఆలోచిస్తున్నావ్?" అని పార్వతి శనిని ప్రశ్నించింది

"నా దురదృష్టం అలాంటిది తల్లీ!" నా దృష్టిపడిన వస్తువేదీ దాని సహజరూపంలో వుండదు. నేను భౌతిక వాంఛలన్నిటినీ వదలివేసి కృష్ణధ్యానంలో వున్న సమయంలో నా భార్య నన్ను కేళీవిలాసానికి పురిగొల్పింది. విలాస విహారంమీదికి నా దృష్టిని మరలించలేకపోయినాను. ఆమెను కన్నెత్తి అయినా చూడలేకపోయినాను. అంతలో ఆమెకు అపారమైన ఆగ్రహం గలిగింది. ఆ ఆవేశంతోనే, లోకమోహనగాత్రినైన నన్ను కన్నెత్తి చూడలేని నీవు ఎవరిని చూసినప్పటికీ వాళ్లు నాశనమైపోతారని శపించింది. అప్పటినుంచి నేను ఇతరులనెవరినీ చూడటంలేదు. కాబట్టి క్షమించు తల్లీ" అన్నాడు శని.

"నా బిడ్డడికి అలాంటి ప్రమాదమేదీ రాదు ఫరవాలేదు చూడు," అంది పార్వతి

తల ఎగిరిపోయింది

శని తలఎత్తకుండానే క్రీగంట పార్వతి తనయుణ్ణి చూసి వెంటనే తలవంచుకున్నాడు. అంతే!! శని దృష్టి ప్రసారం జరిగిన క్షణంలోనే, పార్వతీ తనయుడి శిరస్సు ఎగిరిపోయింది!! ఆమె శరీరం రక్తసిక్తమైంది పార్వతీ పరమేశ్వరులు మూర్ఛిల్లారు; సదస్యులు గాఢవిచారంలో పడిపోయారు! మహావిష్ణువు గరుడవాహనారూఢుడై తక్షణమే ఉత్తరదిశగాపోయి భద్రానదీతీరంలో ఒక గజరాజు శిర్సాన్ని ఖండించి తెచ్చాడు. తిరిగివచ్చినవెంటనే, పార్వతి ఒడిలోని మొండానికి తను తెచ్చిన గజశిరాన్ని తగిలించి ప్రాణప్రతిష్ఠ చేశాడు అదిమొదలు పార్వతీ తనయుణ్ణి గజాననుడుగా పరిగణించడం సంప్రదాయమైంది.

ఏదోవిధంగా తన కుమారుడు తనకు దక్కినందుకు పార్వతి సంతోషించింది; కాని, శనిని చూసింది శని కంటికీ మంటికీ ఏకధారగా దుఃఖిస్తున్నాడు తనకు జరిగిన అన్యాయానికి శనికి ప్రతీకారం చేయాలని పార్వతి తలపెట్టింది; కోపం పట్టలేక, "నా కుమారుడి శిరస్సును హరించిన నీ శిరస్సు కూడా పోవుగాక!" అని శపించింది.

నిరపరాధి అయిన శనిని పార్వతి ఈవిధంగా శపించినందుకు, సదస్యులు సహించలేకపోయినారు.

బ్రహ్మదేవుడి జోక్యం

శని సోదరుడు యముడు, తండ్రి సూర్యుడు, మాతామహుడు కశ్యపప్రజాపతి పార్వతి శాపవచనాలు విని ఉగ్రులైనారు. వయోవృద్ధుడైన కశ్యపుడు కోపాగ్ని అణచుకుని, "నిరపరాధిని ఈవిధంగా పార్వతి శపిస్తూవుంటే ధర్మవేత్తలందరూ చూస్తూ వూరుకోవడం భావ్యంకాదు" అని వాదించాడు; ధర్మద్రోహమన్నాడు. కశ్యపుని మాటలు పూర్తికాక పూర్వమే సూర్యుడు లేచి, "నా కుమారుడి తలను బలికోరిన పార్వతీదేవి కూడా తన కుమారుణ్ణి కూడా కోల్పోవుగాక," అని ఎదురుశాపం పెట్టాడు ఇంకేముంది కోపజ్వాలలు మిన్నుముట్టబోతున్నవి బ్రహ్మదేవుడు పరిస్థితులు విషమిస్తున్నవని గ్రహించి సూర్యుడి శాపం అధర్మమన్నాడు. ప్రతి స్త్రీకీ తన కుమారుడిమీద అనురాగం. మమకారం వుంటవనే విషయాన్ని వివేకవంతులు, సాధుపుంగవులు అయిన సభాసదులు గ్రహించలేకపోవడం శోచనీయమని విమర్శించాడు. ఉభయులూ బాగా ఆలోచించుకొని తమతమ శాపాలను ఉపసంహరించుకోవాలని కోరాడు. పార్వతి సూర్యుడు బ్రహ్మమాటవిని తమ శాపాలను ఉపసంహరించుకున్నారు. పార్వతి తన ఆగ్రహానికి పశ్చాత్తాపపడి "నా వరప్రభావంచేత నిన్ను నేటినుంచీ నవగ్రహాధిపతిగా ప్రజలు ఆరాధిస్తారు," అని శనిని ఆశీర్వదించింది. అందరూ హర్షించారు.

—'గణాధిపతి'నుంచి.

"ఏకదంతం"

జమదగ్ని కుమారుడైన పరశురాముడు రాజులందరినీ చంపిన మహాపాపానికి ప్రాయశ్చిత్తం చేసుకుందామని పరమశివుడి వద్దకు వచ్చాడు. శివుడు, పార్వతి ఏకాంతంగా వున్నారు గణపతి గుమ్మంవద్ద వున్నాడు "పూజ్యులు ఏకాంతంగా వున్నారు. పరమశివుడి దర్శించడానికి ఇది సమయంకాదు. కొంచెంసేపు ఆగాలి" అన్నాడు గణపతి పరశురాముడితో.

"నేను మహా మారణహోమం చేసి వచ్చాను మచ్చుకైనా రాచపురుగులేకుండా చేశాను ఈ హత్యాకాండను నేనిప్పుడు హృదయమూ వేదన పడుతున్నాను. పరమేశ్వరుణ్ణి దర్శిస్తేనేగాని ఈ ఆవేదన చల్లారదు. "నన్ను ఇప్పుడు ఆటంకపరిచి ఆగ్రహం కలిగించవద్దు," అన్నాడు పరశురాముడు, వినాయకుడితో.

"పరశురామా—నీకోరిక విధివిరుద్ధం. మహాపాపకార్యం. ఆలోచించుకో," అన్నాడు గణపతి

"నీవు చెప్పే ధర్మసూత్రాలన్నీ సామాన్యులకు గాని మనలాంటి వాళ్ళకు కాదు. నిర్వికార శిసు సదృశులమైన మనలను ఏపాపమూ అంటదు; నన్ను లోపలికి పోనివ్వు," అని పోబోయాడు పరశురాముడు.

"వెళ్లడానికి వీల్లేదు—ఆగు" అన్నాడు గణపతి.

పరశురాముడికి కోపం ఎక్కువై పరశువును పైకి ఎత్తాడు.

"వెళ్లదలచుకుంటే, నామీదగా వెళ్లు" అని గణపతి సత్యాగ్రహం చేశాడు పరశువును పరశురాముడు విసరబోతూండగా ప్రక్కనే వున్న కుమారస్వామి వీరభద్రుడు ఆయన్ను వారించారు అయినా పరశువు ఆగలేదు. గజాననుడు దానికి తన దంతాలలో ఒకదాన్ని ఆహుతి ఇచ్చాడు; ఒక దంతం విరిగిపోయింది. అప్పటినుంచీ విఘ్నేశ్వరుడికి ఒకేఒకదంతం. అందుకే ఆయనను ఏకదంతుడని ఆరాధిస్తాము.

★



సాహిణీవారి "పెంకిపిల్లాం" చిత్రంలో రాజసులోచన, ఆమె నేస్తాలు.

సమతావారి "అమరజీవి"

ఆంధ్రలో నాలుగోవారం విజయవంతంగా నడుస్తున్న సమతా పిక్చర్స్‌వారి "అమరజీవి" చిత్రాన్ని ఆగస్టు 29న రేవతీ స్టుడియోలో పత్రికా ప్రతినిధులకు చూపించారు. శ్రీ తాతినేని ప్రకాశరావు దర్శకత్వాన తయారైన ఈ చిత్రంలో సావిత్రి, పద్మిని, శివాజీ గణేశన్, నాగయ్య, తంగవేల్, నంబియార్ మొదలగువారు పాల్గొన్నారు కథ శ్రీ శ్రీధర్, మాటలూ పాటలూ శ్రీ శ్రీ వ్రాశారు సంగీత దర్శకుడు శ్రీ టి. చలపతిరావు ఛాయాగ్రహణం శ్రీ కమల్ ఘోష్ నిర్మాత శ్రీ పి వి వి సత్యనారాయణమూర్తి

నిరుద్యోగం, ప్రణయకలాపం జమిలిగా నిర్వహిస్తూ ఉద్యోగం దొరికేలోగా హఠాత్తుగా మతి పోగొట్టుకొన్న యువకుడి కథ తిరిగి స్మృతి కలిగేసరికి ప్రేమించిన అమ్మాయిలిద్దరిలో ఒకామె ప్రాణార్పణచేసి "అమరజీవి" కావడం, కావలసినఅమ్మాయి అతణ్ణి పెళ్ళి చేసుకోవడం, కథ దారిన పడి కంచికి బయలుదేరడం జరుగుతుంది ఈలోగా తంగవేలు చేసే హంగులతో పద్మిని నృత్యాలతో, శ్రుతిపేయమైన సంగీతంతో చక్కని కాలక్షేపం ఈ తరహా చిత్రాలకు కావలసిన హంగులన్నీ ఉన్న ఈకథను దర్శకుడు శ్రీ తాతినేని, ప్రతిభావంతంగా తెరమీదచిత్రించారు శ్రీ శ్రీ గారి రచనకూడా కథను మరింతసజీవంగా నడిపింది చిత్రంలో పాటలన్నీ బాగున్నాయి ఈ చిత్రంలో ఒక విశేషం హీరోహీరోయిన్‌లకు అడుగడుగునా పాటలు పెట్టకపోవడం మొదటి డ్యూయెట్ చిత్రించినప్పుడు మాత్రం, నాయకీ నాయకులు కొలనుకెలను పరుగులెత్తడం, చెక్కవంతెన మీద ఎక్కి దిగడం, చందమామవంక చూసి నవ్వడం, శ్రీ తాతినేనివంటి నవదర్శకులనుండి కొత్తదనాన్ని ఆశించేవారికి కొంత నిరాశ కలిగిస్తాయి

నటీనటులంతా, యథోచితంగా నటించారు ఇందులో నాయకుడు జ్ఞాపకశక్తి కోల్పోయి తరువాత చీటికీ మాటికీ "నేనెవర్ని? నా పేరేమిటట?" అంటూ ఉంటాడు. నా అన్నవారుగాని, ఆస్తిపాసులూ ఉద్యోగం సద్యోగం లేని ఈ ఆసామి, మతిమరపు దాపరించిన ఆ స్థితిలో పనీ పాటా లేకుండా తిరుగుతున్నా, సిల్కు లాల్చీ పైజామాలు, గాబర్డిన్ లాగులూ, జెర్కినులు, జిప్ బనీనులు వేసుకొని, భారత ప్రేక్షక మహాశయులకు ఫాషన్ పాఠాలు నేర్పేభారం వహించడం ఎలా సాధ్యమన్నమాట గరూహ్యం

"నేనెవర్ని, నా పేరేమిటి" అంటూ తిరుగుతున్న కథానాయకుడు అదే ఊపులో "నాకీ జెర్కిన్ లెక్కడివి? ఈ సిల్కు బట్టలెలావచ్చాయి?" అని కూడా ప్రశ్నలు వస్తాడని ఆశించబడింది గాని అది జ్ఞాపకశక్తి కోల్పోయినవ్యక్తి ధ్యానిక అన్న విషయం చటుక్కున స్ఫురించింది.

★

రామదాసు చిత్రంలో రఫీ పాటలు

వి. ఎన్. ఫిలింస్ పేరిట శ్రీ నాగయ్య నిర్మిస్తున్న "భక్త రామదాస్" చిత్రంలో బొంబాయి ఫిలిం గాయకుడు మహమ్మద్ రఫీ కంఠం వినబడబోతున్నది. ఇందులో కబీర్ పాత్రకు రఫీ ప్లేబాక్ పాడుతున్నారు. ఆగస్టు 28న రఫీ, రెండు హిందీ పాటలను వాహినీ స్టుడియోలో రికార్డు చేశారు. ఈ పాటలు శ్రీ అసర్ మజీద్ వ్రాశారు. శ్రీ అశ్వత్థామ వీటికి సంగీతం కూర్చారు. శ్రీ నాగయ్య పర్యవేక్షణ చేశారు.

సెప్టెంబరు నెలాఖరులోగా మహమ్మద్ రఫీ పాటలు మరో ఐదు రికార్డు చేయించడానికి సంకల్పించారు.

ఇవన్నీ కబీరు పాత్రకు ఉద్దేశించినవే. పోతే, ఇందులో కబీరు పాడే తెలుగు పద్యాలను శ్రీ మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడారు. (శ్రీ జంధ్యాల గౌరీనాథ శాస్త్రి కబీరు భూమికను నిర్వహిస్తున్నారు.)

ఈ చిత్ర నిర్మాణంలో రెండు సెట్స్ పై పని పూర్తి అయింది. నేడో రేపో మూడవ సెట్ పై పని ప్రారంభం కాబోతోంది.


"రామదాసు" చిత్రంలో నాగయ్య, కన్నాంబ, లింగమూర్తి, రామశర్మ, గౌరీనాథ శాస్త్రి, వి. ఎస్. ఆర్., డా॥ శివరామకృష్ణయ్య, కుటుంబరావు, పేకేటి, రమణారెడ్డి, రామన్న పంతులు, ఋష్యేంద్రమణి, సూర్యకుమారి, కుసుమకుమారి, రత్న పాప మొదలగువారు పాల్గొంటున్నారు.

నాగయ్యగారు ఈ చిత్రంలో తొలిసారిగా వెండితెరకు ఇద్దరు రాజకీయవాదులను పరిచయం చేస్తున్నారు. వారిలో ఒకరు ఆంధ్ర శాసనసభకు ఉపసభాపతిగా పని చేసిన శ్రీ పసల సూర్యచంద్రరావు, మరొకరు శాసనసభ్యులు శ్రీ శీర్ల బ్రహ్మయ్య (ఏలూరు). రచన శ్రీ యడవల్లి లక్ష్మీనారాయణ, పర్యవేక్షణ శ్రీ సముద్రాల రఘువాచార్య. కెమేరా కె. ఎస్. ప్రసాద్. పర్యవేక్షణ ఎం. ఎ. రహమాన్. కళ శ్రీ అమ్మయప్పన్. సంగీతం శ్రీ ఓగిరాల, శ్రీ నాగయ్య.

ఈ చిత్రం ఉగాది నాటికి విడుదల చేయాలని దర్శకుడు శ్రీ నాగయ్య గారి సంకల్పం. ★

'మిస్ మేరీ'లో జమున

ఎ. వి. ఎం. వారి కొత్త హిందీ చిత్రం "మిస్ మేరీ"లో జమునను బుక్ చేశారు. మిస్సమ్మలో ఆమె నిర్వహించిన భూమికనే ఇందులో కూడా ఆమెకు ఇచ్చినట్లు ఎ. వి. ఎం. అధిపతి శ్రీ మెయ్యప్పన్ తెలియచేశారు. ఇందులో నాయిక మీనాకుమారి. నాయకుడి భూమికను జెమినీ ఆర్. గణేశన్‌కు ఇచ్చారు. గణేశన్ మిస్సమ్మ తమిళ వర్షన్‌లో నాయకుడుగా నటించడం విదితమే. ఇప్పటిది అతడికి రెండవ హిందీ చిత్రం. (మొదటిది నారాయణన్ కంపెనీ వారి దేవత) జమునకు కూడా ఇది రెండవ చిత్రమే. జూపిటర్ వారి 'నయాఆద్మీ'లో జమునకు ఉత్తరాదిన మంచి పేరు వచ్చింది. మిస్సమ్మలో రేలంగి భూమికను ఇప్పుడు హిందీ చిత్రంలో డేవిడ్, నాగేశ్వరరావు భూమికను కిశోర్ కుమార్ నిర్వహిస్తున్నారు. 'మిస్ మేరీ' (పేరింకా ఖరారు కాలేదు) ఎ. వి. ఎం. స్టుడియోలో శ్రీ ఎల్. వి. ప్రసాద్ గారి దర్శకత్వాన చురుకుగా తయారవుతోంది. నవంబరు నాటికి పూర్తి కావచ్చును. ★



మహమ్మద్ రఫీతో శ్రీ నాగయ్య.

చలనచిత్ర కథ :

ఆల్ దట్ హెవెన్ ఎలౌస్

భర్త మరణించిన తరవాత ఎన్నడూ గుమ్మందాటి ఎరగని మిసెస్ కారీ, పట్టుమని పాతికేళ్ళైనా లేని కర్బీ అనే కుర్రాడితో షికార్లు చెలాయిస్తోందన్న పుకారుతో ఊరు గుప్పుమంది. ఊళ్లో జానీలూ, జేనీలూ నవ్వుకున్నారు అమ్మలక్కలంతా పట్టరాని ఉత్సాహంలో కాలు నిలవకుండా తిరుగుతున్నారు. పెద్దమనుషులంతా, పండిన మీసాలను గంభీరంగా దువ్వుకుంటూ, "నేను అనుకుంటూనే వున్నా" అనిఅంటూ, అనుకుంటూ, తల తాటిస్తున్నారు.

"చెట్టంత పిల్లలిద్దరు ఎట్టఎదుట తిరుగుతూ ఉంటే, మారుమనువు కిలా సిద్ధపడిందో" అని గింజుకున్నారు కొందరు

మిసెస్ కారీకి పదెనిమిదేళ్ల కూతురూ, ఇంకో ఏడాది పెనున్న కొడుకూ ఉన్నారు. వాళ్ళిద్దరూ బస్తీలో చదువుకుంటూ, సెలవులకి వస్తూపోతూ ఉంటారు. ఆవిడ ఒక్కతే ఈ పల్లెలో ఇల్లు కనిపెట్టుకుని ఉండేది.

"క్లబ్బుకి రావమ్మా నలుగురూ ఉంటా రంటూ శతవిధాల బ్రతిమిలాడినా గుమ్మం కదిలేది కాదు ఏమిటో అనుకున్నా ఇంతటి దనుకోలేదు" అన్నాయి ఊళ్లో కాకులు.

మిస్ కారీ ఎంతటిదీ కాదు ఒకసారి బలవంతాన క్లబ్‌కి వెళ్ళింది. అక్కడి 'పెద్ద మనుషుల' ప్రవర్తన, చొరవ, ఆమెకు రోత కలిగించాయి అక్కడితో ఇల్లు కదలటం మానుకుంది.

"వాడిబాబు మాయింట తోటపని చేశాడు గాదూ" అన్నదొక భాగ్యగృహిణి నిరసనగా.

కారీకి, కర్బీ తోటమాలికొడుకుగా తోటమాలిగా కనబడలేదు. తిన్నావా బ్రతుకున్నావా అన్నవాళ్లు లేక, అలనా పాలనా లేక, దిక్కు చచ్చిపోయినట్లు ఒక్కరితేగా దిగులుకొని దిగులుపడుతూ ఉన్న కారీకి, తన ఇంటి తోటలో మొక్కలు బాగుచేయ వచ్చిన కర్బీ, మంచివాడుగా కనబడ్డాడు. ఆత్మీయుడుగా కనబడాడు.

"ఆవిడ ఆ సిమీద వాడు కన్నేశాడు. లేకపోతే పాతికేళ్ళవాడికి నలభై దగర పడుతున్న దానిమీద మోజేమిటి?" అని తేల్చి పారేశారు ఊళ్లో అనుభవజ్ఞులు.

మిసెస్ కారీకి ఆసి ఉన్నమాట నిజమే కాని ఆమెకు మనసిచ్చి పుచ్చుకున్న కర్బీకి అటువంటి ఆశ లవలేశం లేదు.

"మనం పెళ్ళి చేసుకుందాం. నా యింటోనే ఉందాం" అని మనసారా చెప్పాడు. ఆ మేరకు, పాడుపడి, భీభత్సంగా ఉన్న పాత ఇంటిని, ఎంతో కష్టపడి అందంగా, అద్భుతంగా తయారుచేశాడు.

అయితే పెళ్లిమాట వినగానే కారీ త్రుళ్లిపడింది. "పిల్లలో?" అంది. "లోకులో" అంది.

"మరేం ఫరవాలేదు. నీ క్కావలసింది నువ్వు సాధించాలంటే భయపడకూడదు. అందరికీ చెప్పావచ్చు. అందులో తప్పేం లేదు" అన్నాడు కర్బీ.

తప్పేమీ లేకపోయినా, కొండంత సమస్యలు ఎదురయ్యాయి. "అల్ట్రామాడర్న్" కోవకు చెందిన కూతురు, అందరినీ "ఎనలైజ్" చేసి, సెక్స్ సిద్ధాంతాలమీద గంభీరోపన్యాసాలిచ్చినట్టే, అమ్మ మనసు కూడా పరిశీలించి, అమ్మకి నిజంగా కావలసిన గేమిటో విమర్శి చెప్పబోయింది. ఆమె లెక్కప్రకారం ఈ పెళ్లి అనవసరం; అసంగతం.

కుమారుడికి కుటుంబ గౌరవంగురించి గొప్ప అభిప్రాయాలు చాలా ఉన్నాయి. ఈ ఇలు కుటుంబ ప్రతిష్ఠకు చిహ్నం అన్నాడు. ఇది వదిలిపోవటం ఘోరమన్నాడు. మొత్తానికి తల్లిమీద దయతలచి, పిల్లలిద్దరూ, కర్బీకి ఇంటర్వ్యూ ఒకటి ఇచ్చారు, సాధ్యమైతే సాయంచేదామని

కాని సాధ్యంకాలేదు. వాళ్ళిద్దరికీ కర్బీ నచ్చలేదు. కేవలం తోటమాలి. డబ్బు లేదు...

"నువ్వు అతన్ని పెళ్ళిచేసుకోవడానికి వీల్లేదు" అన్నారు పిల్లలు.

"చేసుకుంటే నేను మళ్ళీ ఈ గడప తొక్కను" అని ఖరారుగా చెప్పి బస్తీ కెళ్ళాడు కుమారుడు.

"నాన్న బ్రతికిఉండగానే, నువ్వూ. కర్బీ తిరిగారంటున్నారు ఊళ్ళోఅంతా" అంటూ ఘోరమైన పుకారు మోసుకొచ్చిన కూతురు ఏడుస్తూ కుప్పకూలిపోయింది. "ఇంక నాకు పెళ్ళి కాదమ్మా" అంది.

*   *   *

కారి చేతనైనంత ఆలోచించింది. పెళ్ళి వాయిదా వెయ్యమని ప్రియుణ్ణి కోరింది. అది కుదరదన్నాడు కె. సరే పెళ్లి కుదరదనేసింది కారీ.

క్రిస్మస్ తిరిగి వచ్చేసరికి కథ మారింది. అనుంగు కుమార్తె ఎవరో అబ్బాయిని ప్రేమించి పెళ్లాడుతున్నట్టు ప్రకటించింది. ప్రేమ స్వభావాన్ని, ప్రభావాన్ని అర్థం చేసుకున్నాననుకున్న ఆ క్షణంలో, తల్లికి తాను చేసిన అపకారం తలపుకువచ్చి ఒప్పుకొని. క్షమాపణకోరింది.

"నేను పారిస్ వెళ్తున్నాను. ఈ 'పెంకుటి కొంప' ఇంకెందుకు, అమ్మి పారేద్దాం. పన్నులదండుగే" అని నిస్సంకోచంగా ప్రకటించేశాడు కుమారుడు.

కారి కొయ్యబారిపోయింది. "ఇంతేనా? ఇందుకేనా నా జీవితం పాడుచేసుకున్నా. మీలా నాకు ధైర్యం తెగింపు లేకపోయాయి" అనుకుంది.

కారీ ప్రేమాభిలాషి ఆరోజునే చివాట్లు పెట్టాడు. "నీకు ప్రేమ అక్కరేదనుకుంటా... కేవలం ప్రేమకలాపంకోసం తిప్పలు పడుతున్నావు" అన్నాడాయన. ప్రేమించేమనిషే కావాలంటే దేన్నీ ఖాతరు చెయ్యకుండా పరుగెత్తుకుని కర్బీదగ్గరకు వెళ్లమన్నాడు. కళ్లు తెరచిన కారి, వెంటనే కారుమీద బయల్దేరివెళ్లింది. కర్బీ ఆ క్షణాన ఇంట లేడు. వేటకెళ్లాడు. తిరిగివస్తున్న కర్బీకి, తిరిగి వెళిపోతున్న కారి కారు కనబడింది. ఆ ఉత్సాహంలో, తొందరలో కాలు తొట్రుపడి గుట్టమీద నుండి క్రిందపడ్డాడు.

సుఖాంతం కావలసిన, కాదగిన, అయితే బాగుండే, కథ కాబట్టి ఆ ప్రకారమే జరిగింది.

యూనివర్సల్ ఇంటర్నేషనల్ వారు ఈకథను "ఆల్ దట్ హెవెన్ ఎలౌస్" అనే పేరుతో టెక్నికలర్ చిత్రంగా నిర్మించారు. కారీగా జేన్ వైమన్, కర్బీగా రాక్ హడ్సన్ నటించారు.

చివరవరకూ చక్కగా నడచిన ఈ చిత్రంలో కథ, అడంగి చేరడానికి, హీరో కొండమీదనుంచి పడడం అవసరమవటం చూస్తే, జీవితంలో పెద్ద నిర్ణయాలు జరుగడానికి ప్రమాదాలు తప్పితే గత్యంతరం లేదా అనిపిస్తుంది ఇందులో ఇది చిన్న అపశ్రుతిగా కనబడుతుంది. చాలా బాగుందనుకోబోతున్న మనసుకు, ఈ అపశ్రుతితో చాలా బాగులేదనుకో బుద్దేస్తుంది. ★

హిందిలో 'ఇలవేలుపు'

ఆంధ్రలో విజయవంతంగా నడుస్తూన్న తమ చిత్రం "ఇలవేలుపు"ను హిందిలో నిర్మించ సంకల్పించినట్లు శ్రీ ప్రసాద్ తెలియ చేశారు. "ఇలవేలుపు" శ్రీ యోగానంద్ దర్శకత్వాన ప్రసాద్ గారి పర్యవేక్షణ క్రింద తయారైంది.

★



సి. ఐ. డి. హిందీచిత్రంలో నటించిన తెలుగింటి వహీదా రహమాన్.

****

బొంబాయి సినిమా లేఖ

****


ఫిలింస్ డివిజన్ వారు నిర్మిస్తున్న డాక్యుమెంటరీ చిత్రాలు, వివిధ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో సర్వత్రా ప్రశంస లందుకొంటున్నాయి. మన దేశానికి మంచి పేరు తెచ్చిపెడుతున్నాయి. చలనచిత్ర ప్రపంచంలో ప్రముఖస్థానాన్ని సంపాదించుకుంటున్నాయి. ఇటీవల ఫిలింస్ డివిజన్ నిర్మించిన వాటిలో "స్ప్రింగ్-మ్యూజిక్ కాశ్మీర్" చిత్రానికి బెర్లిన్ చలనచిత్రోత్సవంలోనూ "ఖాదరిదర్శన్" అనే మరో చిత్రానికి కార్లోవివారి (జెకోస్లొవాకియా) ఉత్సవంలోనూ బహుమతులు వచ్చాయి. దీనినిబట్టే అంతర్జాతీయ స్థాయిలో ప్రేక్షకుల ప్రశంస లందుకోగల స్థాయి, సాంకేతికత మన డాక్యుమెంటరీలలో ఉంటున్నట్లు బుజువు అవుతున్నది.

మొత్తంమీద 1949 సంవత్సరంనుంచీ నేటి వరకూ భారతప్రభుత్వ ఫిలింస్ డివిజన్ నిర్మించిన డాక్యుమెంటరీలలో 14 చిత్రాలకు సెక్, క్రేడా, వెనిస్, ఎడింబరో, గ్లాస్గో, కార్లోవీవారీ, బెర్లిన్ ప్రభృతి చలనచిత్రోత్సవాలలో బహుమతులు లభించాయి. ఇంతకొద్దికాలంలో ఇంత ఘనత సాధించడం ఏదేశానికైనా అపురూపమే; సర్వకారణము శ్రీ మోహన్ వాధ్వానీ నిర్మించిన "రాజస్థాన్" అనే చిత్రానికి వెనిస్ ఉత్సవంలో (1951) ప్రథమ బహుమతి వచ్చింది. అప్పటికి ఆ గౌరవం పొందిన ప్రథమ భారతీయ చిత్రం అదే. నేటిలాగే మన కథాప్రధాన చిత్రాలుకూడా విదేశాలలో ప్రదర్శింపబడి, మన దేశానికి పేరు గడించిపెట్టాలని ఆశించడం సహజం. ఇది దురాశ కాదు. అసాధ్యమూ కాదు. విదేశీ చిత్రాలను మక్కీకి మక్కీ కాపీకొట్టకపోయినా ఒసిర్రాసగా రేకుకొట్టు చేసిన ధోరణిలో చిత్రాలను "తయారు" చేసే పద్ధతి మానుకుంటే, మనం చాలా గొప్ప ఫలితాలు సాధించవచ్చు. ఒక్కొక్కసారి, అంతర్జాతీయ ఉత్సవాలలో ఉత్తమచిత్ర నిర్ణాయక సంఘం మన చిత్రాలను చూస్తున్నప్పుడు ఇతరదేశాల చిత్రాలలో కొన్ని సన్నివేశాలు, నృత్యాలు, పాటలూ మన చిత్రాలలో చక్కగా పొందుపరచబడి ఉండడం గమనించి విస్తుపోవడం జరుగుతూ ఉంటుంది. అందువల్ల మన కథాప్రధాన చిత్రాలు

(56-వ పేజీ చూడండి)



జోయా అండ్ రేవతీవారి "బాలసన్యాసమ్మ" చిత్రంలో ప్రధానభూమిక నిర్వహించిన కృష్ణకుమారి.



తెలుగు తమిళ చిత్రాలలో 1955 కు ఉత్తమనటిగా ఎన్నికఅయిన శ్రీమతి అంజలీదేవికి మద్రాసుగవర్నరు శ్రీ శ్రీ ప్రకాశ బహుమతులిచ్చి గౌరవించారు.

చలనచిత్ర కళాకారులకు బహుమానాలు

1955 లో విడుదల అయిన తెలుగు, తమిళ్, మలయాళ్, కన్నడ చిత్రాలలో ఉత్తమ చిత్రాలకూ, ఉత్తమ నటీనటులకూ మద్రాసు చలనచిత్రాభిమానుల సంఘం మొన్న బహుమతులిచ్చి సత్కరించారు. మద్రాసు పోలీసుకమీషనర్ శ్రీ పారసారథి అయ్యంగార్ అధ్యక్షతన నెలకొన్న సంఘం బహుమతులకు అర్హులను నిర్ణయించింది. ఆగస్టు 29 న మ్యూజియం థియేటర్ లో జరిగిన సభలో, మద్రాసు గవర్నర్ శ్రీ శ్రీ ప్రకాశ కళాకారులకు బహుమతులు పంచిపెట్టారు.

ఈసారి శ్రీమతి అంజలీదేవి, తెలుగుతో పాటు తమిళ చిత్రాలలో కూడా ఉత్తమ నటిగా గౌరవం అందుకున్నది. అలాగే శ్రీమతి జమున ఉత్తమకన్నడనటిగా ఎన్నిక అయింది.

ఫిలింఫాన్స్ సంఘం అధ్యక్షురాలు శ్రీమతి రాజమ్మాళ్ అనంతశాయనమ్ స్వాగతం చెబుతూ గమనార్హమైన సూచనఒకటి చేశారు. చలనచిత్రపరిశ్రమ వర్ధిల్లాలన్న ఆశయంతో పనిచేస్తున్న ఈ సంఘం ఏటేటా ఎన్నికచేసే ఉత్తమ చిత్రాలపై, ప్రభుత్వం వినోదంపన్ను రద్దుచేస్తే, మరింత ప్రోత్సాహం జరుగగలదని ఆశిస్తున్నామన్నారు.

బహుమతుల వివరాలు.

తెలుగు ఉత్తమ చిత్రం—వాహినీవారి 'బంగారుపాప' నటుడు శ్రీ ఎస్ వి రంగారావు (బంగారుపాప), నటి శ్రీమతి అంజలీదేవి (గోకుల్ పిక్చర్స్‌వారి 'అనార్కలి'), సహాయనటుడు శ్రీ పెరుమాళ్ళు (సారథీవారి 'రోజులుమారాయి'), సహాయనటి శ్రీమతి పి హేమలత (బంగారుపాప)

తమిళం.- చిత్రం వైద్యా ఫిలింస్ వారి "మంగయార్ తిలకం" నటుడు శ్రీ జెమినీ గణేశన్ (కణవనే కన్కండదైవం), నటి శ్రీమతి అంజలి, సహాయనటుడు శ్రీ సారంగపాణి (విజయా వారి 'మిస్సియమ్మ'), సహాయనటి శ్రీమతి రాగిణి (మంగయార్ తిలకం)

మలయాళంలో నీలావారి 'అనియాతి' చిత్రానికీ, శ్రీమతి కుమారికీ కన్నడంలో పద్మినీవారి "మొదల తేదీ" చిత్రానికీ. శ్రీ హొన్నప్పభాగవతర్ కూ శ్రీమతి జమున (ఆదర్శసతి. నాగులచవితికి కన్నడ ప్రతి)కూ బహుమతులు వచ్చాయి. దక్షిణభారతంలో కాక, ఇతర కేంద్రాలలో తయారైన చిత్రాలలో రాజ్‌కమల్ వారి "ఝనక్ ఝనక్ పాయల్ బాజే"ను, విదేశీయ చిత్రాలలో పారమౌంట్ వారి "సబ్రీనా"ను ఉత్తమచిత్రాలుగా ఎన్నికచేశారు.

నగరంలో ఉత్తమ థియేటర్ గా ఈ యేడుకూడా "మిడ్ లాండ్" ఎన్నిక అయింది. ★

శాంతారాం, జయశ్రీల తగాదా

బొంబాయి హైకోర్టులో, ఆగస్టు 27 న లేఖిన రెండులక్షల రూపాయలు చేసే జవాహరీ విషయమై ఒక అభియోగం వచ్చింది.

వాది, చలనచిత్ర దర్శక విఖ్యాత శ్రీ వి. శాంతారాం.

ప్రతివాది ఆయన భార్య. సినీనటి, (డాక్టర్ కోట్నిస్ కీ అమర్ కహానీ, పరేడ్, శకుంతల) శ్రీమతి జయశ్రీ.

"మా పెళ్లి కాపురంలో, జయశ్రీకి నేను రెండు లక్షలు చేసే నగలు కొని పెట్టాను. ఆ నగలు, వాటి మూల్యమో నాకిప్పుడు ఇప్పించాలి" అని వాదించారు శ్రీ శాంతారాం.

"నగలన్నీ ఆయన నాకు కానుకగా ఇచ్చినవి కాబట్టి, అవి నావే. నేను తిరిగి ఇవ్వనవసరం లేదు. పైగా అందులో నేను స్వంతంగా నా డబ్బుతో కొన్నవి కూడా ఉన్నాయి" అని జయశ్రీ వివరించింది.

ఆమె ధోరణి తనకు నచ్చక, గత జనవరి 30 న తమ నివాసం ప్రాస్ పెనర్ హౌస్ నుండి తరలి వెళ్ళిపోయినట్లు శ్రీ శాంతారాం తెలియచేశారు.

1951 వరకూ సారస్యం లేకుండా, అన్యోన్యానురాగంతో కాపురం చేశామనీ ఆ తర్వాతనే ఆయన నిర్మించిన చిత్రాలలో తాను పాల్గొన్నదని దరిమిలా ఆయన తనను నిరక్ష్యం చేస్తూ వచ్చారనీ జయశ్రీ చెప్పింది. 1954 లో ఒకసారి ఒక చిత్రనిర్మాణం కోసం అని, శాంతారాం తనదగ్గర కొన్ని నగలు తీసుకువెళ్ళారనీ, అవి తిరిగి ఇవ్వలేదనీ కూడా ఆమె తెలియపరచింది.

చివరకు ఇరుపక్షాలకూ ఆమోదయోగ్యముగా తాత్కాలిక రాజీ ప్రతిపాదనలు రూపొందించారు. వాటి ప్రకారం శాంతారాం జయశ్రీకి నెలకు ఐదువేలు ఇస్తూవుంటారు. నగలన్నీ ఇద్దరి న్యాయవాదుల పేరిట ఒకచోట భద్రంగా ఉంచుతారు. కావాలనుకొన్నప్పుడు జయశ్రీ వాటిని అడిగి తీసుకొని వాడుకోవచ్చు. ★

డిటెక్టివ్ సీరియల్

మూలం: ఎడ్గార్‌వాలెస్

అరుణావలయం

అనువాదం: "ప్రద్యుమ్న"

42. పార్ అమ్మ

ఎక్కణ్ణించి వచ్చారో హఠాత్తుగా ముగ్గురు మనుషులు సమావేశ మధ్యంలో ప్రత్యక్షమయ్యారు. రెండు రాత్రుల క్రితం పార్‌ను అనుసరించిన గూఢచారిని బంధించినవారే ఈ ముగ్గురూ. వారు యేల్ కాళ్లకు, చేతులకు సంకెళ్ళు వేశారు యేల్ జేబులోని పిస్టలును ఒకడు లాగివేశాడు. ఇంకొకడు అతని ముఖంమీద గుడ్డకప్పి అవతలకు నడిపించుకుపోయాడు.

నుదుటినుండి ధారలుగా కారే చెమట తుడుచుకుంటూ ఇన్‌స్పెక్టరుపార్ సభికుల వంక చూశాడు. అందరూ విభ్రాంతులై అతనివైపు తిరిగారు.

"మీరు క్షమిస్తే ఈ కథంతా రేపు మనవి చేస్తాను" అన్నాడు పార్.

సభికులు అతని చుట్టూ మూగి ప్రశ్నల వర్షం కురిపించారు. కాని పార్ అప్పుడేమీ చెప్పడానికి అంగీకరించలేదు.

"పాపం పార్ చాలా బాధలు పడ్డాడు ఆ సంగతి నాకు తెలిసినట్టుగా ఇంకెవరికీ తెలియదు" అన్నాడు కమీషనరు. ప్రధాన మంత్రివైపు తిరిగి "మీరు ఇన్‌స్పెక్టరు కోరిన దానికి ఒప్పుకోవడం మంచిది. రేపు అతను జరిగినదంతా వివరిస్తాడు" అన్నాడు

"అయితే ఇన్‌స్పెక్టరును రేపు మనతో భోజనానికి రమ్మనండి" అని ప్రధానమంత్రి అన్నాడు. పార్ తరఫున కమీషనరు ఆ ఆహ్వానం అంగీకరించాడు.

జాక్ భుజం ఊత తీసుకొని పార్ బయటికి నడిచాడు. అక్కడొక టాక్సీ వేచి ఉంది ఇద్దరూ అందులో ఎక్కారు.

"నేను చూసింది కలా, నిజమా? డెరిక్ యేల్! అసంభవం! కాని—" అని నోట మాటరాక జాక్ అలా శూన్యంగా చూస్తూ ఉండిపోయాడు.

"ఏది అసంభవం కాదు" అని నవ్వాడు ఇన్‌స్పెక్టరు

"అయితే అతడూ, థాలియా డ్రమండ్ కలిసి పనిచేశారా?"

"అవును."

"కాని మిస్టర్ పార్! ఈ కథంతా మీ కెలా తెలిసింది?" అన్నాడు జాక్.

"మా అమ్మే నాకు చెప్పింది. అమ్మ ఎంత తెలివైనదో నీకు తెలియదు. ఆమె ఇవాళ రాత్రి—"

"అయితే ఆమె ఊళ్లోనే ఉందా?"

"ఆ, ఉంది. ఆమెను నువ్వు చూడలేదల్లే ఉంది. మా ఇంటికి రారాదూ? ఆమె కొంచెం పెంకిమనిషి. ప్రతిదానికీ వితండవాదం చేస్తుంది. అయినా ఆమె ధోరణికి నే నెప్పుడూ అడ్డుచెప్పలేదు."

"నేనూ చెప్పను" అని జాక్ నవ్వుకున్నాడు. "కాని అరుణవలయ రహస్యమంతా మీకు తెలిసినట్లేనా?" అని అడిగాడు.

"నిస్సందేహంగా."

"అలాగైతే థాలియా గతి ఏమవుతుందో?"

"ఆమె ఏమైతే నీ కెందుకు?"

"ఎందుకంటే నేనామెను ప్రేమిస్తున్నాను. అందుకు."

ఇన్‌స్పెక్టరు పకపకలాడి నవ్వాడు. "మిత్రమా! నా సలహా విని ఆ థాలియాను ప్రేమించడం మానెయ్యి అసలు థాలియా డ్రమండ్ అనే యువతి ఉన్నదనేమాటే మర్చిపో. కావలిస్తే మాఅమ్మను ప్రేమించు" అన్నాడు పార్.

పార్ తాయనమ్మపై జాక్‌కు విపరీతమైన ద్వేషం కలిగింది.

పార్ ఇంటికి చేరుకున్నారు పార్ మెట్లెక్కి గుమ్మంవద్ద ఆగాడు. తలుపు కొద్దిగా తెరిచి "అమ్మా! నీకోసం జాక్ బియర్డ్‌మోర్ వచ్చాడు," అన్నాడు.

లోపలనుండి ఆశ్చర్యార్థక కంఠం వినిపించింది.

"రావోయ్ జాక్. చూడు మాఅమ్మని," అని పార్ ఆహ్వానించాడు.

జాక్ ఒక అడుగు లోపలికి వేసి షుసాకి దెబ్బ తిన్నట్టు నిలిచిపోయాడు అతని కెదురుగా ఒక యువతి చిరునవ్వు నవ్వుతూ నిలబడింది. ఆమె అలసినట్లు కనిపిస్తోంది కలగంటున్నానా, మతి చలించిందా అని జాక్ అనుమానించాడు. ఎందుకంటే ఆ యువతి థాలియా డ్రమండ్!

అతడు చాచిన చేతులు అందుకుని ఆమె అతన్ని భోజనపుబల్లవద్దకు తీసుకువెళ్ళింది. అక్కడ ముగ్గురికి భోజనం అమర్చబడివుంది.

"నాన్నా! కమీషనరునుకూడా తీసుకువస్తానన్నావుగా?"

"నాన్నా?" అని జాక్ ఆశ్చర్యపడ్డాడు. "మీ తాయనమ్మ అన్నారుగా మిస్టర్ పార్?"

థాలియా నవ్వుతూ "మా నాన్న మరీ హాస్యప్రియుడవుతున్నాడు. ఆయన నన్ను ఇంటివద్ద ఎప్పుడూ అమ్మా అనే పిలుస్తాడు. మా అమ్మ పోయినప్పటినుంచి నేను మా నాన్నకి పరిచర్యలన్నీ చేస్తున్నాను. అందుచేత నన్నాయన అమ్మా అని పిలుస్తాడు. ఇక ఆ తాయనమ్మ సంగతంతా అభూతకల్పనే. ఇలా నాటకం ఆడినందుకు మీరు మరోలా అనుకోవద్దు"

"ఆయన మీ నాన్నా?"

థాలియా అవునన్నది.

"నా పేరు థాలియా డ్రమండ్ పార్. నయం, మీరు డిటెక్టివ్ కాకపోబట్టి బతి!

★ అరుణవలయం ★

పోయాం. లేకపోతే మీరు నా సంగతంతా ఆరాతీసి నా రహస్యం కనిపెట్టేవారే. భోజనం కానివ్వండి, నేనే వండాను," అన్నది థాలియా.

కాని జాక్ ఇంకా పని స్థిరంగా వినందే భోజనం ముట్టుకోదలచలేదు. థాలియా ఇలా చెప్పసాగింది:

"అరుణవలయంవారు మొట్టమొదటిసారిగా హత్య చేయగానే, మా నాన్నని ఆ కేసు పరిశోధనకు నియమించారు. అది చాల కష్టమైనదని, బహుశా దాన్ని ఆయన భేదించలేకపోవచ్చునని నేను భావించాను. మా నాన్నకి పోలీసుశాఖలో కావలసినంతమంది విరోధులున్నారు. ఈ కేసు కష్టమైనదని తెలిసే మన కమీషనరు ఈ కేసును ముట్టుకోవద్దని మా నాన్నకు సలహా ఇచ్చారు. కమీషనరు మాకు బాగా కావలసినవాడు. అందుచేత ఆయన మామీద కొంత శ్రద్ధ వహించేవాడు. కాని మా నాన్న ఆయన సలహా వినలేదు. కాని కేసు చేపట్టిన మరుక్షణంనుంచీ ఎందుకు చేపట్టానా అని విచారించాడు. నాకు మొదటనుంచీ పోలీసుపని అంటే ఆసక్తి జాస్తి. అరుణవలయం పద్ధతులను ఆయన కనుక్కున్నప్పటినుంచీ, నేను ఆ పద్ధతుల ద్వారానే అరుణవలయాన్ని భేదించే ఉద్దేశంతో నేరస్థురాలిగా పని ప్రారంభించాను.

మీ నాన్నగారికి అసలు అంతకు మూడు నెలముందే అరుణవలయంవారి బెదిరింపు ఉత్తరం అందింది. ఆ తరవాత రెండుమూడు రోజులకు హార్వే ఫ్రాయంట్ వద్ద నేను సెక్రటరీగా ఉద్యోగం సంపాదించాను. ఫ్రాయంట్ మీ తండ్రిగారికి స్నేహితుడు గనుక, అన్నీ కనిపెట్టే అవకాశం నాకు లభించింది. అసలు నేను మీ నాన్నగారి దగ్గరే ఉద్యోగం సంపాదించాలని ప్రయత్నించాను కాని లాభంలేకపోయింది. ఇది నీకు తెలియదనుకుంటాను. నీకు తెలియనిది ఇంకోటుంది. మీ నాన్నగారిని హత్యచేసినప్పుడు నేను ఆ అడవిలోనే ఉన్నాను. హంతకుణ్ణి నేను చూడలేదు గాని, పిస్తోలు ధ్వని వినగానే అక్కడికి పరుగెత్తుకు వెళ్లాను. అప్పటికే ఆయన ప్రాణంపోయింది. ఇంతలోకే నువ్వు అటునైపు పరుగెత్తుకు రావడం చూశాను. వెంటనే నేను తప్పుకున్నాను. పరీక్షిద్దామని చేతులోకి తీసుకున్న రివాల్వరు నా చేతులోనే ఉండిపోయింది.

మీ తండ్రిగారి మరణంతో నేనిక ఫ్రాయంట్ దగ్గర ఉద్యోగం చేయవలసిన అవసరం లేకపోయింది. అరుణవలయంలో జొరబడాలని ప్రయత్నించాను. వలయ నాయకుని దృష్టి ఆకర్షించడానికి నేరస్థురాలిననిపించుకోవడం ఒక్కటే మార్గం. అందుకని ఫ్రాయంట్ తాలూకు బుద్ధ విగ్రహం దొంగిలించి తాకట్టు పెట్టాను. నువ్వప్పుడు మానాన్నతో కలిసి తాకట్టు షాపు ఎదుటినుంచి రావడం, నేను నీకంట పడడం అనుకోకుండా జరిగినది కాదు. అది మా నాన్న పథకం ప్రకారం జరిగినదే. నన్నాయన దొంగ అనీ, దొంగలతో తిరిగేదాన్ననీ వర్ణించడం ఎనికంటే, అరుణవలయ నాయకునికి నేను నేరస్థురాలినని నమ్మకం కలిగించడానికే. నన్ను జైలులో ఎక్కువకాలం నిర్బంధించలేను కూడాను. మొదటిసారి నేరంచేసినట్లు పరిగణించి మేజిస్ట్రేటు నన్ను వదిలేశాడు. కాని నాకు అపకీర్తి రానే వచ్చింది. వెంటనే నేను అనుకున్నట్లుగానే అరుణవలయంనుంచి వర్తమానం అందింది.

వలయనాయకుణ్ణి నేను స్టేన్ స్క్వేర్‌లో కలుసుకున్నాను. నేను నాయకునితో మాట్లాడుతున్నంతసేపూ మా నాన్న నన్ను దూరంనుంచి కనిపెడుతూనే ఉన్నాడు. నేను నా బసకు వెళ్ళేదాకా అనుసరించే వచ్చాడు.

వలయ సభ్యురాలిగా నేను చేసిన మొదటి పని బ్రబజాన్ వద్ద ఉద్యోగంలో చేరడం. ఒక సభ్యుడిచేత ఇంకో సభ్యుడిమీద కన్నువేయించి ఉంచడం డెరిక్ యేల్ - అదే ఫెర్డినాండ్ వాల్టర్ లైట్‌మన్ పద్ధతి: బ్రబజాన్ సంగతి నాకేమీ అర్థంకాలేదు. మంచివాడో కాదో తెలియలేదు. అసలతడు వలయ సభ్యుడనికూడా నాకు మొదట్లో తెలియలేదు. నేను నా అపకీర్తి నిలబెట్టుకోడానికి గాను, మళ్ళీ చిన్న చిన్న దొంగతనాలు సాగించాను. మా నాయకుడు నన్ను మందలించాడు. కాని నా దొంగతనాలవల్ల ఒక ప్రయోజనం నెరవేరింది. నాకు కొందరు దొంగలతో పరిచయం ఏర్పడి, తద్వారా ఫెలిక్స్ మార్ష్ మరణించిన నాటి రాత్రి నేనతని ఇంట్లోనే ఉండడం తటసించింది.

యేల్ నన్ను సెక్రటరీగా తీసుకోవడంలో ఉద్దేశం, అనుమానం తనమీదనుంచి నామీదకు మళ్ళింపజెయ్యాలని. అసలు నన్నే అంతం చెయ్యాలని చూశాడు. ఫ్రాయంట్‌ను హత్యచేసిన రాత్రి నన్ను తనకత్తిలాంటిదే మరోకత్తి, తన గోవ్‌లాంటిదే మరోగ్లోవ్ పట్టుకుని ఫ్రాయంట్ గృహ సమీపంలో ఉండమన్నాడు,"

జాక్ అంతావిని "అయితే ఖైదునించి ఎలా తప్పించుకున్నావ్ నువ్వు?" అని అడిగాడు.

థాలియా కొంటె చూపులు చూస్తూ, "ఈ మాత్రం ఊహించలేవా జాక్? ఎలా తప్పించుకుని పోయానా? ఒకరాత్రివేళ జైలు గవర్నరు స్వయంగా తలుపులు తెరిచాడు. గౌరవనీయుడైన ఒక పోలీసు ఇన్‌స్పెక్టరు నన్ను వెంటబెట్టుకుని ఇంటికి తీసుకువెళ్ళాడు," అన్నది.

పార్ ఇలా చెప్పాడు:

"యేల్ చేత ఏదో అఘాయిత్యం చేయించాలనే మొదలా చేశాము. అమ్మ తప్పించుకు పోయిందని వినగానే అతడు భయపడిపోయాడు. ఇక జెండా ఎత్తేసి పారిపోదామనుకున్నాడు. ఇంతలో తన ఆఫీసు, ఇలు అన్నీ సోదా చేయబడి, ముఖ్యమైన కాగితాలు దొంగింపబడ్డాయని తెలియగానే థాలియా సామాన్య నేరస్థురాలు కాదనీ, ఆమెకు తను అనుకున్నదానికంటె ఎక్కువ ప్రాధాన్యం ఉందనీ గ్రహించాడు."

43. కథ ముగింపు

అమర్నాడు మంత్రివర్గం సమావేశానికి, విందుకు జాక్ కూడా వెళ్ళాడు. థాలియా కూడా వెళ్ళింది ఆమె అరుణవలయం కేసులో నిర్వహించిన అపూర్వపాత్రను అందరూ ప్రశంసించారు.

ఎవరినోటవిన్నా ఆమె మాటే విందు అవంతరం ఇన్‌స్పెక్టర్ పార్ తన కథనం కొనసాగించాడు.

"మీరు వెనకటి విషయాలు కొంచెం జ్ఞాపకం తెచ్చుకోవాలని కోరుతున్నాను. అరుణవలయం హత్యల్లో మొదటిది జరిగేంత వరకూ డెరిక్ యేల్ పేరు మనమెవరం వినలేదు. నగరంలో ఒక ఆఫీసు పెట్టాడు. తన దగ్గిర అలౌకిక శక్తులున్నాయనీ, గొప్ప డిటెక్టివ్‌ననీ పత్రికల్లో ప్రకటనలు వేయించాడు. కాని అతనికి ఏ కేసులూ వచ్చిన పాపాన పోలేదు. అసలతనికి ఇంకే కేసులూ అక్కరలేదు కూడాను. తన ప్రయత్నాల్లో తానున్నాడు. మొదటి హత్య జరిగిన తరవాత, హంతకుణ్ణి పట్టుకునేందుకు, తద్వారా తమ పత్రికలో హత్యాకథనం ప్రకటించి పత్రిక అమ్మకం ఎక్కువ చేసుకునేందుకు ఒకపత్రిక యజమాని డెరిక్ యేల్‌ను తమ డిటెక్టివ్‌గా నియమించాడు.

హంతకుడెవరో, హత్య ఎలా జరిగిందో డెరిక్ యేల్‌కంటె బాగా ఎవరికి తెలుస్తుంది? హత్య ఏ ఆయుధంతో చేయబడిందో, ఆ ఆయుధాన్ని స్పృశించినంత మాత్రానే అతడు హంతకుడిపేరు, హత్యా వివరం పూసగుచ్చినట్లు చెప్పెయ్యడం చూసి అంతా ఆశ్చర్యపడ్డారు. డెరిక్ యేల్ చెప్పినచోటికి వెళ్ళి ఒక నల్లటివ్యక్తిని అరెస్టుచేశారు. ఇక దాంతో యేల్ కీర్తి ఆకాశాన్నంటుకుంది. ఆ తరవాత అంతా యేల్ అనుకున్నట్టే జరిగింది. అరుణవలయం చేత బెదిరించబడిన ప్రతివ్యక్తీ తనవద్దకే సహాయంకోసం రాకతప్పదని అతడాశించాడు. అలాగే జరిగింది.

తను బెదిరించిన వ్యక్తులే తన సహాయం కోసం రావడంతో అతనిపని తేలికైంది. వారిని డబ్బు చెల్లించేట్లు ఒప్పించడానికి, ఒప్పించలేకపోతే హత్య చేయడానికి వీలైంది.

ఫ్రాయంట్ నిజంగా మరణించేవాడు కాదు. అందులో యేల్ చేతిలో అసలు మరణించేవాడు కాదు. కాని పరమలోభి అవడంవల్ల చేతులారా అంతడబ్బు జారవిడవడానికి మనసొప్పక, ఏదో ఒక చిన్న అనుమానాన్ని ఆధారం చేసుకుని పరిశోధన సాగించాడు. అతని పరిశోధన ఫలితంగా డెరిక్ యేల్, లైట్‌మన్ ఒకడేనని తేలింది. అతడు హత్య చేయబడిన రాత్రి మమ్మల్నిద్దర్నీ తనఇంటికి పిలిపించాడు. తన పరిశోధన ఫలితం బయటపెట్టాలని అనుకున్నాడు.

ఆ సమయంలోనే కమీషనరు ఫ్రాయంట్‌ను ఫోనుచేసి పిలిచాడు. తన మాటలు మేము వినకుండా ఫ్రాయంట్ నన్నూ యేల్‌నూ గది బయటికి వెళ్ళమన్నాడు. అదే అదనని యేల్ భావించాడు. అంతపని చేస్తాడని నేను అనుమానించలేదు కనుక నేను ముందు బయటికి వచ్చాను. అప్పుడు మేము ఇద్దరం ఓవర్ కోట్లు ధరించి ఉన్నాము. యేల్ తన చెయ్యి కోటుజేబులో పెట్టుకొని ఉండడం గమనించాను. ఆ చేతికే గ్లోవ్ ఉన్నది. ఆచేతితోనే కత్తిపట్టుకుని ఫ్రాయంట్‌ను పొడిచాడు."

"గ్లోవ్ ఎందుకు ధరించాడు?" అని ప్రధాన మంత్రి ప్రశ్నించాడు.

"అతడు హత్యచేసి ఇవతలకు రాగానే చేతిమీద నెత్తురు కనిపించకుండా గ్లోవ్ తొడుక్కున్నాడు. నేను గదిలోంచి బయటికి అడుగుపెట్టగానే ఫ్రాయంట్ మీదికురికి గుండెలో పొడిచి వుంటాడు. ఫ్రాయంట్ తక్షణం మరణించి ఉంటాడు. వెంటనే గ్లోవ్ విడిచేసి బల్లమీద పెట్టి, తలుపువద్దకు వచ్చి, ఆగి, చనిపోయిన వాడితో నేనేదో సంభాషణ సాగిస్తున్నట్లు నటించాడు.

ఇదంతా జరిగినట్లు నాకు తెలుసు. కాని నాకు ఆధారంలేదు. ఫ్రాయంట్ ఇంటిసమీపానికి మా అమ్మాయిని రమ్మన్నాడు. హత్యానేరం ఆమె మీదికి తోసెయ్యాలని అతనిఊహ. మేము ఇల్లంతా సోదాచేశాము. కాని మా అమ్మాయి అతని ఊహ పసిగట్టి ఇంట్లోకి అడుగుపెట్టకుండా, ఇంటి వెనకనుంచే తిరిగి వెళ్ళిపోయింది.

జేమ్స్ బియర్డ్ మోర్ కీ, మార్ కీ వ్యాపారరీత్యా సంబంధం ఉంది. మార్ల్ ఏదో వ్యాపార విషయం మాట్లాడే నిమిత్తం బియర్ మోర్ ఇంటికి వచ్చిన రోజున అతడు వస్తున్న సంగతి యేల్‌కు తెలియదు. ఇంటిని సమీపిస్తూ మార్ల్ తన తోటి నేరస్థుడైన యేల్ అక్కడ ఉండడం చూసి భయవిహ్వలుడయ్యాడు. పొదల మధ్యన డెరిక్ యేల్ కూర్చుని ఉన్నాడు. అతన్ని క్షణకాలం చూశాడు మార్. తరవాత లండన్ వెళ్ళిపోతున్నట్టు నటించి మళ్ళీ వెనక్కి వచ్చాడు. యేల్ తనను చంపకముందే, తాను యేల్‌ను చంపాలని నిశ్చయించాడు. కాని మార్‌కు హత్యచేసేంత ధైర్యం లేదు. అందుచేత యేల్‌కు ఒక ఉత్తరం వ్రాశాడు. దాన్ని యేల్ గది కిటికీలోంచి లోపలపడేసి వెళ్ళిపోయాడు. ఆ ఉత్తరం యేల్ చదివి సగం మాత్రం కాల్చి పారేశాడు. ఆ ఉత్తరం ఏమిటో నేను చెప్పలేను. బహుశా యేల్ తన జోలికి రాకుండా ఉంటే, తాను అతని జోలికి రాకుండా ఉంటానని అయి ఉంటుంది. డెరిక్ యేల్ లండనులో ఏంపనిమీదఉన్నాడో మార్ల్‌కు తెలియదు. ఆ క్షణంనుంచీ మార్ల్ పని ఆఖరైనట్లే భావించవచ్చు. అరుణవలయ సభ్యుడైన బ్రబజాన్‌ను మార్ల్ బ్లాక్ మెయిల్ చేయడానికి ప్రయత్నించాడు. ఈ సంగతి బ్రబజాన్ యేల్‌కు తెలియజేశాడు. అరుణవలయానికి సంబంధించిన ఉత్తరాలన్నీ మిల్‌ట్రెడ్ వీధిలోని ఒక షాపుకు వచ్చేవి. ఆషాపుకు వెళ్ళి డిటెక్టివ్ హోదాలో యేల్ ఆ ఉత్తరాలన్నీ చదువుకుంటూ ఉండేవాడు.

మార్ హత్యకావలసి ఉన్న రాత్రే పారిపోదామని బ్రబజాన్ ఆలోచించాడు. అందుచేతే మార్ల్ తాలూకు అకౌంటు మూసివేసి పలాయన ప్రయత్నాలు చేశాడు. మార్ల్ హతుడు కాగానే సహజంగా బ్రబజాన్ మీద అనుమానంపడింది. తాను అపాయంలో ఉన్న సంగతి అరుణ వలయంనుండి తెలుసుకుని బ్రబజాన్ పారిపోయి బియర్డ్ మోర్ తాలూకు చిన్న ఇంటిలో దాక్కున్నాడు. అక్కడికికూడా వెళ్ళి మేము సోదా చేశాము."

ఇన్‌స్పెక్టర్ పార్ నవ్వుకున్నాడు.

"మేము అంటే నేను కాదు. యేల్ వెదికాడు. బ్రబజాన్ దాక్కున్న గదిదాకా వెళ్ళి వెనక్కి తిరిగివచ్చాడు. ఎవరూ కనిపించలేదని చెప్పాడు."

ప్రధానమంత్రి అడ్డంవచ్చి "ఇన్‌స్పెక్టర్! ఒక విషయం తెలియడంలేదు. యేల్ తన ఆఫీసులో ఎలా బంధింపబడ్డాడు?" అని అడిగాడు.

★ అరుణవలయం ★

"అది చాలా చిత్రంగా జరిగింది. కొంత సేపటిదాకా నేను అయోమయంలో పడ్డాను. యేల్ తనంతట తానే తన చేతులను, కాళ్లను బంధించుకుని, క్లోరోఫారమ్ పీల్చి పడిపోయాడు. డబ్బు అంతా ఒక కవర్లో పెట్టి తన ఇంటి చిరునామా వ్రాసి తనగదిలోంచి ఉత్తరాల గొట్టంద్వారా కిందికి పడేశాడు. ఆ సమయంలోనే పోస్టు బంట్రోతు దిగువ హాలులోని ఉత్తరాల పెట్టెలోంచి ఉత్తరాలన్నీ తీసుకుపోవడం మీకు తెలిసిందే. కాని యేల్‌కు తెలియకుండా నేనొక తమాషా చేశాను. థాలియాను బట్టల బీరువాలో కూర్చోపెట్టాను. ఆమె ఆ బీరువా సందులోంచి గదిలో యేల్ ఆడిన నాటకమంతా కనిపెట్టింది వెళ్లిపోయేటప్పుడు సాక్ష్యాధారంగా క్లోరోఫారమ్ సీసాను కూడా పట్టుకుపోయింది.

ఇక ఆఖరి బాధితుడు రాఫేల్ విలింగ్స్ ఉన్నాడు. ఇతనికి వెంట్రుకవాసిలో చావు తప్పింది. మా అమ్మాయిని ఇతడు బలాత్కారం చెయ్యబోయాడు. ఆమె అతనితో పెనగులాడుతోంది ఇంతలో వెనక తెరల చాటునుంచి కత్తిపట్టుకున్న చెయ్యి ముందుకురావడం కనిపించింది. ఆ కత్తిని ఆ వేళ పొద్దున్నే యేల్ డిటెక్టివ్ హోదాలో వెళ్లి రాఫేల్ విలింగ్స్ ఇంట్లోంచి దొంగిలించాడు. ఆ కత్తితోనే విలింగ్స్‌ను గుండెలో పొడవడానికి యేల్ ప్రయత్నించాడు. థాలియా ఎంతో కష్టంమీద విలింగ్స్‌ను పక్కకు లాగివేసింది. కాని కత్తిపోటు గుండెలో కాకపోయినా, తగలనే తగిలింది. కాని అతను చావలేదు చావలేదని తెలిసేటప్పటికి యేల్‌కు పట్టలేని కోపంవచ్చింది. ఆ హత్యాప్రయత్నం నేరాన్ని థాలియా మీదికి తోసెయ్యాలని ప్రయత్నించాడు.

అతని తెలివితేటలు చూడండి డిటెక్టివులలోకల్లా గొప్పవాడనే పేరు సంపాదించాడు. అందుచేత అరుణవలయనాయకుడుగా అతనికి బోలెడు భోగట్టా తెలిసే అవకాశం కలిగింది. చివరికతడు పోలీసుశాఖలో కూడా ప్రవేశించాడు - నా సలహా మీదనే అతనికి ప్రవేశం దొరికిందనుకోండి. పోలీసుశాఖలో చేరాక పోలీసుకాగితాలనేకం అతనికి చేతికి దొరికాయి. దీనివల్ల అతనికి ఉపయోగం ఏమీ లేదుగాని, జాక్ బియర్డ్‌మోర్ పంపిన ఫోటోకవరు ముందుగా యేల్ చూడడం, దానివల్ల జాక్ ప్రాణందక్కడం జరిగింది.

ఇక నేను చెప్పవలసిందాటే లేదు. ఒకటి మాత్రం చెబుతాను రెండురోజుల కిందట నేను యేల్‌తో 'గొప్ప గొప్ప నేరస్థులంతా ఏదో చిన్న పొరపాటువల్ల పట్టుబడిపోతా'రని చెప్పాను. విలింగ్స్, థాలియాతో కలిసి ఊరవతల ఉన్న తన రెండో యింటికి వెళ్లిపోయాక యేల్ తాను విలింగ్స్ యింటికి వెళ్లాననీ, మంత్రి అప్పుడే థాలియాతో కలిసి వెళ్లిపోయాడని నౌకరు చెప్పారనీ అన్నాడు. అతడు నిజానికి విలింగ్స్ యింటికి వెళ్లనే లేదు విలింగ్స్ తన రెండో యింటికి వెళ్లడానికి ఎంతో ముందే యేల్ అక్కడికి వెళ్ళి దాక్కున్నాడు"

"ఇదంతా సరేగాని" అని ప్రధానమంత్రి "నాకు ఒకటే సందేహంగా ఉంది. మీ అమ్మాయికి ఏం బహుమానం యివ్వగలమా? అని నాకు ఆలోచనగా ఉంది. నీకు ప్రమోషను ఇవ్వడం కష్టమేమీ కాదు అసిస్టెంటు కమీషనరు పదవి ఖాళీగానే ఉంది కాని మిస్ డ్రమండ్‌కు ఏమివ్వగలం? హంతకుణ్ని పట్టివ్వడంలో తోడ్పడినందుకు ధనం బహూకరించడమేనా యింకా యేమన్నా చెయ్యగలమా అని చూస్తున్నా" అన్నాడు.

"మిస్ పార్సన్‌హూర్స్ట్ మీరెవ్వరూ ఆందోళన పడనక్కర్లేదు. నేనామెను త్వరలో పెళ్లిచేసుకోబోతున్నాను," అని ఒకకంఠం వినిపించింది అందరూ అటుకేసి చూశారు. ఆ కంఠం జాక్ బియర్డ్‌మోర్‌ది.

"నాతో చెప్పలేదేం అమ్మా" అని పార్ అన్నాడు.

"నాకేం తెలుసు యీ సంగతి?" అని థాలియా జాక్‌కేసి తెల్లబోయి చూసింది.

"తనను పెళ్ళిచేసుకోమని జాక్ నిన్నడగలేదా?" అని పార్ అడిగాడు.

ఆమె లేదన్నది. "నేను పెళ్ళిచేసుకుంటానని అతనితో ఎప్పుడూ అనలేదు. కాని ఇలాఅవుతుందని నేనిదివరకే ఊహించాను"

లైట్‌మన్ ఖైదులో బుద్ధిమంతుడిలాగ ప్రవర్తించాడు. అతడు ఒక్కందుకే అధికారులను విమర్శించాడు. ఉరికంబానికి తీసుకుపోతున్నప్పుడు తనను సిగరెట్టు కాల్చనివ్వలేదని అతని విమర్శ.

"ఫ్రాన్సులో ఇంతకంటె బాగా ఏర్పాట్లు చేస్తారు. కిందటిసారి నన్ను ఉరితీసినప్పుడు-"

థాలియా డ్రమండ్‌ను అతడు ఊరికే తెగ మెచ్చుకున్నాడు.

"అటువంటి పిల్లను నేనెక్కడా చూడలేదు. బహుశా ఆమె జాక్‌ను పెళ్లాడుతుందనుకుంటాను. అదృష్టవంతుడు. నాకు స్త్రీలమీద వ్యామోహం అట్టే లేదు నేనింత పైకి రావడానికి కారణం అదే కాని నేనే గనక పెళ్లాడదలచుకుంటే థాలియాలాంటి పిల్లనే పెళ్లాడేవాణ్ణి."

మార్చి నెలలో ఒక ఉదయం ఉరితీసేవాడు వచ్చి అతనికి సంకెళ్లు తగిలించాడు. వాడికేసి చూసి "నీకు ముష్కార్ పాలియూర్ తెలుసా? నువ్వు చేసేపనే అతడూ చేసేవాడు బలేవాడులే"

ఉరితీసేవాడు ఏమీ మాట్లాడలేదు ఉరి తీయబోతున్నందుకు తన్ను క్షమించమని కోరినంతప్పిస్తే అతడింకేమీ మాట్లాడలేదు.

"పాలియూర్‌ను చూసి నువ్వు నేర్చుకోవలసిన పాఠం ఒకటుంది. తాగుడుమానెయ్యి. తాగుడువల్లనే నేను పాడైపోయాను. తాగుడు మానేస్తే ఈనాడీగతి పట్టేదికాదు నాకు" అన్నాడు యేల్.

అతన్ని ఉరికంబందగ్గరకు నడిపించుకుపోయారు. ఉరితాడు మెడకు తగిలించారు. తెల్లనిగుడ్డ ముఖంమీద కప్పారు ఉరితీసేవాడు ఉచ్చుబిగించేమీట నొక్కడానికి సిద్ధంగా ఉన్నాడు.

"ఈ తాడు తెగదనుకుంటానీ పారి" అన్నాడు డెరిక్ యేల్, కాదు లైట్‌మన్.

అరుణవలయంనుండి వచ్చిన అంతిమ సందేశం అదే.

(అయిపోయింది)

వనితా లోకం

భర్తకంటే ఎక్కువగా భార్య ధనార్జన చేస్తే వారి దాంపత్యం పొసగదా?

దంపతులలో హెచ్చుతగ్గులు

ఇల్లిందల సరస్వతీదేవి

ఎలిజబెత్, పీటర్ నూతనముగా వివాహము చేసుకొన్న బ్రిటిష్ తరుణీ తరుణులు. వాళ్లకొక పెద్ద సమస్య వచ్చిపడ్డది! ఎలిజబెత్ ఒక సుప్రసిద్ధ నాట్యమండలిలో నర్తకి. ఆమెకు వారానికి 40 పౌనులకు పైగా వేతనము. కాని, ఆమె భర్త వేతనము ఆమెకు లభించే దానిలో సగమయినా లేదు! ఈ సంగతి తెలిసినవాళ్లందరూ, "నీవు ఆమె పోషణలో ఉన్నావు. ఇకనుంచీ నిన్ను గడ్డిపరక క్రింద చూస్తుంది కాబోలు! అయ్యో పాపం!" అని అతడిని చూసి జాలి పడేవారూ, అధిక్షేపించేవారూ, ఎగతాళి చేసేవారూ అనేక రకాలు.

కాని ఈ సమస్య ఆ దంపతులను ఎప్పుడూ బాధించలేదు. కాగా, ఎలిజబెత్ అంటుందీ, "నాకూ ఆయనకూ మధ్య మా వేతనాలను గురించిన సంభావనే ఎన్నడూ జరగదు. ఇద్దరము పనిచేసి అలసిపోయి వస్తాము. ఆ పనులను గురించే పరస్పరం కుశలప్రశ్నలు వేసుకుంటాము. ఇద్దరమూ వంటపని చేసుకుంటాము. వండుకొని, తింటాము. ఏవో కులాసా కబుర్లు చెప్పుకుంటాము. మా ఇద్దరిలో ఒకరు లక్షలార్జించినా, మరొకరు దమ్మిడీ సంపాదించక పోయినా, మాకు లక్ష్యం లేదు"

'నాకు ఆ చింతే లేదు'

ఇక అతడి ధోరణి ఎట్లా ఉందంటే: "ఇది అందరికీ సమస్యగా కనపడుతున్నదేమో గాని, మమ్మల్నేమీ బాధించటం లేదు. అసలు సంగతి—ఆమే, నేనూ ప్రేమించుకొని, వివాహము చేసుకోవాలని ఒప్పందం చేసుకొన్నవాడు, ఆమె కూలిపని చేస్తూ ఉండేది. ధనికుల ఇండ్లలో తనకు చేతనయిన పనులు చేసి, డబ్బు సంపాదించేది. అదృష్టవశాత్తు ఇటీవలే, ఆమెకు అనుకోకుండా ఈ కొత్తపని లభించింది. ఆమెకువలెనే నాకుకూడా ఏదైనా దొరికితే, దొరకవచ్చు. ఒకవేళ అటువంటిది ఏదీ కలిసిరాకపోయినా, మాకు చింతలేదు. మేమిద్దరమూ పరస్పరం కోరి వివాహం చేసుకొన్నాము. మా ఆనందానికి ఏ ఇతర సమస్యలూ అడ్డమురావు," అని వాదిస్తాడు.

వారిద్దరికీ ఒక అంతరంగిక మిత్రుడు ఉన్నాడు. అతడు ఆ జంటను చూసి విస్మయ పడతాడు. పీటరు దినకృత్యాలలో కొన్నిటిని ఏకరువు పెడుతూ, "ఆమెకు వేళయిందని పీటరు లేచి, గబగబా పాలు కాచి, ఒవల్‌టిన్ సిద్ధం చేస్తాడు. ఆమె దుస్తులు నలిగిపోతే, ఇస్త్రీ చేస్తాడు. ఆమెను నిద్ర లేపి, పనిలోకి పంపుతాడు. అతడూ వారానికి నాలుగుసార్లయినా ఆమె చేత నిద్రలేపించుకుంటాడు. సాయంత్రం రాగానే, చేతనయినంత చేసుకొని కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ, కన్నుమూస్తారు. వారిద్దరూ ఇంట్లో అడుగుపెట్టగానే, లోకంలో

★ దంపతులలో హెచ్చుతగ్గులు ★

కీర్తిగా వివాహం చేసుకొన్న తరుణీతరుణులకలెనే మెలగుతారు. ఆమె ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నర్తకిఅయినా, ప్రియుని చెంతనున్న ప్రేయసివలెనే మసలుకుంటుంది" అని మిత్రులతో చెప్పి మురుస్తూ ఉంటాడు.

లోకమంతటిలో ఒకే ఒక విశ్వాసము అవలంబించుకుని పోయింది. "భార్యాభర్తలలో భర్త అన్నిటిలో అధికుడుగా ఉండాలిగాని, భార్య ఎందులోనూ (ఒక సౌందర్యములో తప్ప) ఎక్కువగా ఉండకూడదు. ఒకవేళ ఉండినా, ఆ దాంపత్యం సహజంగా సాగిపోదు", అన్నదే ఈ విశ్వాసం. "ఎందులో కొంత ఎక్కువగా ఉన్నా, మనిషికి కొంత ధీమా కలుగుతుంది; అది పురుషుడికి ఉంటే చెల్లుబడి అవుతుంది. సహజముగా కూడా ఉంటుంది" అన్న విశ్వాసం పరంపరాగతముగా వస్తున్నది. ఈ విశ్వాసం మన దేశంలో ఇతర దేశాలకంటె అధికముగానే స్థావరమేర్పరచుకొన్నది.

చాలీపద్దుల చదువు

మన దేశంలో స్త్రీ పురుషులను దంపతులుగా జతపరచే ముందర, వరుడికంటే వధువు దేనిలోనూ మించకుండా చూస్తారు. గృహిణిగా ఎన్నుకునే బాలిక యోగ్యతకూ, వరుడి యోగ్యతకూ చాలా తేడా ఉన్నది. పురుషుడికి ధనమార్జించి కుటుంబ సంరక్షణ చేయగల ప్రయోజకత్వమూ, దానికి తగిన యోగ్యతా ఉండవలెనని ఆశిస్తారు. బాలిక మంచి కుటుంబములో పుట్టి, ఆరోగ్యము కలదిఅయి, వంశాన్ని అభివృద్ధిచేస్తూ, ఇలు చక్కబెట్టుకొనగలిగితే, చాలునని కొనేవారు. చాకలి పద్దువరకూ చదువూ, జోలపాట వరకూ సంగీతమూ వస్తే చాలునని తృప్తిచెందేవారు. ఆడపిల్లలకు విద్య అవసరమని గుర్తించిన తరువాత కూడా, స్త్రీవిద్య పురుషుడి విద్యను మించి ఉండకూడదని భావించారు. ఆ దృష్టితోనే వధూవరుల ఎన్నిక జరుగుతూ వచ్చింది. ఎంతటి విద్యాధికురాలికయినా కనీసం ఒక మెట్టుఅయినా పైన ఉన్న వరుడినే నిర్ణయించటం పరిపాటయిపోయింది. పురుషుడి ఆధిక్యతకు భంగము కలిగించని లలితకళల వంటివి స్త్రీకి అధికంగా వచ్చిఉన్నా, లోకము గణించేదికాదు. వాటిని ప్రమాదరహితమయినవిగా భావించేవారు.

ఇంతవరకూ మన దేశంలో ఆర్థికంగా స్త్రీ పురుషుడికంటే అధికురాలన్న అంశము అంతగా మొలకెత్తలేదు. స్త్రీకి తలిదండ్రుల వద్ద నుండి సంక్రమించిన ఆస్తివల్ల గాని, ధనమువల్ల గాని ఆధిక్యత కలగటానికి అవకాశం ఉన్నది; కాని, అర్జన వసతి లేకపోయింది. మనకు సంఘంలో అక్కడక్కడ ఆస్తులతో అత్తవారింటికి వచ్చిన అతివలు కనబడుతూనే ఉంటారు. కాని, వాతావరణం సహజంగా కనబడిన యిళ్ళ సంఖ్య తక్కువ. పురుషుడినే సహజంగా ఆమెకంటే తను తక్కువ అనే భావం పీడిస్తూ ఉంటుంది; దానికి ఇంటిలో వున్నవారూ, లోకమూ చేరి యథాశక్తిగా సమిధలు వేస్తూ ఉంటారు. కొన్ని సందర్భాలలో, వ్యక్తిగతమయిన అవ్యక్తానికి వాతావరణ ప్రభావం తోడయి, చేతిలో నాలుగు కాసులు మెదిలే స్త్రీలకు పైమాపు కలుగజేయటం కూడా ఉన్నది ఇటువంటి నిదర్శనాలను ఇల్లరికము ఉన్నచోట ప్రత్యక్షముగా చూడగలుగుతాము

ఇటీవల: స్త్రీలు ఉద్యోగాలలో ప్రవేశించి ధనార్జన చేస్తున్న కాలంలో కూడా దాంపత్యంలో స్త్రీల ఆధిక్యత అంతగా సంభవించలేదు నాటికీ నేటికీ. జరిగిన వాటిని లోకం గుర్తుపట్టుతూనే వున్నది ఆ దంపతులలో ఇద్దరిమధ్య ఉండవలసిన ఆరోగ్యకరమయిన వాతావరణం ఉండటం అరుదుగానే ఉన్నది.

లోకం ఓర్వదు

తెలివితేటలకూ, ప్రయోజకత్వానికీ, ధన సంపాదనే బాహ్యలక్షణమని స్థూలంగా గుర్తించిన లోకం, భర్తకంటే భార్య విచక్షణాజ్ఞానము కలిగినదయినా, లోకజ్ఞానం కలిగినదయినా ఓర్వదు! ఇన్ని లక్షణాలు కల ఆడది పెనిమిటిని గౌరవించదని అపనమ్మకంతో వ్యాకులపడుతుంది. ఒకవేళ దీనికి భిన్నంగా వర్తించినా, నమ్మదు.

స్త్రీల ఆధిక్యత ఎందులోనూ ఉండకూడదని నమ్మినలోకం పురుషుడితో సమానంగా ఉన్నా సహించలేదు. "ఆమె అతడితో సమానముగా చదువుకున్నది; సమానముగా ఆర్జన చేస్తున్నది. గనుక అతడికి లొంగి వుండవలసిన అవసరం లేదు. అతడిచేతి మాట పడవలసిన అవసరం అంతకంటే, లేదు" అని తీర్పు చేస్తుంది.

ఇంతవరకూ, స్త్రీలు ఇంటిని విడిచి బయటికి రాకుండా, అన్ని విషయాలలోనూ పెండివాటి పరిస్థితిని మించకుండానే ఉన్నారు. ఆ కారణంచేత, స్త్రీలు మించిపోతారన్న వెరపు లేకుండా, నిర్భయంగా గడచిపోయింది. కాని ప్రస్తుతం మన దేశం కూడా ప్రపంచ పరిస్థితుల ననుసరించి మార్పుచెందుతున్నది ప్రతి స్త్రీ కుటుంబిని అయినా, పిల్లతల్లి అయినా ఆమె అభిరుచుల ననుసరించి కృషిచేసి నైపుణ్యం సంపాదించటానికి అనువైన సాధనక్రియలు, దోహదక్రియలు అమలుజరుగుతున్నాయి ఎవరికి ఎప్పుడు తీరుబాటు అవుతుందో. ఆ కాలంలోనే కృషిచేయటానికి తగిన వసతులు కల్పిస్తున్నారు. ఈ విధంగా కృషి చేసినవారు విద్యారంగంలోనూ, పారిశ్రామిక రంగంలోనూ ఉన్నారు. కొందరు లలితకళలను అభివృద్ధి చేసుకుంటున్నారు. ఈ విధంగా అభివృద్ధిగాంచిన స్త్రీల స్వరూపం ఈనాడు మార్పుచెందింది.

చాలని సంపాదన

కాలపరిస్థితుల ననుసరించి, స్త్రీలు చేతనత్వం పొందారు. "మాకు చేతనయినంత చేతనయిన విధంగా మేమూ ధనార్జన చేస్తాము" అని ముందడుగు వేస్తున్నారు. ఈ ఆసక్తిగల స్త్రీలు తగిన విద్యాయోగ్యతలను గానీ, చేతిపనులలో నైపుణ్యం గానీ సంపాదించి, ఆర్జనకు దిగుతున్నారు. స్త్రీల ధనార్జనను గురించి ఇంతకాలమూ లోకానికి ఒక తేలిక అభిప్రాయమే ఉండేది "ఆడది ఏం సంపాదించగలదు? ఏదో కూరగాయల సంపాదన" అన్నట్లుగా ఉండేది. కాని, కాలప్రభావంవల్ల సమాజ పరిస్థితులు తారుమారయిపోయినవి. తల్లిదండ్రుల ఆర్థికపరిస్థితులు తృప్తికరంగా లేని ఇళ్ళలో చదువు నేర్చిన ఆడపిల్లలు, "అమ్మా! నేను ఉద్యోగం చేసి డబ్బు సంపాదించి తెస్తాను; నీవు ఇబ్బంది పడకు; నాన్నను సమాధానపరచు," అంటున్నారు. సంసారాలను గడపటంలో కొందరు తోడ్పడుతున్నారు. చేతిలో ఉన్న విద్యను ఉపయోగపరచి, ధనమార్జించాలని ముందడుగు వేస్తున్నారు.

ఈ విధంగానే, గృహిణులు కూడా భావిస్తున్నారు. ఒక్క పురుషుడు సంపాదిస్తే చాలని కుటుంబాలెన్నో అగచాట్లు పడుతున్నాయి. ఆ కుటుంబినులు తాముకూడా ఏదోవిధంగా, ధనార్జన చేయాలని ప్రయత్నాలు చేస్తున్నారు; కృతకృత్యులవుతున్నారు. తమకు తీరికవున్న సమయాలలో, చేయతగిన నౌకరీలకోసం వెదకుతున్నారు. లాభంపొందుతున్నారు. ఈ లాభం పొందటంలో కొన్ని సందర్భాలలో స్త్రీ పురుషుడిని మించే పరిస్థితులు వస్తున్నాయి! "ఏ క్లాసు" గాయకురాలు సగటున నెలకు సంపాదించే ధనాన్ని మూడవ గ్రేడు గుమస్తా సంపాదించకపోవటం సంభవమవుతున్నది కుట్టుపనిలో నైపుణ్యంకల స్త్రీలు,

(56-వ పేజీ చూడండి)

బాల సాహితి

మా లక్ష్మి

'అనంత'

'మహాలక్ష్మి' వెలసినది
మా యింట తల్లి,
పాల సంద్రము లీల
వరలినది యిల్లు.

మా లక్ష్మి చిఱుమేన
మసలె మిసమిసలు,
మణికౌస్తుభ ప్రభలు
మాయింట నిండె.

మా లక్ష్మి 'అత్త' 'అ
మ్మా' యంచు పలికె,
మా చెవుల నమృతంపు
మాధుర్య మొలికె.


మా లక్ష్మి ప్రాకికొని
మాయింట తిరిగె,
ఐరావతపు నడక
లందగించినవి.

మా లక్ష్మి చిఱుపరుగు
లీల చూపినది,
ఉచ్చైశ్శ్రవంపు గతు
లొప్పినవి యింట.

మా లక్ష్మి నగవు తెలి
మల్లె లయి విరిసె,
అల చందమామ మవె
న్నెలల జాల్గిరిసె.

మా లక్ష్మి తియపాట
లాలపించినది,
అచ్చరల గీతాల
హాయి నించినది.

మా లక్ష్మి యాచకుల
జోలె నింపినది,
కల్పవృక్షమె ఇటకు
కదలి వచ్చినది.



జరిగిన కథ :—

అది 1866 వ సంవత్సరం ప్రారంభం. సాగర గర్భంలో బ్రహ్మాండమైన జలజంతువేదో కనిపించిందనే వార్త ప్రపంచప్రజలను విభ్రాంతులను చేసింది. సముద్రంలో ప్రయాణంచేసే నౌకలకది ఇట్టే కనిపించి ఇట్టే మాయమయ్యేది. అమెరికా ప్రభుత్వం అబ్రహాం లింకన్ అనే యుద్ధనౌకను ఆ జలజంతువును వేటాడడానికి నియమించారు. అమెరికా ప్రభుత్వ నౌకాశాఖా కార్యదర్శి హాబ్సన్ ఫ్రెంచి ప్రకృతిశాస్త్రపరిశోధకుడు ప్రొఫెసర్ అరోనాను ఈ విజ్ఞానయాత్రలో పాల్గొనవలసిందని ప్రార్థిస్తాడు. అతడు వెంటనే దాని కంగీకరించి తన పరిచారకుడు కాన్సెల్‌తో సహా ఓడ ఎక్కుతాడు. అబ్రహామ్‌లింకన్ క్రమక్రమంగా పసిఫిక్ ఆమహాసముద్రంలో ప్రవేశిస్తుంది. అది అలాగ కొంతదూరం ప్రయాణం చేసేసరికి కొంతదూరంలో సముద్రతీరం గాలమీద ఒక పెద్ద వెలుగు కనిపించింది ఆ వెలుగు ఒక పెద్ద జలచరానికి సంబంధించినదై ఉండాలని నౌకాధికారులంతా ఊహించారు. నావ దానిదగ్గిరికి పట్టించి దానిమీద ఫిరంగిగుళ్లవర్షం కురిపించారు. అబ్రహామ్‌లింకన్ తరవాత జరిగిన పోరాటంలో ఎందుకు పనికిరానిదై పోతుంది. ప్రొఫెసర్ అరోనా, కాన్సెల్ నెడ్‌లాండులతో కలిసి ఒక జలాంతర్గామిలో ప్రవేశిస్తాడు. కొంతసేపటికి ఓడనావికులు వారికి సుష్టుగా భోజనం పెడతారు తిరిగీ తమ కన్నప్రాణాలు రాలేదని అంతా మథనపడుతూంటే వారికి హఠాత్తుగా జలాంతర్గామి అధికారి హెచ్చరిక వినిపిస్తుంది. కప్టెన్ నీమో ఇక ఆ ఓడలోనించి ఎవరు బయటపడలేరని చెప్పి ప్రొఫెసరు అరోనాకు జలాంతర్గామి యంత్రాల రహస్యాలు తెలియజేస్తాడు. కెప్టన్ నీమో జలాంతర్గామి నడిపించేపద్ధతి అంతా ప్రొఫెసర్ అరోనాకు తెలియజేస్తాడు. పిమ్మట జలాంతర్గామి కిరువైపులా తెరచుకున్న అద్దాలలోనించి అద్భుతమైన సాగరగర్భ జలచరాలు కనిపిస్తాయి ఆ తరవాత జలాంతర్గామి సాగరగర్భంలోని క్రెస్పో ద్వీపానికి బయలుదేరుతుంది. తరవాత సాగరగర్భంలో క్రెస్పోద్వీపంలో వేట జరుగుతుంది జలాంతర్గామి వానికారో ద్వీపసమీపంగావెళ్లి గిబ్బోవాద్వీపానికి సమీపంలో నిలబడుతుంది. అరోనా అనుచరులతో కలిసి ఆ ద్వీపంలో ప్రవేశిస్తాడు. ముగ్గురు గిబ్బోవాద్వీపంలో వేట ముగించుకొనివస్తూండగా హఠాత్తుగా ఒకరాయి వారిదగ్గర పడుతుంది. పిమ్మట కెప్టెన్ నీమో విద్యుదాయుధంతో ఆటవికుల నందరినీ హడలగొట్టి వేస్తాడు. క్రమంగా జలాంతర్గామి పగడాలదీవి చేరుకుంటుంది. చనిపోయిన నావికునికొకనికి అక్కడ సమాధి ఏర్పాటుచేస్తారు. కెప్టెన్ నీమో మన్నారు సింధుశాఖలో ఒక పెద్దముత్యం సంపాదిస్తాడు. పిమ్మట ఎంతోచాకచక్యంతో ఒక బెస్తవాని ప్రాణాలు సంరక్షిస్తాడు

22 గ్రీస్ ద్వీపావళి

క్రమంగా మాటడ కొన్ని వందల మైళ్ళు ప్రయాణంచేసింది.

ఒకనాడు తెల్లవారేసరికి జలాంతర్గామి నెమ్మదిగా నీటిమీదికివచ్చింది. నేను తొందర తొందరగా నాటిలస్ టాపుమీదికి వెళ్ళిపోయాను. నా కళ్ళకెదురుగా అనతిదూరంలో ఏదో ద్వీపాలసమూహం కనబడింది.

అనువాదం: "వినాయక"

7 గంటలయ్యేసరికి నెడ్‌లాండ్ కౌన్సెలు లిద్దరూ కలిసి టాపుమీదికి వచ్చారు.

నెడ్‌లాండ్ వెటకారంగా అడిగాడు:

"మనం అంతా ఏదో భూగర్భంలో ఉన్న సముద్రమార్గం గుండా సూయజ్ భూసంధిదాటి మధ్యధరాసముద్రంలో ప్రవేశించగలమని అన్నారే! ఆ సంగతి

ఏమైంది? మనమిప్పుడెక్కడ ఉన్నాము?"

"మధ్యధరా సముద్రంలోనే!" అన్నాను.

"అయితే ఆ సముద్రగర్భంలో ఉన్న మార్గంగుండా ఆ భూసంధి అప్పుడే దాటివేశామా?" అన్నాడు కౌన్సెల్.

"నిన్నరాత్రే అదంతా జరిగిపోయింది!"

"ఏమో అంతటి విడ్డూరం జరిగిందంటే నేను నమ్మను." అన్నాడు నెడ్ లాండ్.

"చాలా పొరబడుతున్నావు. దూరంగా మన కళ్ళకు కనిపించేది ఈజిప్టు తీరమే!"

"ఏమైనా నేను నమ్మను!" అన్నాడు నెడ్ లాండ్ అంతకన్నా బింకంగా.

"మన ప్రొఫెసర్ ఎప్పుడు అబద్ధం చెప్పరు!" అన్నాడు కౌన్సెల్.

ఆ మాటతో నెడ్ లాండ్ కు బాగా నమ్మకం కలిగింది.

"అయితే నేను మీతో ఒక విషయం మాట్లాడాలి!" అన్నాడ్ నెడ్ కొంచెం సంకోచిస్తూ.

మేమంతా టాపు మధ్య భాగానికి వెళ్ళిపోయాము. ఏకాంతంగా అక్కడ కూర్చున్న తరవాత నేను-

"నీవు చెప్పవలసిందేదో చెప్పవచ్చును" అన్నాను:

నెడ్ లాండ్ కొంచెంసేపు తమాయించి నెమ్మదిగా అన్నాడు.

"మనమిప్పుడు మధ్యధరా సముద్రంలో ప్రవేశించామని అంటున్నారు. మీరు చెప్పినది నిజమే అని నాకు తోచింది. అయితే ఒకమాట! కెప్టెన్ నీమో మళ్ళీ మనలనందరినీ దక్షిణ ధ్రువానికో, ఉత్తర ధ్రువానికో లాక్కుపోవచ్చును. అతని ఊహలెలాగ సాగుతాయో ఎవరు చెప్పగలరు? నేనెలాగో అలాగ ఈ జలాంతర్గామి విడిచిపెట్టి పారిపోవాలని అనుకుంటున్నాను."

ఈ విషయం నెడ్ లాండ్ తో ప్రసంగించడం అంటే నాకు మొట్టమొదటినించీ చికాకే. నా అనుచరులను నిర్బంధించాలని నేనెన్నడు అనుకోలేదు. గాని, నామట్టుకు నాకు కెప్టెన్ నీమోను విడిచి వెళ్ళిపోవాలని ఎన్నడు అనిపించలేదు. నేనెంతో జాగ్రత్తగా సాగరగర్భ రహస్యాలన్నీ పరిశీలిస్తున్నాను. అందుచేత నెడ్ లాండ్ తో ఇలా అన్నాను.

'నెడ్ లాండ్! నీకిక్కడ సుఖంగా కాలక్షేపం కావడం లేదా? నీకు కెప్టెన్ నీమోతో కలిసి ఉండడం ఇష్టం లేదా?

నెడ్ లాండ్ కొంతసేపేదో ఆలోచించి చివరి కిలాగన్నాడు:

"శ్రీసీ ఓడలో ఇంతకాలంగా ప్రయాణం చేసినందుకేమీ బాధపడడంలేదు. అయితే దేనికయినా ఒక అంతూదరీ ఉండాలి. అదే నా అభిప్రాయమని"

ఎప్పుడో అప్పుడు దీనికిక అంతనేది ఉండకపోతుందా? ఎందుకు నీకంత భయం?" అన్నాను అతన్ని కొంచెం ఓదారుస్తూ.

"ఎప్పుడు?"

"ఎప్పుడో నేనిప్పుడు చెప్పలేను గాని మనం సముద్రంలో చేర్చుకోవలసినవన్నీ పూర్తి అయిపోగానే మన ప్రయాణంకూడా పూర్తి అయిపోవచ్చును."

"అవును! ఎప్పుడో ఒకప్పుడు కెప్టెన్ నీమో మనల్ని విడిచిపెట్టకపోతాడా?" అన్నాడు కౌన్సెల్.

"ఏమో నాకంతటి ఆశలేదు. మనకి జలాంతర్గామి రహస్యాలన్నీ తెలిశాయి మనల్ని విడిచిపెడితే ఆ రహస్యాలన్నీ బయటపడిపోతాయేమోనని భయం కెప్టెన్ నీమోకుండడం సహజం! ఇంతకీ నేను చెప్పేదేమిటంటే కెప్టెన్ నీమో మనల నిక విడిపెట్టడం జరిగేపని కాదు."

"అయితే మనకింక ఆశేమిఉంది?" అని గద్దించి అడిగాడు నెడ్ లాండ్.

ఏదో అయిదారు నెలలలో మన పరిస్థితులు మారకపోతాయా? అప్పుడు మనం కొంచెం జాగ్రత్త పడాలి." అన్నాను.

"ఏమో! ఆరునెలలు గడిచిన తరవాత మనమెక్కడ ఉంటామో ఎవరు చెప్పగలరు?"

"మన అదృష్టం బాగుండి జలాంతర్గామి ఏ ఇంగ్లండు తీరానికో ఫ్రాన్సుదేశం తీరానికో చేరుకోకూడదా? అప్పుడు మనం దీనిలోనుంచి ఇవతలపడకూడదా?"

"ఇప్పుడు చేతికందిన అవకాశం జారవిడుచుకుని ముందెప్పుడో ఏదో జరుగుతుందనికూచుంటేఏంలాభం?

★ సాగరగర్భంలో సాహసయాత్ర ★

అలాగన్నతరవాత నాకతనికేమి చెప్పడానికీ తోచలేదు. నెడ్‌లాండ్ చెప్పినదానిలో ఎంతైనా ముందాలోచన ఉన్నదని అనుకున్నాను. అందుచేత కెప్టెన్ నీమో మనల్ని విడిచిపెడతాడనే ఆశ ఏమీ లేదనీ, అయితే పారిపోయేముందు అన్నివిధాలా జాగ్రత్తపడడం మంచిదనీ, ఒకసారి దొరికిపోతే మనందరిపనీ అయిపోయినట్లే అనీ అన్నాను.

"నెడ్‌లాండ్ కొంచెం సేపాలోచించాడు: "జలాంతర్గామి సాగరగర్భంలో ప్రయాణం చేస్తున్నప్పుడు మనం అంతా ఆ చిన్న నావలో కూడా పారిపోవడంకంటే వేరే గత్యంతరమేమీ లేదు."

"నిజమేగాని కెప్టెన్ నీమో మనలనందరినీ ఒకకంట కనిపెట్టి చూస్తూనే ఉంటాడు" అన్నాను.

"నాకూ అలాగే తోస్తూంది" అన్నాడు కౌన్సెలు.

"సరే! ఆ వ్యవహారం అంతా నేను చూసుకుంటానుగా!" అన్నాడు నెడ్‌లాండెంతో ధీమాగా.

"అయితే సరే! నీవు బాగా ఆలోచించి ఏదో ఒక దారి చూపించు! మేమిద్దరము నీవు చెప్పినట్లు నడుచుకుంటాము. ఇదంతా మాత్రం అతి రహస్యంగా ఉంచాలి. ఏమాత్రమైనా పైకి పొక్కిందంటే కొంప మునిగిపోతుంది. తెలిసిందా?"

మా సంభాషణ అంతటితో ఆగిపోయింది.

కెప్టెన్ నీమోకూడా మా వ్యవహారంఅంతా ఒక కంట కనిపెట్టి చూస్తున్నాడనే అనిపించింది. మధ్యధరా సముద్రంలో ఉన్నంతవరకు మా జలాంతర్గామి ఎప్పుడు నీటిలోపలే ఉండేది. ఎప్పుడైనా కొంచెంసేపు పైకివచ్చినా మధ్యధరా సముద్రతీరానికి బాగా దూరంలోనే ప్రయాణంచేసేది.

జలాంతర్గామి ఒకనాడు సాగరగర్భంలో ప్రయాణం చేస్తూండగా ఒక విచిత్రం జరిగింది.

నేను నాగదిలో కూర్చొని అద్దాలగుండా మధ్యధరా సముద్రగర్భంలోని అద్భుతాలన్నీ పరిశీలిస్తున్నాను. నాకళ్ల కెన్నెన్నో చిత్రచిత్రమైన రంగురంగుల చేపలు కనిపించాయి. అలాగ వాటి సొగసు చూచి ఆశ్చర్యపడుతూంటే హఠాత్తుగా ఒకమనిషి తల కనిపించింది మొట్టమొదట నేనెంతో ఆశ్చర్యపోయాను. బాగా జాగ్రత్తగా ఆ మనిషిని పరిశీలించాను నేను పొరబడలేదు. అతిడెవరో నూతన వ్యక్తే! ఎందుకో సాగరగర్భంలో ఈదుకుంటూ జలాంతర్గామి నంటిపెట్టుకుని వస్తున్నాడు. అంతలోనే కెప్టెన్ నీమో నాదగ్గిరికి వచ్చి ఆమనిషి కేసి చూచి ఒక చిరునవ్వు నవ్వాడు. నేనతని ధోరణి చూచి నిర్ఘాంతపోయాను.

"పాపం! ఎవరో సముద్రంలో పడిపోయి ఉంటాడు. వెంటనే మీరతన్ని రక్షించకపోతే చచ్చిపోయేటట్టున్నాడు. పాపం! అతన్ని రక్షించండి!" అని కేకలు పెట్టాను

సముద్రంలో పడి కొట్టుకుంటున్న మనిషి మెల్లిగా మేము చూస్తున్న అద్దం దగ్గిరికి వచ్చి తాపీగామా కేసి చూచాడు. కెప్టెన్ నీమో అతనికేదో సంజ్ఞ చేశాడు. వెంటనే అతడు సముద్రంలో మునిగిపోయాడు. మునిగిపోయే ముందు కెప్టెన్ సంజ్ఞలకు ప్రతి సంజ్ఞలతో సమాధానం ఇచ్చాడు. నేనా వ్యవహారం అంతా చూచి నోట మాట లేక అలాగే నిలబడిపోయాను.

కెప్టెన్ నావైపు చూచాడు:

"ప్రొఫెసర్ ! మీ రనవసరంగా కంగారుపడుతున్నారు. అతడు సముద్రంలో మునిగిపోడు. ఏమీ భయం లేదు. అతగాడిపేరు నికలస్. గజ ఈతగాడు. పొద్దస్తమానము నీటిలోనే ఉంటాడు. నేలమీద ఉంటే అసలతనికి తోచనేతోచదు. అతడీ గ్రీసుద్వీపాలమధ్యనే తిరుగుతూంటాడు"

నేను కెప్టెన్ మాటలు విని మరింత నిర్ఘాంత పోయాను

"అయితే మీకతడు బాగా పరి తుడే నన్నమాట!"


"అవును ! బాగా పరిచితుడే !"

తరువాత కెప్టెన్ నా పక్కనే ఉన్న ఒకచిన్న ఇనపబీరువా తెరిచాడు. దాని నిండా ఎన్నో బంగారపు ఇటికలున్నాయి.

కెప్టెన్ ఆ బంగారపు ఇటికలన్నీ ఎక్కడ సంపాదించాడో! ఆ ఇటికలన్నీ ఏం చేస్తాడో! ఎవరికోసం అవన్నీ జాగ్రత్త చేశాడో! ఇలాగ నాలో ఎన్నెన్నో ప్రశ్నలు బయలుదేరాయి.

అయినా నేనేమీ అనలేదు. అలాగే కళ్ళప్పగించి వాటికేసి చూస్తూ కూర్చున్నాను. కెప్టెన్ అవన్నీ జాగ్రత్తగా లెక్కపెట్టి ఇంకొక పెట్టెలో పెట్టాడు. వాటి అన్నిటిబరువు రెండువందల పౌనుల వరకు ఉండవచ్చును. ఖరీదు 2 లక్షల పౌనులవరకు ఉండవచ్చును.

(ఇంకా ఉంది)



పూర్వము పాంచాల దేశమును వీరసింహుడను రాజు పాలించుచుండెను. ప్రజలను కన్న బిడ్డలవలె జూచుచు వారిసౌఖ్యమే తన సౌఖ్యముగాను వారి యిక్కట్టులె తన యిక్కట్టులుగాను భావించుచు రాజ్యము కడు చాకచక్యముగా పాలించుచుండెను. కాని అతనిలోని ముఖ్య లోపమొకటి కలదు. అతడు దయ, కోపము హద్దులో నుంచుకొనలేని ఆగ్రహపరుడు. ఆ రాజ్యమునకు ధర్మబుద్ధి అనువాతడు మంత్రిగా ఉండెను.

ఒకనాటి నిండు పేరోలగమున రాజు వీరసింహుడు మంత్రిని పిలిచి 'మంత్రివర్యా! తమను నేను మూడు ప్రశ్నలడిగెదను. ఆ ప్రశ్న

లకు తత్క్షణము ఉన్నపాటున సరియైన సమాధానము చెప్పవలయును' అనెను. మంత్రి 'సరే! ఆ ప్రశ్నలు సెలవిండు! జవాబు చెప్ప ప్రయత్నించెద'నని వినమ్రుడై పల్కెను. అంతట రాజు ఇవే నా మూడు ప్రశ్నలు: "భగవంతుని ఉనికి ఎక్కడ? ఆ భగవంతుడేమి చేయుచుండును? నేను నా మదిలో ఏమని తలంచుచున్నాను?" అని ప్రశ్నించెను. మంత్రివర్యున కెంతతడ వాలోచించినను జవాబులు దొరకలేదు. రాజుకు నమస్కరించి 'మహారాజా ఈ ప్రశ్నలు కడు కఠినముగా ఉన్నవి. జవాబు లున్నపాటున మనవిచేయుట చాల దుష్కరము. ప్రభువులు కరుణించి ఒక పక్షము రోజులు గడువిచ్చిన దీర్ఘాలోచన చేసి సరియైన సమాధాన మిత్తు'నని మనవి చేసెను. రాజు సరే అని నీవు కోరినట్లు పక్షము రోజులు గడువిచ్చుచున్నాను. ఈలోపల సరియగు జవాబు చెప్పలేనియెడల నీ శిరస్సు దీయించి కోటగుమ్మమునకు వేలాడగట్టించెదను. అని పల్కెను.

మంత్రి రాజసభనుండి తన భవనమునకువచ్చి ఒంటిగా తన పడకగదిలో గూర్చుండి ఆలోచించెను. ఎంత తలపగులగొట్టుకొన్నను మహారాజడిగిన ప్రశ్నలకు సమాధానములు తోచలేదు. గడువు లోపల జవాబులు చెప్పకున్నచో తన ప్రాణములు రాజు తప్పక తీయించునని తలచి మంత్రి దిగులు చెందెను. ఆ మనోవ్యాకులతచే ఆహారము సయించుటలేదు. కంటికి కునుకులేదు. పాపము! ధర్మబుద్ధి నానాటికి తీసిపోవుచుండెను. దినములు గడుచుచుండెను ఇక రెండు దినములు మాత్రమే వ్యవధియుండెను.

ఆ మంత్రికి పనిచేయు మంగలి అచ్చముగా మంత్రి వలె ఉండును వారిరువురును ఒకేరకపు దుస్తులు ధరించిన గుర్తించుట అశక్యము మంత్రి దిగులునకు కారణమా మంగలియెరిగి మంత్రిని సమీపించి 'అయ్యా! ప్రభువులకు బదులుగా ఆ మూడు ప్రశ్నలక్కు రాజుగారి ఎదుట నేను సమాధానములు చెప్పెదను మీరు ధరించు దుస్తులు మాత్రము నాకిప్పింపుడు మీరు దిగులు జెందకు'డని పల్కెను. మంత్రి కొంచెముసేపాలోచించి జరుగునది జరుగక మానదని నిశ్చయించి మంగలి కోరినట్లు తన దుస్తులు వానికిచ్చెను.

రాజుగారి ప్రశ్నలకు ఈనేళ జవాబు లీయబడునని పురమంతయు దండోరా వేయబడెను దర్బారంతయు యిసుక వేసినా రాలనట్లు క్రిక్కిరిసి ఉండెను. రాజు మంత్రిని పిలిచి నా ప్రశ్నలకు జవాబులిచ్చుటకు సిద్ధముకమ్మని యాజ్ఞాపించెను. మంత్రి వేషమున నున్న మంగలి రాజునకు నమస్కరించి 'ప్రభూ! చెప్పెడువా రెప్పుడును ఉన్నత స్థానమునను, వినెడువా రెప్పుడును క్రింద నుండుట వాడుక. కావున తమరు నా స్థానమున నిలువబడి మీ గద్దె నాకిప్పింపుడు, అని అతివినయముతో మనవి జేసెను. రాజంగీకరించి మంగలి జెప్పినట్లు చేసెను.

మంగలి సింహాసనముపై కూర్చుండి సేవకునిచే ఒక కాగడా తెప్పించి 'అయ్యా ఈ కరదీపిక కాంతి ఎక్కడ నున్నదో సెలవిండు' అని పల్కెను. "అంతట నున్నది" అని వీరసింహుడు జవాబిచ్చెను మీ మొదటి ప్రశ్నకు సమాధాన మదియే. ఈ కాంతి వలెనే భగవంతుడును సర్వాంతర్యామి. ఇక రెండవ ప్రశ్నకు సమాధానము ఆలకింపుడు. 'మహాసామ్రాజ్యాధిపతులయిన మిమ్ము సింహాసనము నుండి దింపి నన్నెక్కించినాడు ఓడలు బండ్లు, బండ్లు ఓడలగునట్లు భగవంతుడే పైవారిని క్రిందికి, క్రిందివారిని పైకి మార్చుచుండును. ఇదంతయు ఆయన లీల. మరి మూడవ ప్రశ్నకు జవాబు చెప్పెద వినుడు. ఈ క్షణములో తమరు నన్ను తమ మంత్రిగానే మీ మదిలో భావించుచున్నారు. నిజముగా, నేను మంత్రి ధర్మబుద్ధిని గాను. నేను వారి మంగలిని. అని పల్కి వాడు గద్దెదిగి రాజు పాదములకు నమస్కరించి 'మహారాజా! మంత్రివర్యులు చెప్పిన విధమున చెప్పితిని. ఆపైన తమ అనుగ్రహము. మా ప్రాప్తి యని వినయముగా పల్కెను. మంగలి తెలివికి వాని యుక్తికి సభాసదులందరు మెచ్చిరి.

వీరసింహుడు మంగలి యుక్తికి సంతసించి ధనముతోను, మాన్యములతోడను వానిని సత్కరించెను. మంత్రి ఎప్పటియట్ల కొలువుసాగించుచుండెను ధర్మబుద్ధి తన ప్రాణములు కాపాడిన మంగలితో స్నేహభావముతో మెలగుచు వాని నెంతో గౌరవించెను.

★

అడవిలో అపరాధ పరిశోధన

కుం. జానకిరామ్ పట్నాయక్

చాలా కాలం కిందట బొబ్బర లంకలో ఒక చిట్టడవి ఉంటుం డేది. అక్కడ ఉన్న జంతువులు, పక్షులు, పాములూ ఎంతో స్నేహంతో కలిసి మెలిసి ఆనం దంగా కాలం గడుపుతుండేవి. పిల్లల చదువుకోసం అవి చిన్న బడిని తెరి చాయి. ఆ బడిలో వయసొచ్చిన పిల్లలంతా చదువుకుంటుండేవారు.

చిలకమ్మ మైనావతి పాఠాలు బోధించేవి. కోకిలరాణి బుల్ బుల్ కన్యా సంగీతం చెప్పేవి. నెమలి బాయి నాట్యం చేశ్శేది. అశ్వ మూర్తి డ్రిల్లు చెప్పేవాడు.

ఆ బడిలో చదువుకుంటూన్న పిల్లలందరిలోనూ భల్లూకరావు, జంబుకేశం చాల తెలివైనవాళ్ళు. భల్లూకరావు బలంలో గొప్పవాడు జంబుకేశం చలాకీలో గట్టివాడు. హనుమయ్యని ఇంకో అబ్బాయి ఉన్నాడు. వాడు ఒట్టి మందమతి - బడిదొంగ!

భల్లూకరావు ఎలుగుబంటి కొడుకు. జంబుకేశం నక్కపోతు మేనల్లుడు. హనుమయ్య శిలీముఖి అనే కోతమ్మ తమ్ముడు.

వీళ్ళుకాక కొంతమంది ఆడ పిల్లలు - మకరాంబ, వాయసమ్మ, గోరాబాయి, పిచికతల్లి మొదలైనవాళ్ళు - చదువుకుంటు న్నారు.

భల్లూకరావు, జంబుకేశం ప్రాణ స్నేహితులు. ఒక కంచాన తిని ఒక మంచాన పరున్నట్టు ఉండేవారు.

ఒక ఆదివారం ఉదయం భల్లూకరావు, జంబుకేశం ఆటకోవ టానికి గోదావరి ఒడ్డుకు వెళ్లారు. ఆ దగ్గరలోనే మకరేశ్వరి యిల్లు ఉన్నది. ఆ యింట్లోనుంచి ఏడు పులూ పెడబొబ్బలూ వాళ్లకు విన వచ్చాయి! వెంటనే ఆ స్నేహితు లిద్దరూ మకరేశ్వరి యింట్లోనికి పరు వెత్తారు!

అక్కడ మకరేశ్వరి తల విర బోసుకొని నెత్తి మోదుకుంటూ ఆరున్నొక్క రాగంలో ఏడు స్తున్నది. మకరయ్య వూళ్ళో లేడు. తీర్థయాత్రలకు వెళ్ళిపోయాడని వదంతి. మకరాంబ కూడా తల్లి రాగంతో తన రాగం కలిపి గోల పెడుతున్నది!

భల్లూకరావు మకరేశ్వరి దగ్గర నిల్చొని "ఏఁవయిందత్తయ్యా? ఎందు కేడుస్తున్నావ్?" అని అడి గాడు. జంబుకేశం "ఏం పిన్నీ చిన్నాన్ననుంచి ఏదయినా ఉత్తరం వొచ్చిందా?...అతను బాగు న్నారా?" అని పరామర్శించాడు.

మకరేశ్వరి ఏడుపు మరింత ఎక్కువైపోయింది. నోటినుంచి మాటరాలేదు.

భల్లూకరావు మకరాంబ తల మీద చేయివేసి "ఏమేపిల్లా ఎందు కేడుస్తున్నావ్?" అని అడిగాడు.

మకరాంబ బెక్కుతూ "అమ్మ.. ఏ...ఏడుస్తుందని నే...నేను...ఏడు స్తు...న్నా...న్నా ను...బావా!" అన్నది.

జంబుకేశం తిరుగా మకరేశ్వ రితో అన్నాడు—"ఏఁవిటైంది పిన్నీ?...ఇలా యేడ్చుకుంటూ కూచుంటే ఏంలాభం చెప్పు?"

మకరేశ్వరి ముక్కుచీది, చీర చెంగుతో తుడుచుకొని, జుత్తు సవ రించుకుంటూ అన్నది—

"ఏం చెప్పమంటావ్ నాయనా? ఎవరో దొంగముండ వాళ్లు నా, యిల్లంతా దోచుకు పోయారు!... నా సర్వస్వం ఎత్తుకుపోయారు! మీ చిన్నాన్న యింటి పట్టన వుంటే యిలా జరిగేదా?...ఇదంతా నా ఖర్మం!"

"అదేఁవిటత్తయ్యా? మామయ్య తీర్థయాత్రలకు వెళ్లాడటకదా?" అన్నాడు భల్లూకరావు.

"తీర్థయాత్రలకేఁవిటి నా పిండా కూడు?—ఉన్న సంగతి చెప్తా కుంటే సిగ్గుచేటని ఇలా ఏడవాల్సొ స్తుంది!...కడుపు చించుకుంటే కాళ్లమీద పడుతుంది బాబూ!" అన్నది మకరేశ్వరి ఉదాసీనంగా!

"అయితే ఎక్కడ వున్నట్టు?" అన్నాడు జంబుకేశం.

"ఎక్కడా?...ఉందిగా ఆ మాయలమారి ముండ శిలీముఖి నాపాలిట దేవతాదేవిలా? ... మీ

బడిలో చదువుతున్నాడే ఆ గుంటడు హనుమయ్య ... వాడి అప్ప! ... అదిచ్చినపండ్లూ, కాయలూ, బాగా తిని, ఆ తొత్తుకు మరిగి, నన్నూ నాపిల్లనూ ఒదిలేశాడు!... పోనీలే బాబూ! అతను పోతే నా కేంవిటి లక్ష్యాం? నా పిల్లను చూసుకొని కాలం గడిపేద్దాంవని అనుకున్నాను! కాని యింతలో ఈ ఆపద చుట్టుముట్టుకుంది!" అన్నది మకరేశ్వరి.

భల్లూకరావూ, జంబుకేశం ఆ మాటలు విని, ఒకరి ముఖం ఒకరు చూసుకున్నారు. కాస్త దూరం పోయి గుసగుసలాడుకొని తిరుగా మకరేశ్వరి దగ్గరకొచ్చి భల్లూకరావు యిలా అన్నాడు—

"అత్తయ్యా! నువ్వు బెంగపడకు! నేనూ, మా జంబూబావ ముల్లోకాలు వెతికి అయినా నీ ఆస్తినీ, దాన్ని దోచుకుపోయిన దొంగల్నీ పట్టుకొని నీకు ఒప్పచెపుతాం!"

జారిపోతున్న పైటను సర్దుకుంటూ మకరేశ్వరి అన్నది—

"నాయనా! మీరు చిన్నపిల్లలు! లోకజ్ఞానం లేదు. అదీగాక ఇది దొంగల్తోటి వ్యవహారం! అనవసరంగా నాకోసం మీ రెందుకు కష్టాలు కొనితెచ్చుకుంటారు?"

అందుకు జంబుకేశం గర్వంగా నిల్చొని, మీసందువ్వుతూ ఇలా అన్నాడు—

"పిన్నీ! నువ్వు భయపడకు! దొంగలు కూడా మనలాంటివాళ్లే! ఆకాశంనుంచి ఊడబొడుచుకు రాలేదు! వాళ్లేం చేస్తారు?... నేను ఎన్నో వందల డిటెక్టివు నవలలు చదివాను! గొప్పగొప్ప అపరాధాల్ని పరిశోధించే తెలివితేటలు నాదగ్గర ఉన్నది!... కాగా భల్లూకబ్బావ కలిశాడ అంటే పద్నాలుగులోకాలూ జయించేస్తాం! మా విషయంలో నువ్వు బెంగపెట్టుకోవద్దు!... ఇప్పుడు నిన్ను కొన్ని ప్రశ్నలు అడుగుతాను. తెలిసినంతవరకు దాచకుండా జవాబులు మాత్రం ఇవ్వు!"

"ఏంవిటేంవి టడుగుతావో అడుగు నాయనా! దాచకుండా నే చెబుతాను!" అన్నది మకరేశ్వరి.

"ఏమాత్రం ఆస్తి పోయింది?"

"వందతులాలబంగారం, ఏభయి తులాల వెండీ, పట్టుపంచలు పది, పట్టుచీరలు పదిహేను పోయాయి!"

"నీకింత ఆస్తి ఎలా వచ్చింది?"

"మోక్షంకోసం యీ నదిలో స్నానానికి చాలమంది మనుషులు వస్తుంటారు కదూ?...మరివాళ్లేగా మాకు ఆహారం!...సమయం కనిపెట్టి వాళ్లను చంపుకొని తింటుంటాం!...యీ ఆస్తి అంతా వాళ్లనుంచి సంపాయించిందే!"

"దీన్నంతా ఎక్కడదాచావు?"

"అదిగో!... ఆ కిటికీ మీద పెట్టెలో!"

"పెట్టెకు తాళం వేశావా?"

"తాళం ఎప్పుడూ వేయను!"

"ఈ యింట్లో నువ్వూ, మకరాంబా తప్ప ఇంకా ఎవరెవరు ఉన్నారు?"

"మరెవరూ లేరు"

"ఇక్కడకు రోజూ ఎవరెవరొస్తుంటారు?"

"మీ చిన్నానన్న వెళ్లిపోయిన నాటినుంచీ ఎవరూరా లేదు. అంతకు పూర్వం మాత్రం అప్పటప్పటా మా బావగార్లూ, మత్స్యకుటుంబాలవాళ్లూ వస్తూండేవాళ్ళు!"

"వాళ్లలో ఎవరిమీదనైనా నీకు అనుమానం ఉందా?"

"రామరామ!...వాళ్లలాంటి నిజాయితీపరులు యీ సప్తసముద్రాల్లో కూడా లేరంటే నమ్మ!"

"పోనీ మీకు విరోధులెవరైనా ఉన్నారా?"

"అలాంటివాళ్లూ లేరు!"

జంబుకేశం పూరుకొని ఆలోచిస్తున్నాడు. తరువాత భల్లూకరావు అన్నాడు—

"అయితే అత్తయ్యా! ఆ వస్తువులూ, బట్టలూ ఆఖరుసారిగా ఎప్పుడు చూశావ్?"

"రాత్రి పడుకోబోయినప్పుడు!"

★ అడవిలో అపరాధ పరిశోధన ★

అంతలో జంబుకేశం చెవులు నిడిగించి, తోకఝూడించి అన్నాడు-

"పిస్నీ! నాకో అనుమానం వేస్తున్నది?"

"ఏమిటి నాయనా?"

ఏమీ అనుకోనంటే చెబుతాను!"

"అయ్యో తండ్రీ...ఎందుకనుకుంటాను?"

"దీంట్లో చిన్నాన్న చెయ్యి ఏమైనా ఉందేమో?"

"ఛా ఛా! అతనెందుకు చేయిస్తాడు? తన డబ్బును తనే దొంగతనం చేయిస్తాడా?......నాకు నమ్మకంలేదు!"

భల్లూకరావు ఒకసారి శరీరం దులపరించుకొని నవ్వి అన్నాడు—

"ఒరేయ్ జంబూ! నువ్వేమో మాంచి టక్కరివాణ్ణని అనుకొంటున్నావు! కాని నీ తలకాయలో ఉన్నదంతా ఒట్టి బురద అంటాను నేను!...లోకంలో ఎవరైనా తన ఆస్తినే దోపిడీ చేయించుకుంటార్రా?"

దానికి జంబుకేశం పండ్లికిలించి యిలా అన్నాడు--"నోరుముయ్యరా భల్లూ! నీకున్నదంతా కండబలమే గాని బుద్ధిబలం లేదురా! తప్పక యీపని అతను చేయించిందే! లేదా స్వయానా తనైనా చేసి వుంటాడు!...అలా చూస్తూఉండు! నీకే తెలుస్తుంది!"

వాళ్ళ మాటలు విని మకరేశ్వరి కళవళించుకొని అన్నది—

"ఏమో నాయనా! ఇది కలికాలం! జంబూ అన్నది నిజమే కావొచ్చు!...ఇంతకూ ఎవరుచేసినా లేక చేయించినా మొత్తంమీద నాకొంప ముంచేశారు!"

"సరే అత్తయ్యా! నువ్వు గాభరాపడకు! నేనూ, జంబూ కలిసి యిందులో పనిచేస్తాం!...వారం రోజుల్లోగా దొంగనూ, ఆ ఆస్తినీ పట్టుకొని నీకు ఒప్పచెబుతాం!" అన్నాడు భల్లూకరావు

"అవును పిస్నీ! నీ ఆస్తి తెచ్చి యిచ్చే పూచీ మాది! నువు విచారించుకొని ఉండొద్దు!" అన్నాడు జంబుకేశం.

* * *

ఆ స్నేహితులిద్దరూ పరిశోధనకు పూనుకున్నారు. గదిలో ఏమయినా అడుగుజాడలు దొరుకుతవేమో అని దీక్షగా పరీక్షించారు! నగలూ బట్టలూ ఉన్న పెట్టెమీద వ్రేలి ముద్ర లుంటవేమో అని చూశారు!...కాని ఏ ఒక్క గుర్తూ దొరకలేదు!...కిటికీకి యినప పూచలు లేవు! లోనుంచి వేసే గడియలుమాత్రం వూడిపోయి వున్నయ్! బయటనుంచి బలవంతంగా త్రోయడంవల్ల వూడిపోయినట్టుగా ఉన్నవి.

ఇంట్లో ఎలాంటి ఆధారం దొరకనందువల్ల బయట కొచ్చి చూడనారంభించారు!

కిటికీకి దిగువ కొంచెం దూరంలో ఒక నేరడి పండు జంబుకేశానికి దొరికింది. దాన్ని చేతిలోనికి తీసుకొని అతడు దీక్షగా చూశాడు! ఆ పండు మీద ఎవరివో దంతాల గుర్తులున్నాయి!... మీద రెండు గుర్తులూ, దిగువ రెండు గుర్తులూ జంబుకేశం స్పష్టంగా చూశాడు!

వెంటనే భల్లూకరావుకు చూపిస్తూ "ఒరేయ్ భల్లూ! దీన్ని చూశావట్రా?" అన్నాడు.

"చూస్తూనే వున్నానురా!... నేరడిపండు కాదట్రా?" అన్నాడు భల్లూకరావు!

"అవునులే! నేరడిపండే!...కాని యిక్కడకు ఎలా వచ్చిందని?" అడిగాడు జంబుకేశం.

"ఎవరో తోవంట పోయినవాళ్లు గంట్లుపెట్టి పారేసిఉంటారు!" అన్నాడు భల్లూకరావు నిర్లక్ష్యంగా.

జంబుకేశం గట్టిగా నవ్వి, తోకఝూడించి అన్నాడు.

"అందుకే నీకు కండబలమేగాని బుద్ధి బలం లేదని అంటుంటాను!"

"ఇందులో బుద్ధిబలం చూపడానికి ఏమిటుంది?" అని బొమలెగరవేశాడు భల్లూకరావు.

ఏముందో చెప్తాను పద! దొంగ ఆచోకీ దీని మూలంగానే దొరుకుతుంది! అలా చూస్తూ ఉండు! నగంతా నీనోటినుంచే రప్పిస్తాను!... పద! మన బడి కాంపౌండులో మామిడిచెట్టు దిగువ కూచొని మాటాడుదాం!"

ఆ యిద్దరూ అక్కడకు చేరుకున్నారు! జంబుకేశం నేరడిపండు చూపిస్తూ అన్నాడు.

"ఈ పండు ఎక్కణ్ణుంచి వచ్చిందని నీ అభిప్రాయం?"

"ఇందాకనే చెప్పానుగా ఎవరో తోవంట పోయిన వాళ్లు పారేసి ఉంటారని! అన్నాడు భల్లూకరావు.

"అది కాదోయ్ బావా!... చూడు! మకరేశ్వరి యింటి చుట్టుపట్లకాని ఈ బడి చుట్టుపట్లకానీ... ఇంకా యీ ప్రాంతాల్లోగానీ నేరేడు చెట్లు ఉన్నయా?

ముట్టె పైకెత్తి, కండ్లు మూసి భల్లూకరావు కాసేపాలోచించి "లేవు" అన్నాడు.

"పోనీ నీకు తెలిసినంత వరకూ మరెక్కడైనా ఉన్నాయా?"

"ఈ చుట్టుపట్ల ఎక్కడా లేనట్టే జ్ఞాపకం!"

"కాని ఒక దగ్గర ఉన్నాయి!''

"ఎక్కడ?"

"శిలీముఖ యింటి నమీపంలో!"

"ఆఁ! ఆఁ!...అవును! అక్కణ్ణే రెండు మూడు చెట్లు...పెద్దవి... ఉన్నాయ్!

"అయితే ఈ పండు అక్కణ్ణుంచి ఎలా వచ్చిందంటావ్?''

భల్లూకరావు తిరుగా ఆలోచనలో పడిపోయాడు. కాసేపటికి "నువ్వన్నట్టు మకరయ్య దొంగతనాని కొచ్చి దీన్నికాస్త కొరికి తొందరలో పారేసి ఉంటాడు!" అన్నాడు.

జంబుకేశం నవ్వి "కాదు! మకరయ్య ఎంతమాత్రం దొంగతనానికి రాలేదు!" అన్నాడు.


"అయితే?' తల గోక్కుంటూ భల్లూకరా వడిగాడు.

"ఈ పండు బాగా చూడు!... దీనిమీద పడ్డ గంట్లుచూస్తే మకరయ్య పెట్టినవాటిలా కనిపించలేదు!...మకరయ్య దంతాలు పెద్దవి! ఈ పండుమీది కాట్లు సన్నంగా, చిన్నవిగా ఉన్నాయ్!... కాగా మకరయ్య ఇలాంటి పండ్లను దవడ పండ్లలో పెట్టి కసాబిసా నమిలివేస్తాడు! కాని యిలా ముని పండ్లతో గంట్లు పెట్టడు!...దీన్ని బట్టిచూస్తే ఈ వ్యవహారంలో మకరయ్య లేనట్టు రూపించిపోతున్నది కదా?"

"అవునవును!...బహుశా శిలీముఖ వచ్చిందేమో?"

"లేదు!...అదీ రాలేదు!...నువ్వు మర్చిపోయావేమోగాని నాకు మాత్రం జ్ఞాపకం ఉంది! శిలీముఖ ముందరిపండ్లలో ఒకటి పూడిపోయింది! అదేగాని యీ పండును కొరికివుంటే ఈ మాదిరీ నాలుగు గంట్లుపడవు!...తెల్సిందా?"

(మిగిలినది పైవారం)



వాత్సల్యము (ప్లాస్టరు ఆఫ్ పారిస్ శిల్పానికి నమూనా)

—కుమారి శ్యామా కౌండిన్య, కడప.

★ బొంబాయి సినిమా లేఖ ★

(36-వ పేజీ తరువాయి)

నిర్మించినవారు ఈ ఉత్సవాలకు ఉత్సాహంతో వెళ్ళి నిరుత్సాహులై రిక్తహస్తాలతో తిరిగి రావడం ఏమంత ఆశ్చర్యకరమైన విశేషం కాదు విశేషమల్లా వారలా తిరిగి వచ్చే ముందు, విలేఖరులను ఫొటోగ్రాఫర్లనూ తమకోసం విమానాశ్రయాలకు పంపమని పత్రికా కార్యాలయాలకు కబుర్లు పంపడం.

తెలిసి తెలిసి విఫల ప్రయత్నాలు చేసి, లెక్క ప్రకారం విఫలులై తిరిగివచ్చే ఈ తరహా వాళ్ళే "డాక్యుమెంటరీలు డల్‌గా ఉంటా"యంటూ గంభీరంగా విమర్శలు వినుపుతూ ఉంటారు. సృజనాత్మకంగా వాస్తవికతను చిత్రించి చూపేది డాక్యుమెంటరీ అని సుప్రసిద్ధ బ్రిటిష్ చలనచిత్రకళాకారుడు జాన్ గ్రీర్‌సన్ 20 ఏళ్ళనాడే ప్రవచించారు ఈ అర్థ నిర్వచనం ప్రకారం డాక్యుమెంటరీ సృజనాత్మక మైనదిగా, వాస్తవాన్ని చూపేదిగా, దాన్ని చక్కగా తెలిసేలా చిత్రించేదిగా ఉండాలన్నమాట అంటే ఈవిధంగా తయారైన చిత్రం ఎక్కడా ఏ మాత్రం చప్పగా నీరసంగా వుండదు.

ఈ ఉత్తమమైన డాక్యుమెంటరీ అని గట్టిగా చెప్పి చూపించదగ్గ ఇటీవలి చిత్రాలలో "ఖజురాహో" ఒకటి ఫిలింస్ డివిజన్ నిర్మించిన ఈ చిత్రానికి శ్రీ మోహన్ వాధ్వానీ దర్శకుడు. భారతీ చలనచిత్ర పరిశ్రమలో దీనికి లేనంతగా ఈ చిత్రానికి విమర్శకుల ప్రేక్షకుల ప్రశంసలు లభించాయి. అద్భుతమైన ఛాయా గ్రహణం, దానికి జీవంపోసి చైతన్యవంతం చేసేవిధముగా, చక్కని సంగీతం, ప్రకృతి ఉపశ్రుతులు, మేళవించిన ఈ చిత్రం ఎంతో రక్తికరంగా వుంది ఖజురాహోలోని 11వ శతాబ్దపు ఆలయ శిల్పాలను చూస్తూ ఉంటే వాటితో వినబడే సంగీతం శ్రవణేంద్రియాలను సోకుతూంటే, "ముక్తి సాధనకు భక్తి ముఖ్యం" అన్న ఆనాటి శిల్పుల హృదయపూర్వక విశ్వాసం ప్రేక్షకుడికి గోచరిస్తుంది. గొప్ప అనుభూతిని కలిగిస్తుంది ఖజురాహో ఆలయ శిల్పాలు అవినీతికరముగా ఉన్నవంటూ కొందరు నీతిపరులు విమర్శించారు కొందరు ఆ ఆలయ శిల్పాలను ధ్వంసం చేయాలని గట్టిగా అభిప్రాయ పడ్డారు. ఈ కోవకు చెందినవారి ఊహాపోహలెలా ఉన్నా సామాన్య అభిప్రాయాలుగల ప్రేక్షకుడికి మాత్రం. ఈ చిత్రం చూసినప్పుడు, మోహన్ వాధ్వానీమీద కోపం రాదు. శిల్పాలమీద జుగుప్స కలగదు. ఎంతో గౌరవం కలుగుతుంది. శతాబ్దాల యేళ్ళనాడు, వాటికి రూపకల్పన చేసిన శిల్పుల పవిత్ర సంకల్పాలే మనసులో మెదలుతాయి ★

దంపతులలో హెచ్చుతగ్గులు

(44 వ పేజీ తరువాయి)

చేతిపనులలో ప్రావీణ్యంకలవారు కూడా సగటున గుమస్తా జీతముకంటే అధికంగానే సంపాదించగలుగుతున్నారు!

పై పరిస్థితులేకాక, రాజకీయంగా కలిగిన మార్పు స్త్రీలను మరికొంత ముందుకు తీసుకొని పోగలుగుతున్నది. స్త్రీలకు ఓటింగు అధికారం లభించింది. పురపాలకసంఘాలలోనూ శాసనసభలలోనూ స్త్రీలకుకూడా ప్రవేశం లభించింది వీటిలో ఎన్నికఅయిన స్త్రీలు పురపాలక సభ్యురాండ్రుగాను, అధ్యక్షురాండ్రుగాను కృతార్థులయే అవకాశమున్నది శాసనసభా సభ్యత్వమే కాకుండా, మంత్రి పదవుల నలంకరించే అవకాశంకూడా ఏర్పడ్డది.

ఈ విధంగా అడుగడుగునా స్త్రీలు పురుషులను మించిపోయే అవకాశాలు అనేకంగా, ఈ కాలాన ఒదిగి వచ్చాయి. ఒక సామాన్యుడి భార్య పురపాలక సంఘాధ్యక్షురాలుగా ఎన్నిక కావచ్చు; మంత్రి పదవికి రావచ్చు. పురుషులకు మాత్రం స్త్రీలు అభివృద్ధిచెందవలెనని ఉండదా?

ఏ కాలంలో నయినా, స్త్రీ జనాభ్యుదయాన్ని కాంక్షించిన పురుషులు అంటున్నారు. పురుషులతో పాటు, కృషివల్లనే స్త్రీలు ఇంతవరకూ సాధించగలిగారు ఇకముందయినా, భారతీ ప్రధానికంటే విశాల హృదయుల తోడ్పాటువల్లనే అభివృద్ధి చెందగలుగుతారు.

స్త్రీలకు పురుషుడిని మించగలిగిన అవకాశాలు కల్పించిన ఈ కాలములో, సంఘం తన దృష్టిని మార్చుకొని వ్యక్తులకు ఉత్సాహాన్నీ, ఉల్లాసాన్నీ ఇవ్వటానికి సిద్ధపడాలి. కాలంతో పాటు పురోగమించిన సమాజం తప్పక అభివృద్ధిచెందుతుంది. అయితే సమాజం మాత్రం ఏం చేస్తుంది, వ్యక్తులసహాయము లేనిదే? సమాజ దృష్టి మారాలంటే, వ్యక్తులే కదా, కృషి చేయవలసింది? ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Andhra Patrika Press, 6 & 7, Thambu Chetty Street. Madras-1. Editor S. Sambhu Prasad.



"వి లా సి ని" (జయపూర్)

—ఫొటో: సక్కుల మునుస్వామి

Regd. No. M. 4479 Andhra Patrika Illustrated Weekly